18-8Pg1exHMNWJQE.qxd:18-8Pg1exHMNWJQE.qxd 1/1/02 9:28 AM Page 1

ఆదివారం 'వార్త' మెయిన్‌లో గత వారంలో విడుదలైన పుస్తకాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
18-8-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 198 పేజీలు: 12 వెల: 6.50

తెరచుకున్న శబరిమలై ఆలయం
5లో
గాజా పౌరులకు వీసాలు నిలిపివేసిన యుఎస్

# వర్షపు నీరు రిజర్వాయర్లకు మళ్లింపు


ఆదివారం న్యూఢిల్లీలో ప్రాజెక్టులు ప్రారంభించి, నిర్మాణ రంగ కార్మికులతో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

## వికసిత్ భారత్‌కు 'ఢిల్లీ' ఒక నమూనా

### రూ. 11వేల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభించాం

### దేశంలో మొట్టమొదటి 8 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేలు: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** దేశరాజధాని ప్రాంతం, రాజధాని నగరం చుట్టూ బిజెపి పాలన కొనసాగుతోందని, దీన్ని చూసే కొందరు ఓర్వలేకపోతున్నారని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. బిజెపి భారీ ఎత్తున చేపట్టిన అభివృద్ధిని చూసి వారికి వణుకు ప్రారంభం అయిందన్నారు. మనకే ఢిల్లీ ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయని చూపిస్తుందని కొందరు దీన్ని తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. వారంతా ప్రజలకుదూరంగా ఉన్నారన్నారు. నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో దాదాపు రూ.11 వేల కోట్ల విలువైన రెండు కీలకమైన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతికి అంకితం చేశారు. వీటిలో ఢిల్లీ సెక్షన్ లోని ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ 2 ఉన్నాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఢిల్లీ, హర్యానా ముఖ్యమంత్రులు రేఖ గుప్తా, నయాబ్‌సింగ్ సైనీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ముండ్కాలో రోడ్ షో నిర్వహించారు. ఢిల్లీకి ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ కనెక్టివిటీ లభించనున్నది. >>2

### జలవనరుల సంరక్షణతోనే భూగర్భ జలాల పెంపు

### వచ్చే 10,15 రోజుల్లోగా చెరువులకు, కాల్వలకు, చెక్ డ్యామ్‌లకు మరమ్మత్తులు!: సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఆగస్టు 17, ప్రభాతవార్తప్రతినిధి:** నీటి వనరులను పూర్తి స్థాయిలో సంరక్షించిన్పపుడే భూగర్భ జలాలు పెరుగుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. రాష్ట్రంలో సాగు నీటి సంఘాల నిర్వహణపై సిఎం చంద్రబాబు తరచు సంబంధిత శాఖాధికారులతో ఇంట రాక్ట్ అవుతున్నారు,అందులో భాగంగా సమర్ద నీటి నిర్వహణాంశంపై ముఖ్యమంత్రి పలు ఆదేశాలు జారీ చేస్తున్నారు. సిఎంఒ అందించిన సమాచారాన్ని అనుసరించి. వర్ష కాలంలో పడే నీటిని చెరువుల్లో నింపాలని సిఎం చంద్రబాబు అన్నారు. వెంటనే కాల్వల్లో పూడిక తీయాలన్నారు. పంట కాల్వల నిర్వహణ సరిగా ఉండాలి, వరద నీటి పారుదలకు ఇబ్బంది లేకుండా కాల్వల నిర్వహణ చేపట్టాలి. చెరువులు, కాల్వలను ఏర్పాటు చేసుకోవడం ఎంత ముఖ్యమో.. నిర్వహారణ చేపట్టడమూ అంతే ముఖ్యం. గత ప్రభుత్వంలో కనీసం షట్టర్లు, గేట్ల నిర్వహణ కూడా సరిగా చేయలేదు. కాంట్రాక్టర్లు వాటిని సరి చేయడానికి ముందుకు రాలేదు. అలాంటి పరిస్థితి ఎప్పుడూ ఉండకూడదు. షట్టర్ల రిపేర్లు అనే మాటే ఉండకూడదు. అన్ని చెరువులు, లాకులు, కాల్వలు చెక్ చేసుకోవాలి. అవి సరిగా పని చేస్తున్నాయా లేదా అనేది కూడా చూడాలి. నీటి నిర్వహణపై జిల్లాల వారీగా రేటింగ్స్ ఇస్తాం. ఇరిగేషన్ శాఖలోని ఇంజనీరింగ్ వ్యవస్థను రీఆర్గనైజ్ చేస్తాం." అని చంద్రబాబు స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 1000 టిఎంసిలు సర్ఫేస్ వాటర్ ఉండాలి... భూగర్భ జలాలు పెరగాలి. భూమిని జలాశయంగా మార్చుకోవాలి. భూగర్భ జలాలు లేకుంటే.. వేయి అడుగులలోతు నుంచి నీటిని తోడుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. దీని వల్ల మంచినీటి అవసరనాలకు ఉపయోగపడని ఫ్లోరైడ్ నీరు వచ్చే ప్రమాదం ఉంది. అలాగే నీటిని తోడేందుకు ఎక్కువ విద్యుత్ వినియోగం కూడా అవుతుంది. సాగునీటి సంఘాలు భూగర్భ జలాలను పెంచే బాధ్యతనూతీసుకోవాలి. రాష్ట్రంలో మొత్తంగా 40 లక్షల ఎకరాల బోర్ వెల్స్ మీద ఆధారపడ్డాయి. రాష్ట్రంలోని 19 లక్షల బోర్లు ఉంటే.. వాటి కోసం రూ. 8250 కోట్లు విద్యుత్ ఖర్చు పెట్టాల్సి వస్తుంది. భూగర్భజలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటే ఇందులో 50 శాతం ఖర్చును తగ్గించుకోవచ్చు.

వర్షాకాలంలో ముందు భూగర్భ జలాలు మూడు మీటర్ల లోతున అందుబాటులో ఉండాలి. వర్షాకాలం తర్వాత ఎనిమిది మీటర్లకు తగ్గకుండా చూడాలి. ఈ విధంగా నీటిని సమర్థవంతంగా నిర్వహించుకుంటే కరవు నివారణ అనేదే ఉండదు. సాగు నీటి సంఘాలు అంటే నీటిని తీసుకోవడమే కాదు.. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు వంటి అంశాల పైనా సాగునీటి సంఘాలు బాధ్యత తీసుకోవాలి. నదీ తీర ప్రాంతంలో ఉన్న కొన్ని జిల్లాల్లో భూగర్భ జలాలపై దృష్టి పెట్టడం లేదు. తూర్పు గోదావరి, ఏలూరు, ప్రకాశం వంటి జిల్లాల్లో భూగర్భ జలాలు మరింత పెరగాలి. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేసుకోగలిగాం. రిజర్వాయర్లు, బ్యారేజీల్లో మొత్తంగా కలిపి 82.29 శాతం మేర నింపుకోగలిగాం. ఎగువన నుంచి వస్తున్న వరదతో పాటు.. రాష్ట్రంలో పడుతున్న వర్షపు నీటిని సమర్ధంగా రిజర్వాయర్లకు మళ్లించడంలో ప్రభుత్వం విజయవంతమైంది. హంద్రీనీవా ద్వారా రాయలసీమలో ప్రాజెక్టులు నింపాం. ఇకపై వెలుగోడు, ఉత్తరాంధ్ర, గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టులపై దృష్టి సారిస్తాం. నీటిని ఒడిసిపట్టి ప్రాజెక్టులను ఏ విధంగా నింపామో.. ఇదే విధంగా గ్రామాల్లోని >>2



## కేంద్ర మంత్రులతో నారా లోకేష్ భేటీ

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించేందుకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈరోజు రాత్రి ఢిల్లీ వెళ్లనున్నారు. మంత్రి లోకేష్ సోమవారం ఈమేరకు పలువురు కేంద్రమంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పలుమార్లు కేంద్ర మంత్రులతో భేటీఅయిన లోకేష్ రాష్ట్ర ప్రయోజనాలకోసం నిరంతరంశ్రమిస్తున్నారు. మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టుల రాకతోపాటు వేగవంతంగా >>2

## నేడు ఢిల్లీకి సిఎం

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు రాత్రికి ఢిల్లీ వెళ్లనున్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంలోని పలు కీలక శాఖలకు చెందిన మంత్రులతో రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కూడ చర్చించే ఛాన్స్ ఉందని సమాచారం. కాగా, ఈ రోజు జరుగుతున్న బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశంలోనే ఉపరాష్ట్రపతి అభ్యర్థి పేరును భారతీయ జనతా పార్టీ ఖరారు చేయనుంది. ఆ తర్వాత ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఈ నెల 21వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్డీయే పాలిత రాష్ట్రాల సిఎంలు,ఉప ముఖ్యమంత్రులు, అలాగే కీలక నేతలు హాజరు కానున్నారు. ఇక,ఉప రాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి ముందుగా 20వ తేదీన ఎన్డీయే నేతల భేటీ జరుగనుంది. ఆ సమావేశంలో కూడ సిఎం చంద్రబాబు పాల్గొననున్నారు.

## ఐటీ కంపెనీలను ఆకర్షించేలా టెక్‌హబ్స్ పాలసీ - ఉత్తర్వులు జారీ

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి ప్రముఖ ఐటీ కంపెనీలను ఆకర్షించేలా ఎపి ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్స్ (ఎల్ఐఎఫ్‌టీ) పాలసీ (4.0)ని ప్రకటిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్చ్యూన్-500,ఫార్చ్యూన్-500 యూరప్,ఫార్చ్యూన్ గ్లోబల్-500,ఫార్చ్యూన్-1,000,ఫోర్బ్స్ గ్లోబల్-2000లో గత మూడేళ్లలో ర్యాంకింగ్ పొందిన సంస్థలు ఐటి, ఐటిఇఎస్,గ్లోబల్ కేపబుల్ సెంటర్స్(జిసిసిల) ఏర్పాటుకు రాయితీతో భూములు కేటాయిస్తారు. ఒక బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉండాలనే నిబంధన విధించారు. వీటికి రాష్ట్రంలో ఎక్కడైనా నామ మాత్ర ధరకింద ఎకరా 99 పైసలకు కేటాయిస్తారు. ఐటి,ఐటిఇఎస్‌లు ఏర్పాటు చేయాలనుకునే సంస్థలు మూడేళ్లలో కనీసం 3వేల మందికి ఉపాధి కల్పించాలని పాలసీలో పేర్కొన్నారు.

# రూ. 85 కోట్లతో ఫుడ్ టెస్టింగ్ కేంద్రాలు

### 5 రాష్ట్ర స్థాయి పరీక్షా కేంద్రాలు: మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల ఆరోగ్యదాయక జీవనానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో సుమారు రూ.86 కోట్లతో 5 ఆహార నాణ్యతా పరీక్షా కేంద్రాల్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆ మేరకు మంత్రి తన కార్యాలయం ద్వారా ఒకప్రకటన విడుదల చేసారు. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు సుమారు రూ. 20 కోట్ల వరకు ఖర్చుపెడుతున్నామని చెప్పారు.

ఈ కేంద్రాల్లో సమకూరే అత్యాధునిక యంత్ర పరికరాల ద్వారా ఆహార పదార్థాల నమూనాలను పరీక్షిస్తారని చెప్పారు. వీటిల్లో తిరుమల, విశాఖలోని ల్యాబొరేటరీ నమూనాల పరీక్షలు మరో నెల రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ)తో కుదిరిన ఒప్పందం మేరకు ఈ కేంద్రాల ఏర్పాటు జరుగుతోందన్నారు.తిరుమల భక్తుల కోసం ప్రత్యేక రాష్ట్ర స్థాయి ల్యాబొరేటరీ అందుబాటులోకి వస్తుందన్నారు. శ్రీవారి భక్తుల ఆరోగ్యమే ప్రధాన ధ్యేయంగా తిరుమలలో స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ ఏర్పాటు పనులు తుది దశకు చేరుకున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వచ్చే నెలాఖరునాటికి ఈ ల్యాబొరేటరీని వినియోగానికి సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వ హయాంలో కల్తీ నెయ్యి ఘటన వల్ల భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు.

ఈ నేపథ్యంలో తిరుమలలో ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి ల్యాబొరేటరీని ఏర్పాటుచేసేందుకు నిర్ణయం జరిగిందన్నారు. ఎఫ్ఎస్ఎస్ఎఐతో కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి తిరుమలలో ల్యాబొరేటరీ ఏర్పాట్ల పనుల్ని గత ఏప్రిల్ నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. తిరుమలలోని పిండి మిల్లు వద్ద అక్కడి అధికారులు అందజేసిన భవనాన్ని (12,000 చదరపు అడుగులు) ల్యాబొరేటరీ ఏర్పాటుకు అనుగుణంగా మారుస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.19 కోట్ల వ్యయం చేసే ఆహార నమూనా పరీక్షలు చేసేందుకు గాను యంత్ర పరికరాలను ల్యాబొరేటరీలో సమకూరుస్తున్నామని చెప్పారు. ఈ ల్యాబొరేటరీలో అన్ని రకాల ఆహార పదార్థాల నమూనాలను పరీక్షిస్తారన్నారు. 24 గంటల పాటు ఈ ల్యాబబొరేటరీ పనిచేసేలా అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉంటారని వెల్లడించారు. దేశవిదేశాల నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ఈ కేంద్రం పనిచేస్తుందని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు ఆహార పదార్థాల నాణ్యతా >>2



## ఉపరాష్ట్రపతి ఎన్డీయే అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్

### ఖరారుచేసిన బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** భారత ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీయే పక్షాల తరపున మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను ఎంపికచేసారు. ఆదివారం జరిగిన బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశంలో సుదీర్ఘ చర్చల అనంతరం రాధాకృష్ణన్‌పేరును ఖరారు చేసారు. బిజెపి అధ్యక్షుడు జెపినడ్డా రాధాకృష్ణన్ పేరును అధికారికంగా ప్రకటించారు. 1957 మే 4న జన్మించిన సిపి రాధాకృష్ణన్ తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానంనుంచి రెండుసార్లు బిజెపి తరపున ఎంపిగా ఎన్నికయ్యారు. తమిళనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా కూడా పనిచేసారు. 2016 నుంచి 2019వరకూ ఆల్ ఇండియా కాయిర్‌బోర్డు ఛైర్మన్‌గా సేవలందించారు. తమిళనాడు బిజెపి సీనియర్ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి జార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలుచేపట్టారు. గతంలో తెలంగాణతోపాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా కొనసాగుతున్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపికచేసే అధికారాన్ని ఎన్డీయే పక్షాలు ప్రధాని నరేంద్రమోడీ, బిజెపి అధ్యక్షుడు జెపినడ్డాకు అప్పగించిన సంగతి తెలిసిందే. ఈనెల21వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరితేదీ. ఎన్డీయే పదవికి ఎవరెవరు వస్తారా అన్న ఉత్కంఠలో ఇంతకాల నడిచిన అధికార కూటమి సభ్యుల ఉత్కంఠకు తెరపడింది. రేసులో జమ్ముకాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా వంటి ప్రముఖులపేర్లు తెరపైకి వచ్చాయి. తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళిసై సౌందరరాజన్ 2024 మార్చి 18న రాజీనామాచేయడంతో తెలంగాణ గవర్నర్‌గా సిపిరాధాకృష్ణన్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆసమయంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న సిపిరాధాకృష్ణన్ తెలంగాణ గవర్నర్‌గా కూడాపనిచేసారు. 2024 జూలై 31వరకూ తెలంగాణ గవర్నర్‌గా పనిచేసారు.

2024 ఆగస్టు 6వరకూ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గాపనిచేసినతర్వాత మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. ఉపరాష్ట్రపతి ఎంపికలో బిజెపి ఎన్డీయే కూటమి సమతుల్యతను పాటించింది. రాష్ట్రపతి ముర్ము ఒడిశా వాసి కాగా రాధాకృష్ణన్ దక్షిణాది వాసి. కాగా ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక సెప్టెంబరు 9న జరగనున్నది. ఆగస్టు 22వ తేదీతో నామినేషన్ల ఉపసంహారణ గడువు కూడా ముగుస్తుంది. ఇపుడు ఇండియా కూటమి అభ్యర్థి ఎవరన్నది ఆపార్టీ సమిష్టి నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.



## 22న త్రైపాక్షిక భేటీ

### ఒకే వేదికపైకి పుతిన్, ట్రంప్, జెలెన్‌స్కీ

**వాషింగ్టన్, ఆగస్టు 17:** ఉక్రెయిన్‌లో యుద్ధానికి ముగింపు పలికే అంశంపై చర్చించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల అలాస్కాలో భేటీ అయ్యారు. అనంతరం త్రైపాక్షిక సమావేశం గురించి ట్రంప్, జెలెన్‌స్కీ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలో ముగ్గురు అధ్యక్షుల మధ్య త్రైపాక్షిక సమావేశం ఆగస్టు 22న ఏర్పాటు చేయాలని ట్రంప్ యోచిస్తున్నట్లు ట్రూత్‌లో పోస్టుచేసారు. పుతిన్‌తో సమావేశం అనంతరం ఈ విషయాన్ని ట్రంప్ యూరోపియన్ యూనియన్ నాయకులతో చెప్పినట్లు సమాచారం. >>2

## 'ఉగ్ర' గ్రూపు సభ్యుడి అరెస్టు

### జిల్లా ఎస్‌పి వి.రత్న



**శ్రీ సత్య సాయి జిల్లా, ఆగస్టు 17, ప్రభాతవార్త ప్రతినిధి :** నిషేధిత ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉన్న వాట్సాప్ గ్రూపుల్లో చురుకుగా పాల్గొని, జిహాదీ సిద్ధాంతాలకు సంబంధించిన ప్రచార పుస్తకాలను ఉంచుకున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న తెలియజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం ఎస్పీ మీడియా సమావేశంలో ధర్మవరం ఇంచార్జ్ డిఎస్పీ నరసింగప్పతో కలిసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్‌కు రాబడిన సమాచారం మేరకు ఈనెల 16వ తేదీన ఉదయం 05:00 గంటలకు, ధర్మవరం ఇంచార్జి డిఎస్‌పి ఎ.నరసింగప్ప, స్థానిక పోలీస్ >>2

## కూంబింగ్ టీమ్ అదుపులో మావోయిస్టు


ఆదివారం మీడియాతో ఎస్పీ అమిత్ బర్దర్

### కూంబింగ్ బలగాలపై కాల్పులకు ప్రయత్నించిన మావోయిస్టు అరెస్ట్

### 303 తుపాకీ,9ఎంఎం పిస్తోల్, సామాగ్రి స్వాధీనం: ఎస్పీ అమిత్ బర్దర్

**పాడేరు, ఆగస్ట్ 17, ప్రభాతవార్త:** అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ, చింతగుప్ప పరిసర ప్రాంతాల్లో శనివారం కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీస్‌బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపేందుకు ప్రయత్నించి నఘటన ప్రదేశం నుండి తప్పించుకొని కొంతమంది మావోయిస్టులు పారిపోయే ప్రయత్నించగా అందులో ఒక మావోయిస్టును అదుపులోకి తీసుకుని ఆ మావోయిస్టు వద్ద లభ్యమైన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడించారు.ఆదివారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వివరాలను వెల్లడించారు. అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ, చింతగుప్ప పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపేందుకు ప్రయత్నించి అక్కడ నుండి తప్పించుకొని పారిపోయే ప్రయత్నంలో బలగాలు చాకచక్యంగా ఒక మావోయిస్టును అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

పోలీస్ బలగాలు అదుపులోకి తీసుకున్న మావోయిస్టు ఒడిశా రాష్ట్రంకోరాపుట్ జిల్లా భాలియాపుట్టు గ్రామానికి చెందిన చైతో (ఆలియాస్ నరేష్, సంతు) గుర్తించినట్టు ఎస్పీ తెలిపారు. మావోయిస్టు చైతో (ఆలియాస్ నరేష్, సంతు) 2011లో జననాట్య మండలి బృందంలో నరేష్ విప్లవాలకు ఆకర్షితుడై 15 సంవత్సరాలకే మావోయిస్టు పార్టీ సభ్యత్వం పొందాడన్నారు. మావోయిస్టు దళంలో చేరి 2017లో కట్ ఆఫ్ బోయిపరిగూడ మావోయిస్టు దళ కమెండర్‌గా బాధ్యతలు చేపట్టిన నరేష్ ప్రస్తుతం డిసిఎం మెంబర్ మరియు పెదబయలు కోరుకొండ ఏరియా కమిటీ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టి మావోయిస్టు కార్యకలాపాలు చేస్తున్నాడని మావోయిస్టు చైతో 8 ఎన్కౌంటర్లో పాల్గొన్నాడని ఎస్పీపేర్కొన్నారు. అదుపులో తీసుకున్న మావోయిస్టు చైతో వద్ద 9 ఎమ్ఎమ్ పిస్టల్,9 ఎమ్ఎమ్ లైవ్ అమ్మునిషన్ 04,303 రైఫిల్‌మ్యాగజైన్, 01,303 >>2

## పోలీసులపై గంజాయి స్మగ్లర్ దాడి


ఆదివారం మీడియాకు వివరాలు అందజేస్తున్న ఈగల్ టీం ఐజి ఆర్‌కె రవికృష్ణ

### రెండు రౌండ్లు కాల్పులు జరిపిన సిఐ

### భయంతో లొంగిపోయిన స్మగ్లర్

**నెల్లూరు క్రైం, ఆగస్టు 17, ప్రభాతవార్త:** గంజాయి స్మగ్లర్లు రోజురోజుకీ బరితెగిస్తున్నారు. గతంలో నెల్లూరు పరిధిలో జాతీయ రహదారిపై గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న వాహనాన్ని అడ్డుకున్న డిఎస్పీని వాహనంతో గుద్ది తప్పించుకునే ప్రయత్నం చేసిన ఘటన మరువక ముందే మరోసారి అదే స్థాయిలో స్మగ్లర్లు బరితెగించారు. అయితే స్థానిక సిఐ సాంబశివరావు తక్షణమే స్పందించి ఫైరింగ్ చేపట్టడంతో స్మగ్లర్‌చేతులు పైకెత్తి పోలీసులకు సరెండర్ కావడంతప్ప మరోగత్యంతరం లేకపోయింది. ఈ సంఘటనకు సంబం >>2

18-8pg2exHMNWJQE.qxd:18-8pg2exHMNWJQE.qxd 1/1/02 9:27 AM Page 1





బీహార్‌లోని ససారాంలో ఆదివారం జరిగిన ఓటర్ అధికార్ యాత్రలో ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

# ఫుడ్ టెస్టింగ్ కేంద్రాలు

>> పరీక్షల నిమిత్తం పొరుగు రాష్ట్రాలకు నమూనాలు పంపిస్తున్నారన్నారు. సిబ్బందికి నమూనాల పరీక్షలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. తిరుమల ఆహార పదార్థాల తయారీకి దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చే నిత్యావసర వస్తువుల(పాలు, పెరుగు వగైరా) నమూనాలను ఈ కేంద్రంలో పరీక్షించి నాణ్యత ఉన్నట్లు నిర్ధారణ జరిగిన తర్వాతే వాటిని వినియోగిస్తారని చెప్పారు. విశాఖపట్నంలోని రాష్ట్ర స్థాయి ఫుడ్ ల్యాబొరేటరీ కూడా వచ్చే నెలలో ప్రారంభం కానుందని, ఇందులో అవసరమైన అన్ని రకాల యంత్రపరికరాల్ని అందుబాటులోకి తీసుకొచ్చే పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో అలాగే తిరుపతిలో రాష్ట్ర స్థాయి ఫుడ్ ల్యాబొరేటరీలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కర్నూలులో ఇప్పటికే ప్రాంతీయ ఫుడ్ ల్యాబొరెటరీ ఉందన్నారు. దీని స్థాయిని పెంచి కొత్తగా భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. దీనికోసం స్థలాన్వేషణ జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే కాంట్రాక్టర్లు పనులు మొదలు పెడతారని చెప్పారు. ఒంగోలు, ఏలూరులో ఉన్న పబ్లిక్ హెల్త్ ల్యాబొరెటరీలను ఉన్నతీకరణిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఇప్పటికే నడుస్తున్న ల్యాబుల్లో సుమారు రూ.13 కోట్ల వ్యయంతో అత్యాధునిక పరికరాల్ని సమకూరుస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి పరికరాల కొనుగోలుకు పర్చేజింగ్ ఆర్డర్ కూడా ఇచ్చామని మంత్రి చెప్పారు.



జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ఆదివారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించిన ప్రవాస భారతీయులు

# 22న త్రైపాక్షిక భేటీ

>> ఇదిలా వుంటే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సోమవారం ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఈ సమావేశానికి యూరోపియన్ దేశాల నాయకులను కూడా ట్రంప్ ఆహ్వానించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. జర్మన్ ఛాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్ మాట్లాడుతూ.. ట్రంప్, జెలెన్స్కీల మధ్య సోమవారం సమావేశం జరుగుతుందని, ఆ తర్వాత ముగ్గురు నేతల మధ్య త్రైపాక్షిక సమావేశం జరిగే అవకాశం ఉందని అన్నారు. యుద్ధం ముగింపుపై సోమవారం కీలక ప్రకటన వెలువడుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. కాగా ఉక్రెయిన్‌తో యుద్ధం గురించి ఇటీవల అలాస్కా వేదికగా ట్రంప్, పుతిన్‌లు భేటీ అయ్యి రెండున్నర గంటలకుపైగా చర్చించారు. అయినప్పటికీ ఎలాంటి ఒప్పందానికి రాలేదు. అయితే చర్చలు సానుకూలంగా జరిగాయని సమావేశం అనంతరం ఇరువురు నేతలు ప్రకటించారు. ట్రంప్ మాట్లాడుతూ.. ఒప్పందంపై నిర్ణయం జెలెన్స్కీ చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు తనతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఉక్రెయిన్ అధినేత తెలిపారు. త్రైపాక్షిక సమావేశంపై ట్రంప్ చేసిన ప్రతిపాదనకు తాను మద్దతిస్తున్నట్లు జెలెన్స్కీ వెల్లడించారు. కీలక అంశాలపై చర్చించుకునేందుకు అది మంచి వేదిక అవుతుందన్నారు. పరిస్థితులను చక్కదిద్దే బలం అమెరికాకు ఉందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

శాంతి ఒప్పందంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్న యూరోపియన్ నాయకులకు జెలెన్స్కీ కృతజ్ఞతలు తెలిపారు. అయితే సోమవారం ట్రంప్, జెలెన్స్కీ సమావేశం నేపథ్యంలో ఐరోపా నేతలు అప్రమత్తమయ్యారు. గతంలో అమెరికా అధ్యక్షుడితో సమావేశమైన జెలెన్స్కీకి చేదు అనుభవం ఎదురైన విషయం తెలిసిందే. అలాంటి ఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు ట్రంప్‌తో స్నేహపూర్వకంగా మెలిగే ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌ను, ఇతరులను ఉక్రెయిన్ అధ్యక్షుడికి సాయంగా వాషింగ్టన్‌కు పంపనున్నట్లు యూరప్ దౌత్యవేత్తలు తెలిపారు. ఇరువురి మధ్య ఘర్షణ పునరావృతం కాకుండా చర్చలు సజావుగా జరిగేలా వారు చూసుకోనున్నట్లు సమాచారం. నాటో సెక్రెటరీ జనరల్ కూడా ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని ఉక్రెయిన్ వర్గాలు చెపుతున్నాయి.

# నారా లోకేష్ భేటీ

>> అనుమతులు మంజూరవుతున్నాయి. దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు దీటుగా ఆంధ్రప్రదేశ్‌ను నిలిపేందుకు లోకేష్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. రేపటి పర్యటనలో రాష్ట్రానికి ఇటీవల సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు చెబుతారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర రోడ్డు రవాణా, రహదార్ల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం మంత్రి హార్దీప్ సింగ్ పూరి, ఓడరేవులు, జలరవాణాశాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో మంత్రి లోకేష్ సమావేశమవుతారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వంతరపున వివిధ ప్రతిపాదనలను కేంద్రమంత్రులకు అందజేస్తారు.

# రిజర్వాయర్లకు మళ్లింపు

>> చెరువులను కూడా నీటితో నింపుకోవాలి. సాగు నీటి కాల్వలను, పంట కాల్వలను పరిరక్షించుకోవాలి. చెరువులు, కాల్వలను పరిరక్షించే పనుల్లో సాగు నీటి సంఘాలు భాగస్వామ్యం కావాలి. రైతుల భాగస్వామ్యం కోసమే సాగునీటి సంఘాలు పెట్టాం. కృష్ణా, గోదావరి నదుల్లో పెద్ద ఎత్తున నీరు సముద్రంలోకి వెళ్తోంది. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నా.. వరదలు వస్తున్నా.. కొన్ని ప్రాంతాల్లో ఇంకా వర్షాభావ పరిస్థితులున్నాయి. రాష్ట్రంలో 17 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి నీరు చేరేలా చూడాలి. ప్రతి ఎకరాకు నీరు అందించేలా నీటి నిర్వహణ చేసుకోవాలి. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను పూర్తిగా నింపుకోవాలి. రాష్ట్రంలో మొత్తంగా 38 వేల మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా భారీ ఎత్తున నీటిని నిల్వ చేసుకోవచ్చు. రైతుల కోసం, నీటి నిర్వహణ, పరిరక్షణ కోసం సాగునీటి సంఘాల వ్యవస్థను ఏర్పాటు చేశాం. దీన్ని అదే స్ఫూర్తితో సాగునీటి సంఘాలు పని చేయాలి." అని చంద్రబాబు సూచించారు.

రాష్ట్రంలో చెరువులు, కాల్వలు, చెక్ డ్యాముల పరిస్థితిని సాగు నీటి సంఘాలు పరిశీలించాలి. సాగునీటి సంఘాలకు ఆయకట్టు ప్రాంతాలే కాకుండా.. క్యాచ్మెంట్ ఏరియా బాధ్యతలను అప్పగిస్తాం. నీటి వనరుల సంరక్షణ నిమిత్తం ఏమైనా చర్యలు తీసుకోవాల్సి వస్తే.. అధికారులతో సమన్వయం చేసుకోవాలి. వచ్చే 10 15 రోజుల్లోగా చెరువలకు, కాల్వలకు,చెక్ డ్యాములకు మరమ్మత్తులు చేయాల్సి వస్తే త్వరితగతిన పూర్తి చేయాలి అని సూచించారు.

# 'మిగులు' వాటాలు తేలాకే కొత్త ప్రాజెక్టులు

## బనకచర్ల ప్రాజెక్టుపై తేల్చాల్సింది కేంద్రమే!

## తెలంగాణ డి.సిఎం భట్టి విక్రమార్క



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు17:** గోదావరినదిపైఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించాలనుకుంటున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. మిగులు జలాల్లో తెలుగు రాష్ట్రాల వాటాలు తేలిన తర్వాతే గోదావరిపై ఎలాంటి కొత్త ప్రాజెక్టులు నిర్మించినా అది చట్టబద్ధంగా, న్యాయంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నీటి వాటాలను నిర్ధారించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. ఆదివారం 'ఓట్ల చోరీ' నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖపట్నంకు వెళ్లిన భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. నదీ జలాల కోసమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. మా రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయి, నీటి కేటాయింపులు జరిగిన తర్వాతే మిగులు జలాల అంశంపై ఒక స్పష్టత వస్తుందని ఆయన వివరించారు. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం, ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్, దేవాదుల వంటి గోదావరిపై మేం చేపట్టిన ప్రాజెక్టులు పూర్తికాలేదు. మా ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత వాటాలుతేల్చి మిగిలిన వాటిని సమృద్ధిగా వాడుకోవచ్చునని చెప్పారు. మా అవసరాలు తీరకుండా దిగువ ప్రాజెక్టులు నిర్మాణం జరిగితే ఆ తర్వాత కేటాయింపులు సమస్యలు ఎక్కువవుతాయి. సముద్రంలోకి వెళ్లే జలాల అని మాట్లాడటం అర్థం చేసుకోలేని అమాయకులు ఎవరు లేరు అని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పటిష్టంగా ఉంది. అసంతృప్తి అనేది కొందరు ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు, రేవంత్,రాహుల్ హాట్‌లైన్‌పై జగన్ వ్యాఖ్యలు వ్యక్తిగతమైన రాజకీయ ఆరోపణ, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి గా పార్టీ విధానాలు విశాలమైన ప్రయోజనాలతో ఉంటాయి తప్ప సంకుచితమైన మనస్తత్వంతో ఉండవు అని తెలిపారు. కాగా, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును గట్టిగా సమర్థించారు. పోలవరం నుంచి వృథాగా సముద్రంలోకి పోయే గోదావరి వరద నీటిని బనకచర్లకు తరలించి రాయలసీమను అభివృద్ధి చేయాలనేది తమ లక్ష్యమని చెప్పారు. దిగువ రాష్ట్రంగా వరదల వల్ల తాము నష్టపోతున్నామని, అలాంటి వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుతో ఏ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరగదని భరోసా ఇచ్చారు.

# సభ్యుడి అరెస్టు

>> సిబ్బందితో కలిసి డి.నెం.20/511 వద్ద గల ఇంటిని రైడ్‌సెర్చ్, తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీలలో కొత్వాల్ నూర్ మహమ్మద్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేశారు. అతను పాకిస్థాన్‌లోని బ్యాన్ చేసిన ఉగ్రవాద సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న అనేక వాట్సాప్ గ్రూపుల్లో సభ్యత్వం కలిగి ఉన్నట్లు అంగీకరించడం జరిగిందన్నారు. ఈ గ్రూపుల్లో ఉగ్రవాద భావజాలం, దేశ వ్యతిరేక ప్రచారం, జిహాదీ ప్రేరేపణ జరుగుతున్నట్లు వెల్లడైందన్నారు. అతని వద్దనుండి ఒక మొబైల్ ఫోన్, జిహాదీ భావజాలం, ఉగ్రవాద సంస్థల ప్రచారం ఉన్న నిషేధిత సాహిత్యం గల ఒక పుస్తకాన్ని స్వాధీనంలోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు ధర్మవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్.170/2025 అండర్ సెక్షన్ 152, 196 (1)(ఏ), 196 (2) ఆర్/డబ్ల్యూ 3(5) బి.ఎన్.ఎస్ మరియు సెక్షన్ 13, 38, 39 అన్ లా ఫుల్ ఆక్టివిటీ (ప్రివెన్షన్)యాక్ట్ 1967 ప్రకారం నమోదు చేసి, ముద్దాయిని అరెస్ట్ చేసి కదిరి కోర్టులో హాజరపరచగా జడ్జి 14 రోజులు రిమాండుకు ఆదేశించడంతో కడప సెంట్రల్ జైలుకు ముద్దాయిని తరలించడం జరిగిందన్నారు.

# గంజాయి స్మగ్లర్ దాడి

>> ధించిన వివరాలను ఈగల్ టీం ఐజి ఆర్‌కే. రవికృష్ణ ఆదివారం నెల్లూరు నగర శివార్లలో సంఘటన జరిగిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. గంజాయిని సమూలంగా నిర్మూలించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం మేరకు ఎక్కడికక్కడ గంజాయి స్మగ్లర్ల పై ఈగల్ టీంతో పాటు స్థానిక పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా నుండి నెల్లూరులోని గంజాయి విక్రేతలకు గంజాయిని అందించేందుకు కొందరు కారులో బయలుదేరి వస్తున్నట్లు సమాచారం అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాలాజీ నగర్ సిఐ సాంబశివరావు, స్టేషన్ సిబ్బందితోపాటు ఈగల్ టీం సిబ్బందితో జాతీయ రహదారి పెన్నా వంతెన వద్ద నిఘా ఉంచారు. మారుతి స్విఫ్ట్ కారులో స్మగ్లర్ రావడాన్ని గమనించి కారును సిఐ తన సిబ్బందితో కలిసి వెంబడించారు. స్థానిక ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో ఉన్న అమ్మకం దారులకు గంజాయిని స్మగ్లర్ అందించే క్రమంలో సిఐ తమ వాహనాన్ని స్మగ్లర్ వాహనానికి అడ్డుగా పెట్టే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో దిక్కుతోచని స్మగ్లర్ తన వాహనంతో పోలీసు వాహనాన్ని గుద్దడంతోపాటు అడ్డువచ్చిన కానిస్టేబుల్‌ని కూడా తొక్కించే ప్రయత్నంచేశారు. అతన్ని నియంత్రించే ప్రయత్నం చేసిన కానిస్టేబుల్ ఫిరోజ్ కు ఈ సంఘటనలో ఈ గాయాలయ్యాయి. వెంటనే తేరుకున్న సిఐ తన సర్వీసు పిస్టల్‌తో రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. దీంతో భయాందోళనకు గురైన స్మగ్లర్ పోలీసులకు లొంగిపోయాడు. రాజమండ్రి ప్రాంతానికి చెందిన బీరక ప్రకాష్ అలియాస్ సూర్యప్రకాష్ గత కొన్ని ఏళ్లుగా గంజాయి స్మగ్లింగ్ చేయడమే వృత్తిగా పెట్టుకున్నాడు. పలుసార్లు జైలుకు వెళ్లినప్పటికీ అతని ప్రవర్తనలో ఎటువంటి మార్పు లేదు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి నెల్లూరు జిల్లాలోని పలు స్టేషన్లలో అతనిపై కేసులు నమోదై ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం కూడా స్మగ్లింగ్ చేస్తూ బాలాజీ నగర్ పోలీసులకు చిక్కాడు. ముద్దాయి వద్ద నుండి 22 కిలోల గంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన కానిస్టేబుల్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.స్మగ్లర్‌ను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన డిఎస్పీ సింధు ప్రియ, సిఐ సాంబశివరావు, ఇతర సిబ్బందిని ఈగల్‌టీం ఐజి రవికృష్ణ, జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ అభినందించారు.

# షిండే పాల్గొన్న వేడుకలో కుప్పకూలిన వేదిక

**థాణె, ఆగస్టు 17:** శ్రీకృష్ణుడి జన్మదినం సందర్భంగా మహారాష్ట్రలో దహి హండి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం జన్మాష్టమి సందర్భంగా మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల్లో ఈ సంప్రదాయ వేడుకలు జోరుగా జరిగాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే థానే సహా ఇతర ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. కానీ, గన్సోలిలో జరిగిన ఒక ఈవెంట్‌లో ఊహించని సంఘటన ఒకటి జరిగింది. షిండే వేదికపై నుంచి దిగుతుండగా, ఉత్సాహంతో ఉన్న కార్యకర్తలు ఒక్కసారిగా వేదికపైకి ఎక్కారు. దీంతో అధిక బరువు వల్ల వేదిక అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ క్షణంలో అక్కడ ఉన్న జనం మధ్య గందరగోళం నెలకొంది. అయితే, షిండేని వెంటనే సురక్షిత ప్రదేశానికి తీసుకెళ్లారు. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఈ ఘటనకు సంబంధించిన చిత్రాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ముంబై, థానేలలో జరిగిన అనేక దహిహండి ఈవెంట్‌లలో పాల్గొన్నారు. వీరిద్దరూ తమ శ్రీ ఖాతాల్లో ఈ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను షేర్ చేశారు. ఈ ఉత్సవాల్లో యువత ఉత్సాహంతో పాల్గొన్నారు. షిండే, థానేలోని మాజీ శివసేన ఎమ్మెల్యే రవీంద్ర ఫటక్ నేతృత్వంలో సంకల్ప్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో జరిగిన ఒక ప్రతిష్ఠాత్మక దహిహాండి వేడుకలో పాల్గొన్నారు.

# 24గంటల్లో వాయుగుండం

## మూడు రోజుల పాటు భారీ వర్షాలు

**విజయవాడ, ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** దక్షిణ ఒడిశా,ఉత్తరాంధ్ర తీరప్రాంతంపై అల్పపీడనం కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ అల్పపీడనం మరో 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని, ఈ నెల 19న దక్షిణ ఒడిశా ఉత్తరాంధ్ర మధ్య తీర ప్రాంతాన్ని దాటవచ్చని వాతావరణ కేంద్రం డైరెక్టర్ భారతి సవ్వడి తెలిపారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే విశాఖపట్నం, అనకాపల్లి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణ, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు ప్రకటించారు. అదే సమయంలో, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఐఎండి సూచనల ప్రకారం దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. సోమవారం నాటికి వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతంలోమరోక అల్పపీడనం.. ఏర్పడే అవకాశం ఉందన్నారు. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు కోస్తాలో చెదురుమదురుగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.రాయలసీమలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మంగళవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు... భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు చెట్లక్రింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. ఇప్పటికే ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు.

# వికసిత్ భారత్‌కు 'ఢిల్లీ' ఒక నమూనా

>> కొత్త ఎక్స్‌ప్రెస్‌వే నుంచి ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందనున్నది. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ ఈ రోడ్ల ప్రయాణాన్ని సులభతరం చేయడంతో పాటు ఎన్‌సీఆర్ అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని పేర్కొన్నారు. ఎక్స్‌ప్రెస్‌వే పేరు ద్వారక అని ఈ కార్యక్రమం జరుగుతున్న ప్రదేశం రోహిణి అని, జన్మాష్టమి ఆనందం అని, యాదృచ్ఛికంగా ద్వారకాధీశ భూమి నుంచి వచ్చానని మోడీ పేర్కొన్నారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు దేశ రాజధాని ఢిల్లీ దేశంలో జరుగుతున్న అభివృద్ధి విప్లవాన్ని చూస్తోంది. కొద్దిసేపటి క్రితం ఢిల్లీ ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌తో అనుసంధానంతో ఢిల్లీ, గురుగ్రామ్, ఎన్‌సీఆర్ ప్రజల సౌకర్యాన్ని పెంచుతుందని.. ప్రతి ఒక్కరి సమయం ఆదా అవుతుందన్నారు. మన వ్యాపారులు, వ్యాపారవేత్తలు, రైతులు ప్రత్యేక ప్రయోజనాలను పొందబోతుందన్నారు. ప్రపంచం భారతదేశాన్ని చూసినప్పుడు.. మూల్యాంకనం చేసిన సమయంలో మొదటి దృష్టి మన రాజధాని ఢిల్లీపై పడుతుందన్నారు. మనం ఢిల్లీని అభివృద్ధి నమూనాగా మార్చాలని పిలుపునిచ్చారు. ఢిల్లీని గొప్ప నగరంగా మార్చడానికి మనం చేపట్టిన పని నిరంతరం కొనసాగుతోందన్నారు. నేటికీ మనమందరం దీనికి సాక్షులమని.. అది ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ అయినా ఈ రెండు రోడ్లు అద్భుతంగా నిర్మించినట్లు పేర్కొన్నారు. పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే తర్వాత ఇప్పుడు అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ ఢిల్లీకి చాలా సహాయపడుతుందన్నారు. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌కు మరో ప్రత్యేకత ఉందని ఇది ఢిల్లీని చెత్త నుంచి విముక్తి చేయడంలో సహాయపడుతుందన్నారు. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌ను తయారు చేయడంలో లక్షల టన్నుల చెత్తను ఉపయోగించారని వ్యర్థ పదార్థాలను రోడ్డు తయారీలో ఉపయోగించారన్నారు. రేఖ గుప్తా నాయకత్వంలోని ఢిల్లీ బిజెపి ప్రభుత్వం యమునను శుభ్రపరిచే పనిలో నిరంతరం నిమగ్నమై ఉండడంపై సంతోషంగా ఉన్నానని ప్రధాని మోదీ అన్నారు. ఈ సమయంలో యమునా నది నుంచి 16 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించారని ఢిల్లీలో చాలా తక్కువ సమయంలో 650 దేవి ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభమయ్యాయన్నారు. భవిష్యత్తులో ఈ ఎలక్ట్రిక్ బస్సులు సుమారు 2వేల సంఖ్యను దాటుతాయని,. గ్రీన్ ఢిల్లీ - క్లీన్ ఢిల్లీ మంత్రాన్ని మరింత బలపరుస్తుందన్నారు. దేశంలోనే మొదటి ఎనిమిది లైన్ల అర్బన్ ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వే అయిన ఈ ప్రాజెక్టు ఢిల్లీగురుగ్రామ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. 10.1 కిలోమీటర్ల మార్గాన్ని రూ.5,360 కోట్లతో నిర్మించారు.

ఈ మార్గం యశోభూమి, ఢిల్లీ మెట్రో బ్లూ, ఆరెంజ్ లైన్లకు, రాబోయే బిజ్వాసన్ రైల్వే స్టేషన్‌కు అనుసంధాస్తుంది. గతేడాది మార్చిలో ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలోని 19 కిలోమీటర్ల హర్యానా విభాగాన్ని ప్రధాని ప్రారంభించారు. తాజాగా ఢిల్లీ విభాగం సైతం అందుబాటులోకి వచ్చింది. దాంతో గురుగ్రామ్ నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు కేవలం 20 నిమిషాల్లో చేసే అవకాశం ఉంటుంది. ఇక రూ.5,580 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఢిల్లీకి మూడో రింగ్ రోడ్‌గా పని చేయనున్నది. ఢిల్లీ, సోనిపట్, బహదూర్‌గఢ్ వంటి నగరాలను కలుపుతోంది. అలీపూర్ నుంచి డిచాన్ కలాన్ వరకు నిర్మించారు. నిర్మాణానికి ఘాజీపూర్ ల్యాండ్‌ఫిల్ నుండి సేకరించిన రెండు మిలియన్ టన్నుల వ్యర్థాలను ఉపయోగించడం విశేషం.

# ఇంజినీరింగ్‌లో భారీగా సీట్లు ఖాళీ

## కన్వీనర్ కోటాలో మిగిలిపోయినవే 22.27%

## ఉన్న సీట్లు 1.53 లక్షలు, సీటుకు అర్హులైన వారు 1.28 లక్షలు

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లు నాలుగో వంతు ఖాళీగా ఉండిపోనున్నాయి. కన్వీనర్ కోటాలో విద్యార్థుల కంటే సీట్లే అధికంగా ఉండటంతో 34,298 సీట్లు మిగిలిపోయాయి. విశ్వవిద్యాలయాల్లోనూ 1,381 సీట్లు ఖాళీగా ఉన్నాయి. యాజమాన్య కోటా కలిపితే ఈ సంఖ్య మరింత భారీగా పెరుగుతుంది.ప్రభుత్వ కన్వీనర్ కోటా సీట్లకు సాంకేతిక విద్యా శాఖ రెండు విడతలుగా ఇ-కౌన్సిలింగ్ నిర్వహించింది. రెండు విడతలు పూర్తయిన తర్వాత చూస్తే...ప్రైవేటు కళాశాలల్లో ఏకంగా 31,811 సీట్లలో ఎవరూ చేరలేదు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లోనూ 1,126 సీట్లు మిగిలాయి. కౌన్సిలింగ్‌కు రిజిష్టర్ చేసుకున్న విద్యార్థుల కంటే సీట్లే అధికంగా ఉన్నాయి. ఇఎపి సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు 1,84,248 మంది ఉండగా...వీరిలో కన్వీనర్ కోటాలో చేరేందుకు రిజిష్టర్ చేసుకున్న వారు 1,29,012 మంది. వీరిలో అర్హత సాధించిన వారు 1,28,712 మంది...కానీ ప్రైవేటు వర్సిటీలు,కళాశాలలు,ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో కలిపి కన్వీనర్ కోటా కింద 1,53,964 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కౌన్సిలింగ్‌కు అర్హత సాధించిన వారందరికీ సీట్లు కేటాయించినా 25 వేలకు పైగా మిగిలే పరిస్థితి. కొంత మంది అభ్యర్థులు కోరుకున్న కళాశాలల్లో సీట్లు పొందకపోవడంతో మిగులు సంఖ్య మరింత పెరిగింది. ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 70% కాగా యాజమాన్య కోటా 30% ఉంటుంది. ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఇది 35%,65%గా ఉంది. యాజమాన్య కోటా సీట్లలోనూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సిఎస్‌ఈ) మినహా మిగతా బ్రాంచిల్లో సీట్లు భారీగా మిగిలాయి. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) సీట్లు,కొత్త కళాశాలల మంజూరుపై స్టే నిషేధం ఎత్తివేసింది. మౌలిక సదుపాయాలు చూపిస్తే సీట్లు మంజూరు చేస్తోంది.డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో వంద శాతం సీట్లను యాజమాన్యమే భర్తీ చేసుకుంటోంది. ఎఐసిటిఇ డీమ్డ్ టు బీ వర్సిటీలకు కొత్త అనుమతులు ఇస్తోంది. చాలా మంది వీటిలోనూ ప్రవేశాలు పొందుతున్నారు. ఆయా వర్సిటీలు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించుకుంటున్నాయి. సిఎస్‌ఇ బ్రాంచికి డిమాండ్ ఉండటంతో ఇప్పుడు అన్ని విద్యా సంస్థల్లోనూ ఈ సీట్లే అధికంగా ఉన్నాయి.ఈ ఎపి సెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు స్థానికంగా ప్రవేశాలు పొందడం లేదు. ఎన్‌ఐటి,ఐఐటి,ట్రిపుల్‌ఐటిలు లేదా ఇతర రాష్ట్రాల్లోని పేరొందిన వర్సిటీలు, కళాశాలల్లో చేరుతున్నారు. ఈఎపిసెట్‌లో 200 లోపు ర్యాంకుల్లో ఇద్దరు,టాప్-500 ర్యాంకుల్లో 12 మంది మాత్రమే కౌన్సిలింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం.

# కూంబింగ్ టీమ్ అదుపులో మావోయిస్టు

>> లైవ్ అమ్మునిషన్ 023 కిట్ బ్యాగులు,విప్లవ సాహిత్యాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ అమిత్ బర్దర్‌తెలియజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మావోయిజం అనేది ఒక నిషేధిత సిద్ధాంతమని దానిని విడిచిపెట్టి మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోవాలని ఎస్పీ పిలుపు నిచ్చారు. స్వచ్ఛందంగా లొంగిపోయిన మావోయిస్టులపై ఎటువంటి కేసులు నమోదు చేయకుండా ప్రభుత్వ పునరావాసం కల్పించడంజరుగుతుందని ఎస్పీ హామీ ఇచ్చారు. ఎవరైనా మావోయిస్టులకు ఆశ్రయం ఇచ్చిన వారికి సహాయ సహకారాలు అందించిన వారిపై సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతున్నారని కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ అమిత్ బర్దర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో పాడేరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ దీనబంధు పాల్గొన్నారు. జి.మాడుల మండలం కిల్లంకోట పరిసరాల్లో మావోయిస్టుల కదలికలు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు.కూంబింగ్ వెళుతున్న పోలీస్ బలగాలపై మావోయిస్టులు కాల్పులకు ప్రయత్నించగా వాటిని చాకచక్యంగా బలగాలు అప్రమత్తం వ్యవహరించి ఒక మావోయిస్టును అదుపులోకి తీసుకోవడంతో పాటు తుపాకీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు పాల్పడిన మావోయిస్టులు ఎంతమంది ఉన్నారో సమాచారం లేకపోయినా మళ్లీ మావోయిస్టులు కదలికలు ఈ ప్రాంతంలో కనిపిస్తుండటంతో పోలీస్ యంత్రాంగంలోనే కాకుండా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ కదనం ప్రకారం అరెస్ట్ అయిన మావోయిస్టు చైతో కీళ్లంకోట ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు వచ్చే అవకాశాలు ఉన్న దృష్ట్యా క్నిల్లకోట ప్రాంతంలో స్థానిక గిరిజనుల సహకారంతో మావోయిస్టుల సమావేశం నిర్వహించడానికి ముందస్తుగా గిరిజనుల సహకారం తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిసిందని ఎస్పీ తెలిపారు.దీంతో కిల్లంకోట ప్రాంతాన్ని బలగాలు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.ఇదిలా ఉండగా పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు సొంత గ్రామం కిల్లంకోట కావడంపై పోలీసులు మరింత అప్రమత్తం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## వారం - వర్జ్యం

18-08-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
దశమి సా.5.24
మృగశిర రా.2.06
వర్జ్యం : ఉ.10.10-11.42
దు.ము. 12.38-1.29, 2) మ.3.10-సా.4.01
శుభసమయం: ఉ.9.20-9.50,సా.6.30-7.15
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** బాధ్యతలు సమర్థవంతంగా నెరవేరుస్తారు. నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం :** కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం. ఆస్తి తగాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**మిథునం:** రాజకీయ, పారిశ్రామిక రంగాలవారికి విదేశీపర్యటనలు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**కర్కాటకం :** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. వాహనాలు కొనుగోలుచేస్తారు.

**సింహం:** ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. ఇళ్లకు సంబంధించిన నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**కన్య :** కొత్త కార్యక్రమాలు చేపట్టి సన్నిహితుల సాయంతో పూర్తిచేస్తారు.

**తుల :** ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం. ఉద్యోగ, వ్యాపారాలలో పట్టుదలతో ముందుకు సాగుతారు.

**వృశ్చికం:** నూతన కార్యక్రమాలు చేపట్టినా సంతృప్తికరంగా సాగవు. వస్తు లాభం.

**ధనుస్సు:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మకరం:** ఆస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. భాగస్వామ్య వ్యాపారులలో స్వల్ప లాభాలు పొందుతారు.

**కుంభం:** షేర్ల, భూముల క్రయ విక్రయాలలో ప్రోత్సాహకరంగా ఉంటాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**మీనం :** కొత్త పెట్టుబడులకు తగిన సహాయం లభిస్తుంది. ఇంటాబయటా మీదే పైచేయిగా ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఉగ్రవాద మద్దతుదారులపై కఠిన చర్యలు

## ప్రశాంతతను చెడగొట్టే కుట్రలను సహించమని మంత్రి సత్యకుమార్ హెచ్చరిక



**ధర్మవరం,ఆగస్టు17 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఇటీవల చోటుచేసుకున్న ఉగ్రవాద అనుమానితుల అరెస్టు ఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాలను పరిశీలించి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందించారు. కేంద్ర నిఘా సంస్థల ఆధారాలు, స్థానిక పోలీసుల అప్రమత్తతతో ఈ అరెస్టులు జరిగినట్టు తెలిపారు. ఉగ్రవాద సంబంధాలున్న అనుమానితుడి అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగుతోందని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కుట్ర కోణం ఉన్న అవకాశాన్ని విస్మరించలేమని పేర్కొంటూ, ధర్మవరంలో ప్రశాంతతను చెడగొట్టే అలజడులు సృష్టించాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మవరం శాంతియుత వాతావరణాన్ని భంగపరచే యత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉగ్రవాద మద్దతుదారులపై కఠిన చర్యలు తీసుకుంటాయని. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, అలజడులకు తావివ్వకూడదని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు అధికారిక నిఘా సంస్థల నివేదికల ద్వారా త్వరలో వెలుగులోకి వస్తాయని. అప్పటి వరకు ఊహాగానాలకు తావివ్వకుండా, సహనంతో ఉండాలని ప్రజ్నలదరినీ కోరారు. అంతేకాక, ధర్మవరం ప్రజల భద్రత, సమాజంలో శాంతివాతావరణాన్ని కాపాడడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన బాధ్యత అన్నారు మంత్రి యాదవ్.

# డిజిటల్ మీడియాలో పర్యాటక ప్రాంతాల విస్తృత ప్రచారం

## పర్యాటకులను ఆకట్టుకునేలా ఎపిటిడిసి చర్యలు

**విజయవాడ.ఆగస్టు17ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం లోని పర్యాటక, చారిత్రక, వారసత్వ సందకు ప్రతీకగా నిలిచిన ప్రదేశాల వైపు పర్యాటకులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రత్యేక చర్యలు చేపట్టింది. డిజిటల్ మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ అంతర్జాతీయ పర్యాటకులనూ ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల ప్రత్యేకతలపై వేర్వేరుగా రూపొందించి వీడియోలతో ప్రచారం చేస్తోంది. వీటిని అందరూ లైక్, షేర్ చేసి మన ప్రాంతాల ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెప్పాలని ఏపీటీడీసీ ఒక ప్రకటనలో కోరింది. కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపం లోని పెడన కలంకారీ ప్రత్యేకతను వివరిస్తూ రూపొందించిన వీడియోలో సహజ రంగులతో కూడిన అద్దకం, భారతీయ హస్తకళల్లో ప్రాచీనమైన కలంకారీ చిత్రకళను, కళాకారుల నేపుణ్యాన్ని వివరించింది. బాపట్ల జిల్లా లోని భట్టిప్రోలు బౌద్ధస్తూపం నిర్మాణం క్రీ.పూ.3వ శతాబ్ధంలో జరిగిందని తెలుగులో లభ్యమైన తొలి శాసనబంగా ఇక్కడి శాసనాలకు పేరుందని మరో వీడియోలో పేర్కొంది. అలనాడు వాణిజ్య, విద్యా కేంద్రంగా విరాజిల్లిన భట్టిప్రోలను సందర్శిం చాలని కోరింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో జాతీయస్థాయిలో పేరున్న మంగళగిరి చేనేత, ఫ్యాబ్రిక్ ఉత్పత్తుల గొప్పతనాన్ని...పానకాల లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయ ప్రాశస్త్యాన్ని ఓ వీడియోలో వివరించింది. చీరల అల్లిక, నిజాం డిజైన్ బోర్డర్, నాణ్యమైన రంగుల అద్దకం తదితర అంశాలు ఇందులో పొందుపర్చింది. ఇక్కడి చేనేతకు జాతీయస్థాయిలో భౌగోళిక గుర్తింపు (జీఐ) దక్కిందని పేర్కొంది. మానవ కృషి, కళానైపుణ్యం కలిసి తయారయ్యే ఈ చీరలు వస్త్రాలు మాత్రమే కావని, జ్ఞాపకాలు, భావోద్వేగానికి ప్రతీకలని పేర్కొంది

గుంటూరు జిల్లా ఉండల్లి గుహల గొప్పతనం వివరిస్తూ ఉండవల్లిలో ఉలితో చెక్కిన గుహలను తప్పక సందర్శిం చాలని పర్యాటకులను మరో వీడి యోలో ఆహ్వానించింది. విజయవాడ సమీపం లోని ఈ ప్రాంతంలో విష్ణుకుండినుల కాలానికి చెందిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆలయాలతో పాటు 20 అడుగుల ఏకశిల అనంత పద్మనా భస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణఅని పేర్కొంది. జాతీయ ప్రాముఖ్యత కల్గిన కేంద్ర రక్షిత స్మారక కట్టడాల్లో ఒకటని ఏపీటీడీసీ తెలిపింది.

# సాహిత్యరంగం బలహీనపడుతున్నప్పుడు నిబద్ధతగల సంస్థలు తప్పనిసరి

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** సాహిత్యరంగం బలహీనపడుతున్నప్పుడు నిబద్ధత గల సాహిత్య సంస్థలు తప్పనిసరిగా అవసరమవుతాయని వక్తలు అన్నారు. స్థానిక ఐఎన్ఏ హాలులో విశ్వసాహితీ కళావేదిక ఆవిర్భావ సభ జరిగింది. ఈ సభను బహుగ్రంథకర్త, కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డా.జి.వి.పూర్ణచందు జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. అనంతరం పూర్ణచందు మాట్లాడుతూ సాహిత్యం ప్రవహించే నది అనుకుంటే ఆ నదిని పరిరక్షించే పచ్చని చెట్లు సాహితీ సంస్థలేనన్నారు.

డా గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ ఆధునిక సాహిత్యానికి మూలం ప్రాచీన సాహిత్యమేనని, ఈ తరం కవులు ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేయాలన్నారు. నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ రాజకీయాలకంటే ముందు సాహిత్యరంగంలో ప్రజాస్వామ్యం అవసరమన్నారు.

స్వేచ్ఛాజీవు లైన కవులపై కొన్ని సంస్థల నిర్వాహకులు నిర్బంధం విధిస్తున్నారన్నారు. సాహిత్యరంగంలో ప్రజాస్వామ్య విలువలపై చర్చజరగాల్సిన అవసరముందన్నారు. సీనియర్ జర్నలిస్టు డా. విజయకుమార్ మాట్లాడుతూ కవులు లౌకికవా దులు కావాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ సంస్థల మధ్య సమన్వయం వుండాలన్నారు. పరసంస్థ సహనం పాటించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకురాలు కొల్లి రమావతి మాట్లాడుతూ భాషాభివృద్ధి లక్ష్యంగా తాము విశ్వసా హితీ కళావేదికను ఏర్పాటు చేసామన్నారు. కవులకు, సాహిత్యవేత్తలు తమ సంస్థ అండగా ఉంటుందన్నారు. సంస్థ బాధ్యులు రంగిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన శతాధిక కవి సమ్మేళనంలో కవులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం సభకు డా.గజల్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలుగు భాషా వికాసానికి కృషి చేయాల్సిన బాధ్యత సాహిత్య సంస్థపై ఉంద న్నారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవుల్ని సత్కరించారు.

# ఏసీఏ అధ్యక్షుడిగా కేశినేని శివనాథ్

## కార్యదర్శిగా సానా సతీష్‌బాబు

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏసీఏ అధ్యక్షుడిగా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, కోశాధికారిగా దండమూరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా బి.విజయ్‌కుమార్, కౌన్సిలర్‌గా గౌర్ విష్ణుతేజ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడి పదవికి నామినేషన్ వేసిన బండారు నర్సింహారావు సమర్పించిన ధృవీకరణ పత్రాల్లో వివరాలు సరిగ్గా లేకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ సతీష్‌కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి లోని విజయవాడ క్లబ్‌లో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషణ్ అధికార ప్రతినిధి మ్యాంచో ఫెర్రర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఎన్నికైన సభ్యులకు రమేష్‌కుమార్ ధృవీకరణ పత్రాలు అందచేశారు. వచ్చే నెలలో ఉపాధ్యఓ పదవికి ఎన్నికలు నిర్వహిస్తామని ఏసిఏ సభ్యులు తెలిపారు. ఈ కార్యవర్గం పదవీకాలం 2028 వరకు ఉంది. వైకాపా హయాం లోని ఎపెక్స్ కౌన్సిల్ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజీనామా చేయడంతో మిగిలిన ఏడాది కాలానికి అప్పట్లో ఏసిఏ అధ్యక్షుడిగా కేశినేని శివనాథ్, కార్యదర్శిగా సానా సతీష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ కార్యవర్గ పదవీకాలం ఇటీవల ముగియడంతో తాజాగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం

**తిరుమల, ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:** లోకక్షేమం, ప్రజల ఐశ్వర్యం ఆయురారోగ్యం సంపదలు కాంక్షిస్తూ తిరుమల ధర్మగిరి వేంకటేశ్వర వేదవిజ్ఞానపీఠంలో సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం మొదలైంది. ఆదివారం సాయంత్రం వేదోక్తంగా ఈ యాగాన్ని 32మంది వేదపండితుల సమక్షంలో నిర్వహిస్తున్నారు. ఈ మహాయాగంలో వేదపారాయణం, సుందరకాండపారాయణం తదితర వైదిక క్రతువులు చేపడతారు. ఆగస్టు 20వతేదీ పూర్ణాహుతితో యాగం పరిసమాప్తమవుతుంది. నాలుగురోజులపాటు జరిగే ఈ యాగంలో ఆదివారం సాయంత్రం ఆచార్యవరణం, మేదినీ పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ, వేదారంభం కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. ఈ యాగంలో టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఎస్వీవేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పాశివసుబ్రమణ్యం అవధాని, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



# దసరా ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 17, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో 2025 దసరా ఉత్సవాల ఏర్పాట్లుకు సంబంధించి సివి చారిటీస్‌లో రూపొందించిన క్యూలైన్ నమూనాను ఇఓ వికె శీనా నాయక్ ఆదివారం పరిశీలించారు. కొన్ని మార్పులను అధికారులకు సూచించారు.

అనంతరం మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 02 వరకు జరిగే దసరా ఉత్సవాలకు భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించడానికి గతంకంటే మరింత మెరుగుగా, అధునాతనంగా దసరా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మ వారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి ఆదివారం తణుకుకు చెందిన కందుల లక్ష్మణరావు, విజయవెంకట లక్ష్మిలు రు.1,00,116ల విరాళంగా అందించారు. దాతల కుమారుడు రామప్రసాద్, కోడలు ప్రభాచంద్ర, మనుమలు శ్రీయాన్స్ లక్ష్మణ అభిరాం, కుమార్తె లక్ష్మి సహస్రల పేరిట ఈ విరాళాన్ని ఇచ్చారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



దాతలకు దుర్గమ్మ వారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం



నమూనా క్యూలైన్లు పరిశీలిస్తున్న ఇఓ

# తిరుమలలో ఉట్లోత్సవం



**తిరుమల,ఆగస్టు17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో ఆదివారం సాయంత్రం గోకులాష్టమి పర్వదినం మరుసటిరోజు ఉట్లోత్సవం వేడుకగా జరిగింది. సాంప్రదాయంగా ఆనవాయితీ ప్రకారం మధ్యాహ్నం ఆలయం నుండి శ్రీమలయప్ప స్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై ఉత్సవమూర్తులను ఆలయానికి ఎదురుగా ఉన్న పెద్దజీయర్ మఠానికి మంగళవాయిద్యాల నడుమ వేంచేపు చేశారు.. ఇక్కడ వేదోక్తంగా ఆస్థానం చేపట్టారు. పెద్దజీయర్‌స్వామికి, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి పరివట్టంతో స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం ప్రసాద నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు. అక్కడ నుండి బేడి ఆంజనేయస్వామి ఆలయం మీదుగా బయలుదేరిన మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి ఆలయం ముందుకు వచ్చారు. ఇక్కడ హాథీరాంజీమఠం వారినుండి ప్రత్యేక పూజలు, నివేదనలు అందుకుని యువకులు ఉట్టికొట్ట డాన్ని పర్యవేక్షించారు. ఆలయం ఎదురుగా తోలుత ఉట్లోత్సవం ఉత్సాహంగా సాగింది. ఆ తరువాత వరుసగా దక్షిణమాఢవీధి, పడమరమాఢవీధి, ఉత్తరమాఢవీధుల్లో ఏర్పాటు చేసిన ఉట్లను యువత ఆద్యంతం కోలాహలంగా ఉట్లోత్సవంలో ఉట్టికొట్టి గోవిందనామస్మరణ చేశారు. చిరుజల్లులు పలకరించగా ఉట్లోత్సవం వైభవంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం దంపతులు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# 'శ్రీవాణి'కి ఐదింతలు డిమాండ్

## జారీచేసేది 800 టిక్కెట్లు, క్యూలో ఐదువేలమంది భక్తులు

**తిరుమల,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:** మూడు రోజులు వరుససెలవులు, వారాంతం రద్దీపెరగడంతో తిరుమలలో ఏరోజుకారోజు శ్రీవాణి బ్రేక్ దర్శనాలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఆఫ్‌లైన్‌లో ప్రత్యేక కౌంటర్‌లలో 800 టిక్కెట్లు జారీచేస్తుండగా ఐదింతలు రెట్టింపయిన భక్తులు ఈ టిక్కెట్లకు ఐదువేల మంది వరకు క్యూలైన్లలో బారులుతీరి నిలబడు తున్నారు. ఆదివారం సాయంత్రం దర్శనానికి సంబంధించి శనివారం రాత్రి 9గంటల ప్రాంతంలో శ్రీవాణి టిక్కెట్లు జారీచేసే కౌంటర్ ప్రాంతంలో భక్తులు బారులు తీరారు. అయితే గత రాత్రి జరిగిన తోపులాట, రద్దీతో ఆదివారం ఉదయం 10గంటలకే భక్తులకు దర్శన టిక్కెట్లు జారీచేశారు. శనివారం రాత్రి క్యూలో ముందు గానే వచ్చిన భక్తులను విజిలెన్స్ సిబ్బంది ముందుగా సమాచారం అందించి అక్కడకు వెనక్కుపంపారు. దీంతో



ఆదివారం వేకువజామున 4గంటలనుండే భారీగా భక్తులు ఈ కౌంటర్‌వద్ద నిలబడ్డారు. ఓవైపు చిరుజల్లులు కురుస్తున్నా, విపరీతమైన చలిగాలులు వున్నా భక్తులు ఖాతర్‌చేయలేదు. తమకు ఆ దేవుని దర్శనం చేసుకుంటే చాలనే విశ్వాసం వ్యక్తం చేశారు. సాధారణరోజుల్లోకూడా శ్రీవాణికి విపరీతమైన డిమాండ్ ఉంది. పైగా ఉదయం టిక్కెట్లు జారీచేస్తే సాయంత్రం ఆలయంలోపల కులశేఖరపడివద్ద మొదటిగడప నుండి శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రశాంతంగా, కళ్లారా మరీ దగ్గరగా దర్శనం చేసుకునే భాగ్యం ఉండటంతో చాలావరకు భక్తులు ఈ దర్శనాలపై ఆధారపడుతున్నారు. టిటిడి అధికారులు ఈ టిక్కెట్లను పెంచాలని భక్తులు కోరుతున్నారు. సాదారణరోజుల్లోనూ 1,500మంది వరకు భక్తులు శ్రీవాణికోసం డిమాండ్ ఉంది. ఇక వారాంతం, ప్రత్యేక సెలవురోజుల్లో ఈ రద్దీ ఐదింతలు రెట్టింపవుతోంది. మరీ టిటిడి అధికారులు భక్తుల అవసరానికి ఎలా స్పందిస్తారనేది చూడాల్సిందే. రానున్న రోజుల్లో సామాన్య భక్తులు కూడా దేవదేవుడిని మరింత దగ్గరగా ప్రశాంతంగా దర్శనం చేసుకునే వీలుకలిగేలా శ్రీవాణి బ్రేక్ దర్శనాలపైనే ఆధారపడే సూచనలు లేకపోలేదు. ప్రస్తుతం రోజువారీగా 2వేలమంది భక్తులు శ్రీవాణి బ్రేక్ దర్శనం చేసుకుంటున్నారు.



# సినిమాల్లో మహిళల పట్ల వివక్షను కట్టడి చేయాలి : మంత్రి లోకేష్

**విజయవాడ,ఆగస్టు 17,ప్రభాతవార్త ప్రతినిధి:** సినిమాలు, సీరియళ్ళలో మహిళల పట్ల వివక్షను కట్టడి చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఏపీ మంత్రి నారా లోకేష్ తెలిపారు. లింగ వివక్ష, అవమానకరమైన సంభాషణలను నియంత్రించాలన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. మహిళల పట్ల గౌరవం నిజమైన నాగరికర సమాజానికి పునాది అని తెలిపారు. పిల్లలు చూసే విధంగా సినిమాలు సీరియళ్ళు రూపొందాలన్నారు. ఇంట్లో తెరపై చూసేదే వారు నేర్చుకునే అవకాశముందని వివరించారు. ప్రస్తుతం సినిమాల్లో, సీరియళ్ళ అనుచిత అంశాలతో కూడిన అంశాల్లో స్త్రీలను చేర్చడం వారిని కించపరిచే దిశలో వివక్ష చూపించడం సరికాదన్నారు. ఇటువంటి ప్రసారాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు.

# క్వాంటం టెక్నాలజీస్‌పై శిక్షణ

## నేటి నుంచి సెప్టెంబర్ 11వ తేదీ వరకు శిక్షణ

## ఉన్నత విద్యామండలి చైర్మన్ కె మధుమూర్తి

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** క్వాంటం టెక్నాలజీస్‌పై అధ్యాపకులకు రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ ఇస్తున్నామని ఉన్నత విద్యామండలి చైర్మన్ కె మధుమూర్తి వెల్లడించారు. జైపూర్‌లోని మాలవ్య నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎన్ఐటి), సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం(డిఎస్‌టి), ఐబిఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, మద్రాస్ ఐఐటీల సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి సెప్టెంబర్ 11వ తేది వరకు 20 రోజుల పాటు ఆన్‌లైన్‌లో 40 గంటలు జరుగుతుందని వెల్లడించారు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్ర, కంప్యూటర్ సైన్స్, గణితం, లైఫ్ సైన్సెస్, ఆర్థిక శాస్త్రం, వాణిజ్యం, వ్యవసాయం, వైద్య శాస్త్రాలు, మత్స్య, ఉద్యానవన, ఫార్మాస్యూటికల్స్ వంటి బహుళ విభాగాల్లో 1000 మంది అధ్యాపకులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. 2026 ఏప్రిల్ వరకు దశల వారీగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

# తిరుమల సమాచారం

## సెప్టెంబర్ 24నుండి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు



**తిరుమల,ఆగస్టు 17 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది జరగనున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల కార్యాచరణను తిరుమల తిరుపతి దేవస్థానం ఖరారుచేసింది. ఈ ఏడాది ఒక బ్రహ్మోత్సవం మాత్రమే నిర్వహిస్తారు. వాహనసేవలను ఆలయమాఢవీధుల్లో నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడంపై, భక్తులకు ఇబ్బంది లేకుండా వాహనసేవలవీక్షణకు సౌకర్యాల కల్పనపై అన్నమయ్యభవనంలో ఇప్పటికే టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అధ్యక్షతన ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 24వతేదీ నుంచి అక్టోబర్ 2వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ముహూర్తం ఖరారుచేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవాలను వైభవంగా విజయవంతంగా నిర్వహించే ఏర్పాట్లు చేపడుతామన్నారు. ఈ ఏడాది కూడా పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశముందని, ఇందుకు అనుగుణంగా పటిష్టంగా ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దు చేయడం జరుగుతుంది. బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ కు భక్తులు అశేషసంఖ్యలో విచ్చేసే అవకాశం ఉండటంతో విస్తృతంగా ఏర్పాట్లు చేపడతారు. సామాన్యభక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు రద్దుచశారు. ప్రోటోకాల్ విఐపిలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు మంజూరుచేస్తారు.


**సెప్టెంబర్ 24న సిఎం పట్టువస్త్రాలు:** ఈ ఏడాది సెప్టెంబర్‌లో మొదలయ్యే తిరుమలేశుని సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తొలిరోజు సెప్టెంబర్ 24వతేదీన ధ్వజారోహణంరోజునే రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రాష్ట్రప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 24వతేదీ రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహనం, సెప్టెంబర్ 28 గరుడసేవ, 31న స్వర్ణరథం, 1వతేదీ రథోత్సవం, 2న చక్రస్నానం జరుగుతాయి. పోలీసుల తో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రత కల్పించేలా చూడనున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటుచేసి, భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తారు.

## ఆన్‌లైన్‌లో నేటి నుండి నవంబర్‌నెల ఆర్జితసేవా టిక్కెట్లు

### 21న వర్చువల్ సేవా టిక్కెట్లు , 23న అంగప్రదక్షిణ టోకెన్లు

**తిరుమల, ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామి రోజువారీ, వారాంతపు ఆర్జితసేవలకు సంబంధించి నవంబర్‌నెలకోటా టిక్కెట్లు సోమవారం ఉదయం నుండి టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. ఇందుకు టిటిడి ఐటి విభాగం అన్ని ఏర్పాట్లుచేసింది. కాగా నవంబర్ నెలనుండి శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనాల టిక్కెట్ల దర్శన సమయం సాయంత్రం 4.30గంటలకు నిర్ణయించింది. ఈ సేవా టిక్కెట్లు ఆన్‌లైన్ డిప్ విధానంలో, కొన్నిసేవలు ముందువచ్చిన భక్తులకు ముందు అనే ప్రాతిపదికన ఆన్‌లైన్‌విధానంలో భక్తులు నేరుగా బుక్‌చేసుకునే సదుపాయం కల్పిస్తున్నారు. నేడు 18వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో ఆర్జితసేవా టిక్కెట్లు విడుదల చేస్తే 20వతేదీ ఉదయం 10గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 22వతేదీ మధ్యాహ్నం 12గంటలలోపు సొమ్ముచెల్లించి టిక్కెట్లు మంజూరవుతాయి. 21వ తేదీ ఉదయం 10గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవల టిక్కెట్లను విడుదల చేయనుంది. 21న ఆన్‌లైన్‌లో వర్చువల్ సేవా టిక్కెట్లను మధ్యాహ్నం 3గంటలకు విడుదలవుతాయి. 23వతేదీ అంగప్రదక్షిణ టోకెన్లు ఉదయం 10గంటలకు , శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు కోటా రోజుకు 500 లెక్కన ఉదయం 23న 11గం టలకు విడుదల చేస్తారు. వృద్ధులు దివ్యాంగులు దర్శన కోటా ఆగస్ట్ 23న మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్ల కోటా 25న ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. గదుల కోటాను మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు ఆన్‌లైన్‌లో స్వామివారి దర్శన టిక్కె ట్లును 'టిటిదేవస్థానమ్స్.ఎపి.జివొవి.ఇన్'వెబ్‌సైట్‌ద్వారా బుక్‌చేసుకోవాలి.

## సెప్టెంబర్ 5నుండి తిరుచానూరు పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు



**తిరుమల,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయంలో సెప్టెంబర్ 5వతేదీ శుక్రవారం నుండి 7వతేదీ ఆదివారం వరకు మూడురోజులు పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు సెప్టెంబర్ 2వతేదీ మంగళవారం సాయంత్రం విశ్వక్సేనారాధన, పుణ్యాహావచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం ,అంకురార్పణ చేపట్టనున్నారు. ఆలయంలో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలిసీతెలియక దోషాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. సెప్టెంబర్ 5వతేదీ పవిత్రప్రతిష్ట, 6న పవిత్ర సమర్పణ, 7వతేదీ పూర్ణాహుతి కార్యక్రమాలు జరగనున్నాయి. 750 రూపాయలు చెల్లించి పవిత్రోత్సవాలు టిక్కెట్ పొందే గృహస్థభక్తులకు 2లడ్డూలు, 2వడలు బహుమానంగా అందజేస్తారు. ఆలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 2న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, సెప్టెంబర్ 4న అంకురార్పణ సందర్భంగా అమ్మవారికి జరిగే తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, 5వతేదీ అభిషేకానంతరం దర్శనం, లక్ష్మీపూజ సేవలు రద్దుచేశారు. అలాగే సెప్టెంబర్ 5,6,7 తేదీల్లో మూడురోజులు కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, వేద ఆశీర్వచనం, కుంకుమార్చన, ఊంజల్‌సేవలు టిటిడి రద్దు చేసింది.

# అందరికీ మంచి జరగాలని వేడుకున్నా



**తిరుమల,ఆగస్ట్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే అందరికీ మంచి జరుగుతుందని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు జార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అంబుజనాథ్ తెలిపారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల ప్రారంభసమయంలో ఆలయం వద్దకు వచ్చిన జస్టిస్ అంబుజనాథ్‌కు ఆలయ అధికారులు స్వామి వారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# వెంకన్న దర్శనానికి 40గంటలుపైనే..



**తిరుమల,ఆగస్టు 17 ప్రభాతవార్తప్రతినిధి:** మూడు రోజులు వరుససెలవులు, వారాంతం కలసి రావడంతో తిరుమల భక్తజనసంద్రంగా మారింది. ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివ స్తున్నారు. ఆదివారం ఉదయం కూడా యధావిధిగా భక్తుల లైన్లు ఆలయం వెలుపల ఐదుకిలోమీటర్లు చేరాయి. శిలాతోరణం వద్ద నుండి సామాన్యభక్తులు వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌కు చేరుకునే పరిస్థితి ఉంది. ఆదివారం ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో నిరీక్షిస్తున్నారు. దీంతో స్వామివారి సర్వదర్శ నానికి 25గంటలు కంపార్టుమెంట్లలో ఉన్నవారికి కేటాయించగా, వెలుపల వున్న భక్తులకు 40గంటలుపైగానే నిరీక్షణ తప్పడం లేదు. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి పదిగంట లపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 49వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 30వేలమందివరకు భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శనివారం రాత్రివరకు 87,759 మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. కానుకల రూపంలో హుండీ ఆదాయం 4.16కోట్లు చేకేరింది. గత 15రోజులు భక్తులు రద్దీ కొనసాగుతుండటంతో ఇప్పటివరకు 12.12లక్షలమంది భక్తులు ఈనెలలో స్వామివారిని దర్శించుకున్నారు. హుండీ ఆదాయం 63.24కోట్ల రూపాయలు లభించింది. సాధారణంగానే వారాంతం శని, ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. అయితే వరుసగా మూడురోజులు సెలవులతో దేశం నలుమూలలనుండి భక్తులు భారీగా తిరుమలకు చేరుకోవడంతో సామాన్య భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు శ్రీవారి సేవకులు నిరంతరాయంగా పాలు, కాఫీ, తాగు నీరు, అన్నప్రసాదాలు, అల్పాహారం అందిస్తున్నారు.

వార్త

జీవితాన్ని ఇచ్చిన తల్లిదండ్రులకు, జ్ఞానవంతునిగా చేసిన ఉపాధ్యాయులకు మించిన గౌరవించతగినవారు లేరని తెలుసుకో.

-తిరుక్కురళ్

# కాలుష్య కౌగిలిలో నగరాలు!

ఒర్లి ఒర్లి వారుపోతారు, వండుక తిని మనం పోదాం అన్నట్లుగా ఉంది కాలుష్య నియంత్రణ విషయంలో కొందరు అధికారులు, మరికొందరు పారిశ్రామికవేత్తలు వ్యవహరిస్తున్న తీరు. కాలకూట విషంగా మారుతున్న కాలుష్య విషవాయువుల నుంచి ప్రజలను కాపాడేందుకు పాలకులు చట్టాల మీద చట్టాలు చేస్తున్నా, ఎందరిపైనో చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పుకుంటున్నా కాలుష్యకాటుకు బలయ్యేవారి సంఖ్య అంతకంతకు పెరుగుతుండడంఆందోళన కలిగించే అంశం. ఈ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కబెడుతూ జాప్యం చేస్తే కాలుష్య రక్కసి కాటుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది బలికాక తప్పదని పర్యావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. జీవించే హక్కు కల్పించమని కోరుతూ కొందరు ఈ కలుష్యకాసారంలో చిక్కుకున్న నిర్భాగ్యుల వేదన అరణ్యరోదనగా మిగిలిపోతున్నది. కాలుష్య నియంత్రణ మండలిని ఏర్పాటు చేశారు. అనేక చట్టాలు తెచ్చారు. చర్యలు తీసుకుంటున్నారు. అయినా అవేమీ ఈ కాలుష్యం నుండి ప్రజలను కాపాడలేకపోతున్నాయి. ముఖ్యంగా నగరాల్లో కాలుష్యం అంతకంతకు పెరిగి ఇప్పుడు అది నగరాల పరిసర ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నది. ఈ కారణంగానే దేశరాజధాని ఢిల్లీలో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. అక్కడ వాయు కాలుష్యం కారణంగా గాలి పీల్చితే పొగ అలవాటులేకపోయినా కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందనే సంకేతాలు వెల్లడవుతున్నాయి. మరికొందరు ఢిల్లీ నివాసులు వర్ష, చలికాలాల్లో నగరాన్ని వదిలి రెండు,మూడు నెలల పాటు దూరంగా వెళ్లిపోతున్నారు. ఢిల్లీయే కాదు దేశంలో అనేక నగరాల్లో అదే పరిస్థితి. ప్రపంచ జనాభాలో ప్రస్తుతం సగం నగరాల్లోనే నివసిస్తున్నది. మరో మూడు దశాబ్దాల నాటికి నగర జనాభా అదనంగా మూడువందల కోట్లకు పెరుగుతుందని అధికారుల అంచనా. భూభాగంపై నగరాల వైశాల్యం రెండు, మూడు శాతానికి మించకపోయినా కాలుష్యంలో మాత్రం అది ప్రపంచ జనాభా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే స్థాయిలోవిస్తరిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా స్థూల దేశీయోత్పత్తిలో అరవై శాతం ఆరువందల పట్టణాల్లో కేంద్రీకృతమై ఉందంటే నగరాల ప్రాధాన్యత ఏమేరకు ఉందో చెప్పనవసరం లేదు. ప్రధానంగా వ్యవసాయరంగంలో ఏర్పడిన సంక్షోభం గ్రామీణ ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తుండడంతో వలసలు పెరిగిపోయాయి. అందుకే గ్రామీణ జనాభా తగ్గుతుండగా పట్టణాల్లో, నగరాల్లో జనాభా యేడాది యేడాదికి ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. భారత దేశంలో అయితే పట్టణీకరణ అందుకోలేనంతగా పెరుగుతున్నది. 2001లో పట్టణ ప్రాంతాల్లో జనాభా ఇరవైఎనిమిదన్నర కోట్లకు ఉంటే ఇప్పుడది నలభై కోట్లకుపైగా పెరిగిపోయిందని చెబుతున్నారు. ఈ నగరాల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకారం కనీస వసతులు కూడా కల్పించలేకపోతున్నారు. ఎన్నో పథకాలు చేపడుతున్నా అవి అవసరాలను తీర్చలేకపోతున్నాయి. 2005లో ప్రారంభించిన జవహర్‌లాల్‌నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ కార్యక్రమం (జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం) కింద పట్టణ ప్రాంతాల్లో మరికొన్ని సౌకర్యాలు కల్పించి జీవనం కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నా పెరుగుతున్న అవసరాలను అవి అందుకోలేకపోతున్నాయి. భారత్‌లో గతంలో ఆరు మెట్రోనగరాలు చెన్నై, ఢిల్లీ, బెంగలూరు, కోల్‌కతా, హైదరాబాద్, ముంబయిలలో ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహించిన సర్వేలో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. విస్తరణ, తదితర అంశాల్లో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా చేపట్టడం వల్ల తీవ్రమైన దుష్ప్రభావం ప్రజారోగ్యంపై చూపుతున్నదనేది ఆ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా నగరాల్లో వాయు, నీటికాలుష్యంవల్ల పౌరుల ఊపిరితిత్తులకు తూట్లు పొడుతుస్తుందని హెచ్చరించారు. చెన్నై, కోల్‌కతా, ముంబాయిలలో వాహన కాలుష్యం తీవ్రంగా ఉంది. తర్వాత స్థానం పారిశ్రామిక కాలుష్యం. బెంగళూరులో పరిస్థితి మరొకరకంగా ఉంది. పరిశ్రమల కారణంగా అక్కడ వాయుకాలుష్యం తీవ్ర స్థాయికి చేరినట్లు ఆ సర్వేలో బయటపడింది. ఇక వాహనాలు, నీటి కాలుష్యంలో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది. నిర్మాణరంగం వల్ల గాలిలో దుమ్ము, ధూళి చేరుతుండడంతో ప్రజారోగ్యం రానురాను ప్రశ్నార్థకంగా మారింది. హైదరాబాద్ మహానగరంలో ఈవాయు కాలుష్యానికి నీటి కాలుష్యం కూడా తోడుకావడంతో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. నగర శివార్లలోని పరిశ్రమల నుండి గాలిలోకి వదులుతున్న కాలుష్యాలకు అడ్డూఅదుపు లేకుండాపోతున్నది. ఇక నీటి కాలుష్యం పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నది. నగరశివార్లలోని పరిశ్రమల నుండి విషపూరితమైన రసాయనిక కలుషిత జలాలు శుద్ధి చేయకుండా మూసీలో కలిసిపోతున్నాయి. వాస్తవానికి ఈ సమస్య ఇప్పటికిప్పుడు కొత్తగా పుట్టుకొచ్చిందికాదు. ప్రభుత్వ విధానాలు, కొందరు అధికారుల అవినీతి, అసమర్థత, అంతులేని నిర్లక్ష్యం కారణంగా రోజురోజుకు పెరిగిపోతున్నది. ఫలితంగా మూసీతోపాటు ఎన్నో చెరువులు, కుంటలు, కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. కొన్ని చెరువులు అయితే చేపలు, ఇతర జలచరాలు ఏవీ జీవించలేని పరిస్థితి ఏర్పడింది. పశుపక్ష్యాదులతోపాటు మానవ జీవనం కూడా ప్రశ్నార్థకంగా మారే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా ఈ కాలుష్య నియంత్రణ విషయంలో పాలకులు చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు. అవి త్రికరణశుద్ధిగా అమలుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

నీది కాదని తెలిసిన దాన్ని కూడా నీదనుకోవడం నిజంగా నేరం.



ఠాగూర్

ఒక పనిని బాగా చేయడం మాత్రమే కాకుండా మరింత బాగా చేయాలన్న ఆదనపు కోరికను సామర్థ్యం అంటారు.



హెచ్. గిల్బర్ట్

# ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తిని కాపాడాలి!

**ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయినప్పటికీ ఎన్నికల కమిషన్ నిర్వహణకు, కమిషన్ సభ్యుల వ్యక్తిగత అవసరాలకు అవసరమైన నిధులన్నీ ప్రభుత్వమే మంజూరు చేయాల్సి రావడం వల్ల వారు కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు. అందువల్ల ఎన్నికల సంఘానికి, సంఘం సభ్యులకు అవసరమైన నిధులు అధికారంలో వున్న ప్రభుత్వంపై ఆధారపడకుండా బడ్జెట్టులోనే ప్రత్యేకంగా కేటాయించే విధంగా చట్టంలో ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా ఎన్నికల కమిషన్ సభ్యులుగా పదవీ విరమణ చేసినఅనంతరం ప్రభుత్వ పరమైన పదవులు ఆశించడంవల్ల కూడా నిస్పాక్షికంగా వ్యవహరించ లేకపోతున్నారు. ఇదేసమయంలో పదవీ విరమణఅనంతరం ఎన్నికల కమిషన్ సభ్యులు ఎటువంటి ప్రభుత్వ పదవులు స్వీకరించడానికి అవకాశం లేకుండా చట్టాన్ని సవరించాలి. అంతేకాకుండా ఎలక్షన్ కమిషన్ సభ్యుల నియామక కమిటీలో ప్రతిపక్ష నాయకునితోపాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాల్సిన అవసరం వుంది.**



అన్నవరపు బ్రహ్మయ్య

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ పాల్పడిన అక్రమాలపై దేశవ్యాప్తంగా అలజడి చేస్తున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు భారతదేశంపై విధించిన పన్నుల అంశం బిజెపి ప్రభుత్వాన్ని కాపాడుతోంది. ప్రతిపక్షనేత, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బీహార్ ఓటర్ల జాబితాలో జరిగిన అక్రమాలేకాకుండా కర్ణాటక రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో ఒక లోక్‌సభ నియోజకవర్గంలో లక్షకు పైగా దొంగ ఓటర్లను చేర్పించడం, ఒకే ఇంటి నెంబరులో వందల సంఖ్యలో ఓటర్లను నమోదు చేయడం వంటి అంశాలను వెలుగులోకి తీసుకువచ్చినప్పటికీ ఈ అంశాలు పూర్తిస్థాయిలో ప్రజల దృష్టికి వెళ్లడం లేదు. అధికారం దుర్వినియోగం చేసి, ఎన్నికల కమిషన్‌ను తమ చెప్పుచేతలలో పెట్టుకోవడం అధికారంలో వున్న రాజకీయ పార్టీలకుకొత్తమే కాదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఉదాహరణకి 1971లో సార్వత్రిక ఎన్నికల్లో రాయబరేలి నియోజకవర్గం నుంచి ఇందిరాగాంధీ గెలిచారు. ఆమెపై పోటీచేసి ఓడిపోయిన రాజ్ నారాయణ్ ఎన్నికలలో అక్రమాలు జరిగాయని, ఇందిర ఎన్నికను సవాల్ చేస్తూ అలహాబాద్ హై కోర్టులో కేసు వేశాడు. అలహాబాద్ హైకోర్టు జూన్ 12, 1976న తీర్పు చెబుతూ ఎన్నికలలో అక్రమాలు జరిగాయని నిర్ధారిస్తూ ఇందిరా గాంధీని దోషిగా భావించి ఆరు సంవత్సరాల పాటు ఎన్నికలలో పాల్గొన రాదని కూడా తీర్పు చెప్పింది. జూన్ 24న సుప్రీం కోర్టు ఈ తీర్పు అమలు కాకుండా స్టే విధించడం, ఆ తర్వాత పరిణామాలలో 1975లో ఎమర్జెన్సీ విధించడం అందరికీ విదితమే. ఈ కారణంగానే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటుఇండియా కూటమి నేతలు చేస్తున్న ఆందోళనకు ప్రాధాన్యత లేకుండా పోతుందని కొంతమంది మేధావులు అభిప్రాయపడుతున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ఈ వ్యవస్థ నియంత్రణ లేకుండా స్వతంత్రంగా వ్యవహరించే వ్యవస్థలలో భారత ఎన్నికల కమిషన్ ఒకటి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1950వ సంవత్సరంలో భారత ఎన్నికల సంఘం ఏర్పడింది. ఈ చట్టం ప్రకారం ఒకే వ్యక్తి ఎన్నికల కమిషన్‌గా వ్యవహరించేవారు. అయితే 1989, అక్టోబరులో భారత ఎన్నికల సంఘం చట్టంలో మార్పులు తీసుకువచ్చారు. ఈ మార్పు ప్రకారం ఎన్నికల సంఘంలో ఒకరే కాకుండా మొత్తం ముగ్గురు సభ్యులతో కూడిన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ముగ్గురిలో ఒకరు ప్రధాన ఎన్నికల అధికారిగా, మిగిలిన ఇరువురు సభ్యులుగా వుంటారు. ముగ్గురిలో ఒకరు ప్రధాన అధికారి అయినప్పటికీ ఇతర సభ్యులపై పెత్తనం చేయకూడదు. ఏ నిర్ణయమైనా ముగ్గురు కలసి తీసుకోవాలి. నిజానికి శేషన్ బాధ్యతలు స్వీకరించడానికి ముందే ముగ్గురు సభ్యులను నియమించాలని నిర్ణయించినప్పటికీ అది ఆచరణలోకి రాలేదు. ఈలోగా 1990లో శేషన్ ఎన్నికల అధికారిగా అధికారంలోనికి వచ్చాడు. 'నీతివంతు



లు సింహం వలే జీవింతురు' అనే సూక్తికి నిదర్శనం మాజీ ఎన్నికల కమీషనర్ టి.ఎన్.శేషన్ అని చెప్పవచ్చు. ఇప్పటి వరకు 31 ఎన్నికల సంఘాలు పనిచేయగా వీరిలో శేషన్‌కు ముందు లేదా తర్వాత పనిచేసిన ఏ ప్రధాన ఎన్నికల అధికారి శేషన్ మాదిరిగా పేరు తెచుకోలేకపోయారు. 1990 నుంచి 1996 డిసెంబరు వరకు భారత ప్రభుత్వ ఎన్నికల కమీషనర్‌గా పనిచేసిన శేషన్ తీసుకు వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, పనిచేసిన విధానం దేశం ఎప్పటికీ మర్చిపోలేదు. ఆయన పనిచేసినంతకాలం రాజకీయ పార్టీల నాయకుల గుండెల్లో దడ పుట్టించాడు. ఎన్నికల అధికారిగా శేషన్ తీసుకు వచ్చిన విప్లవాత్మక మార్పులు, కచ్చితంగా వ్యవహరించిన తీరుతో భీతిల్లిన రాజకీయవేత్తలు 1993లో అక్టోబర్ 1, నుంచి దాన్ని ముగ్గురు సభ్యులు ఉన్న కమిషన్‌గా మార్పుచేశారు. ఎన్నికల సంఘం సభ్యులను ఎంపిక చేయడానికి ప్రధాన మంత్రితోపాటు ప్రతిపక్ష నాయకుడు, ప్రధాన మంత్రి సూచించిన కేంద్రమంత్రి వర్గంలోని ఒక సభ్యునితో ఒక కమిటీ ఏర్పడాలని భారత రాష్ట్రపతి నిర్దేశించారు. దేశానికి ఒక్కరే ప్రధాని ఒక్కరే రాష్ట్రపతి ఒక్కరే ముఖ్యమంత్రి ఉన్నట్లుగా ఒక్కరే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఉండాలని ఆ సమయంలో కొంతమంది మేధావులు అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై సుప్రీమ్ కోర్టులో కేసుదాఖలైంది. ఎన్నికల సంఘం సభ్యుల ఎంపికపై నిర్దిష్టమైన చట్టం చేసే వరకు ప్రధాన మంత్రితోపాటు ప్రతిపక్ష నాయకుడు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల సంఘం సభ్యులను సూచించాలని సుప్రీం కోర్టు ప్రకటించింది. ఎన్నికల సంఘం సభ్యుల నియామకం విషయంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యునిగా వుండటం ఇష్టంలేని కేంద్రప్రభుత్వం పార్లమెంటు ఎన్నికల సంఘం సభ్యుల నియామక చట్టానికి సంబంధించిన సెక్షన్ 7ను సవరిస్తూ 2023లో చట్టం చేసింది. ఈ సవరణ చట్టం ప్రకారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రస్తావన లేకుండా ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడితోపాటుప్రధాన మంత్రి సూచించిన కేంద్రమంత్రి వర్గంలోని ఒక సభ్యునితో ఒక కమిటీ ఏర్పడాలని భారత రాష్ట్రపతి నిర్దేశించారు. సవరించిన చట్టం ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం ముగ్గురు సభ్యులను ఎంపికచేసే ముగ్గురు సభ్యుల కమిటీలో ఇరువురు (ప్రధానమంత్రి, ఆయన సూచించే మరో కేంద్రమంత్రి అధికార పార్టీకి చెందినవారే కావడం, ప్రతిపక్ష నాయకుడు ఒక్కరే సభ్యునిగా వుండటం వల్ల ఆయన మాటకు విలువ లేకుండా పోతోంది. ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయినప్పటికీ ఎన్నికల కమిషన్ నిర్వహణకు, కమిషన్ సభ్యుల వ్యక్తిగత అవసరాలకు అవసరమైన నిధులన్నీ ప్రభుత్వమే మంజూరు చేయాల్సి రావడం వల్ల వారు కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు. అందువల్ల ఎన్నికల సంఘానికి, సంఘం సభ్యులకు అవసరమైన నిధులు అధికారంలో వున్న ప్రభుత్వంపై ఆధారపడకుండా బడ్జెట్టులోనే ప్రత్యేకంగా కేటాయించే విధంగా చట్టంలో ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా ఎన్నికల కమిషన్ సభ్యులుగా పదవీ విరమణ చేసినఅనంతరం ప్రభుత్వ పరమైన పదవులు ఆశించడంవల్ల కూడా నిస్పాక్షికంగా వ్యవహరించ లేకపోతున్నారు. ఇదేసమయంలో పదవీ విరమణఅనంతరం ఎన్నికల కమిషన్ సభ్యులు ఎటువంటి ప్రభుత్వ పదవులు స్వీకరించడానికి అవకాశం లేకుండా చట్టాన్ని సవరించాలి. అంతేకాకుండా ఎలక్షన్ కమిషన్ సభ్యుల నియామక కమిటీలో ప్రతిపక్ష నాయకునితోపాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాల్సిన అవసరం వుంది. •

# మహిళా రక్షణ మాటల్లోనేనా?

ఎస్.సీతారామయ్య

అర్ధరాత్రి వేళ మహిళ వీధిలో ఒంటరిగా తిరగ్గలిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు అన్న మహాత్మా గాంధీ మాటకు ఇంకెప్పుడు సార్థకత? కొంతకాలంగా విద్యార్థినులపై జరుగుతున్న దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సామాజికంగా, శాంతి భద్రతలపరంగా మన వెనుకబాటుతనాన్ని, పాలకుల నిర్లక్ష్య ధోరణులను ఎత్తి చూపుతున్నాయి. విద్యా నైపుణ్యాలను అందించి, వికాసానికి తోడ్పడాల్సిన విద్యాలయ ప్రాంగణాలు కూడా అమ్మాయిల పట్ల అభద్రతా వలయాలుగా మారటం విచారకరం, జాతీయ నేర నివారణ విభాగం గణాంకాల ప్రకారం దేశంలో రోజుకు 86 అత్యాచారాలు నమోదవుతున్నాయి. ఇందులో 90 శాతం దారుణాలు తెలిసిన వ్యక్తుల ద్వారానే జరుగుతుండడం గమనార్హం. బాధితుల్లో 10 శాతం మంది 18 ఏళ్లలోపు వారు కాగా, 66శాతం మంది 18-30 ఏళ్ల లోపువారు ఉంటున్నారు. చదువుకున్న చోట, శిక్షణ పొందుతున్న చోట విద్యార్థినులకు రక్షణ లేకపోవటం అత్యంత విచారకరం. ఉపాధ్యాయ విద్యార్థిని పట్ల ఓ అధ్యాపకుడి వేధింపులకు పాల్పడితే కళాశాలకు వెళ్లిన విద్యార్థిని విగత జీవిగా తుప్పల్లో పడి ఉంటే మహిళలకు ఇంకేం భద్రత? తమ మాట వినకుంటే భవిష్యత్తుకు నష్టం కలిగిస్తామన్న బెదిరింపులతో కొంతమంది శిక్షకులు, అధ్యాపకులు,సిబ్బంది వికృత చేష్టలకు పాల్పడడం నిత్యకృత్యంగా మారుతోంది. ఎటుపోతున్నది మన సంప్రదాయం? మన ఆచార వ్యవహారాలతో వచ్చిన సంస్కారం, మన కట్టుబాట్లు ఏమైపోతున్నాయి? మన యువత, అసలు మనమంతా ఎటుపోతున్నాం? ఏది పరిష్కార మార్గం? మన దేశ సంపదగా భావించిన మన జీవన విధానాన్ని గురించి, మన విద్యా వ్యవస్థలతో పాటు మన ప్రభుత్వాల నిర్వాకం గురించి మాట్లాడాల్సిన అవసరం ఆసన్నమయింది. క్షణం ఆలస్యం చేస్తే ప్రతిక్షణం ఇక బాధపడక తప్పదు. స్కూళ్ళల్లో,కాలేజీలల్లో, పని ప్రాంతాల్లో మహిళలపై ఈమధ్య జరుగుతున్న దాష్టీకాలు లెక్కకు మిక్కిలి అవుతున్నాయి. నిజానికి విద్యాలయాలల్లో ఇంతకు మునుపు సేఫ్ అనుకున్న ప్రదేశాలల్లో ఇలాంటి ఘోరాలు జరుగుతుండటంతో సభ్య సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈసంవత్సరం జులై 14న, బాలాసోర్ లోని ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీలో బి.ఈడీ చదివే 20 సంవత్సరాల విద్యార్థిని సెల్ఫ్ ఇమ్మొలేషన్‌కు పాల్పడి 80శాతం కాలిన గాయాలతో మరణించింది. ఆమెకు జరిగిన అవమానం హృదయ విదారకం. ఆ కాలేజీలో ఒక సీనియర్ అధ్యాపకుడు తనను లైంగికంగా అనేక సార్లు వేధించటానికి పాల్పడటం, ఆ విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి అనేకసార్లు తీసుకోచ్చినా ఫలితం లేకపోవటంతో ప్రిన్సిపాల్ ఆఫీసు ముందే ఆమె బలవన్మరణానికి పాల్పడింది. ఆ తర్వాత వేధింపులకు పాల్పడిన వారిని అరెస్టు చేశారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవటంఅంటే ఇదే! ఆ చర్యే ఆ అమ్మాయి చనిపోకమునుపు, ఫిర్యాదు చేసిన వెంటనే తీసుకున్నట్లయితే ఒక విలువైన ప్రాణం దక్కేది. కోల్‌కతా లా కాలేజీ విద్యార్థినిపై సహ విద్యార్థుల అత్యాచారం, ఐఐఎం విద్యార్థినిపై కళాశాల హాస్టల్లోనే అఘాయిత్యం జరిగాయి. బెంగాల్లో అధికార పార్టీకి చెందిన విద్యార్థి సంఘం నాయకులు ఈ దుర్మార్గం వెనుక ఉన్నారని వార్తలు వచ్చాయి.గతేడాది కోల్‌కతాలోని ఆర్జికర్ హాస్పిటల్లో జూనియర్ డాక్టర్ అత్యాచారానికి, హత్యకు గురి కావడం దేశవ్యాప్త ఆందోళనలకు దారి తీసింది. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన ఇంటర్ విద్యార్థిని కళాశాలకు వెళ్లి, గండికోటలో అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా కనిపించింది. ఏం జరిగిందో పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితం ఒక వైద్య కళాశాలలో పారా మెడికల్ విద్యార్థినులు తమను ల్యాబ్ అసిస్టెంటు, మరో ముగ్గురు సిబ్బంది లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్టు ఫిర్యాదు చేశారు. ఏలూరులోని స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా కేంద్రంలో క్రీడాకారిణుల పట్ల కోచ్ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు గతనెలలో వచ్చినవార్తలు సంచలనం కలిగించాయి. అధ్యాపకులు విద్యార్థినులను మానసికంగా, శారీరకంగా అవమానిస్తున్న తీరు బాధాకరం. చదువు చెప్పటంఅటుంచి, ఇలాంటి అమానుషాలకు తలపడే పంతుళ్లు ఇంకేం విద్యాబుద్ధులు నేర్పుతారు? అసలు ఎందుకు విద్యా సంస్థలలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి? ఇలాంటి వాటిపై కొద్దిపాటి సమాచారం తమ దృష్టికి వచ్చినా యాజమాన్యాలూ, అధికారులూ తక్షణ చర్యలు తీసుకోవాలి. ఏ పేరుతో ఆలస్యంచేసినా అది దుర్మార్గుల దుశ్చేష్టలకు ఊతమిచ్చినట్టే అవుతుంది. అలాగే, నేర నిరూపణ చేయటంలోనూ పోలీసు యంత్రాంగం తరచూ విఫలమవుతుంది.సంచలనం కలిగించిన అయేషామీరా, రిపితేశ్వరి ఉదంతాలు రెంటిలోనూ నిందితులకు ఇప్పటికీ శిక్ష పడలేదు. దర్యాప్తులో చోటు చేసుకునే వైఫల్యాలు కూడా నేర ప్రవర్తకులకు పరోక్ష ధైర్యాన్నిస్తాయి. దీనికితోడు సినిమాల్లో, వెబ్‌సిరీస్లో, సోషల్ మీడియాలో అడ్డూ అదుపూలేని విషసంస్కృతి ప్రవహిస్తోంది. దీనిని నియంత్రించడంతో పాటు పనిప్రాంతాల్లో, విద్యా వైద్యకేంద్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి. స్త్రీ పురుష సమానత్వ భావనను ఇంటా బయటా పెంపొందించాలి. అప్పుడే ఆడపిల్లలపై అకృత్యాలకు అడ్డుకట్ట పడుతుంది. •

# ట్రంప్ టారిఫ్ తుఫాన్‌తో మత్స్య రైతులు విలవిల

అప్పన్న గొనప

డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని అమెరికా ప్రభుత్వం భారత సముద్ర ఆహార ఎగుమతులపై విధించిన 50 శాతం అధిక సుంకం నిర్ణయం, భారత్‌అమెరికా వాణిజ్య సంబంధాల్లో ఇప్పటివరకు సంభవించిన అత్యంత తీవ్రమైన పరిణామంగా నిలిచింది. ఈ చర్యతో భారతదేశం నుంచి అమెరికాకు జరిగే సముద్ర ఆహార ఎగుమతులపై తీవ్రమైన ఆర్థిక భారంపడనుంది. సుమారుగా 60,000 కోట్ల రూపాయల విలువైన భారత సముద్ర ఆహార ఎగుమతుల్లో దాదాపు 40 శాతం అమెరికా మార్కెట్‌కి చెందుతున్నదిగా పరిశ్రమ వర్గాల అంచనా.తాజా సుంకాల ప్రభావంతో రూ. 24,000 కోట్ల మేర నష్టంవాటిల్లే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ప్రభావం కేవలం దిగుమతిదారులకే పరిమితం కాకుండా, భారతదేశంలోని లక్షలాది మంది మత్స్యకారులు, రైతులు, ప్రాసెసింగ్ కార్మికులు, రవాణాదారులు, ష్రింక్ రైతుల జీవనాధారాలపై నేరుగా ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారతదేశం ప్రపంచంలో సముద్ర ఆహార ఎగుమతుల ప్రధాన కేంద్రంగా ఉన్నప్పటికీ, అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్య సమతుల్యతకు విఘాతం కలిగించేదిగా మారింది. భారత్‌కు పోటీగా ఉన్న ఎక్వెడార్‌కు 10శాతం, ఇండోనేషియాకు 19శాతం, వియత్నాం దేశానికి 20 శాతం మాత్రమే దిగుమతి సుంకాలు ఉండగా, భారతదేశంపై 50శాతం సుంకం విధించడం భారత ఉత్పత్తులను అమెరికన్ మార్కెట్ నుంచి తప్పించి వేసే విధంగా ఉంది. ఇది మన రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరలు పొందలేని పరిస్థితిని కలిగిస్తుంది. పెట్టుబడులకు భద్రత లేకపోవడం వల్ల రైతుల ఉత్సాహం క్షీణిస్తోంది. వ్యవసాయ రంగంపై పెట్టుబడి పెట్టాలన్న సంకల్పాన్ని కూడా ఇది ప్రభావితం చేస్తోంది. ప్రస్తుత తరుణంలో రైతుల్లో తీవ్రమైన సందిగ్ధత నెలకొంది. మార్కెట్‌పై స్పష్టత లేకపోవడం, తక్కువ ధరల భయం, పెట్టుబడి తిరిగి వచ్చే నమ్మకం లేకపోవడం వలన కొందరు రైతులు సాగును పూర్తిగా నిలిపివేశారు. ఇది కేవలం వ్యక్తిగత ఆదాయ నష్టమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకూ ఆర్థిక సంక్షోభాన్ని తలపెట్టే ప్రమాదం. భారత ప్రభుత్వం ఈచర్యను తీవ్రంగా ఖండించింది. ఇది కేవలం వాణిజ్య చర్య మాత్రమే కాకుండా, దేశ వ్యవసాయ స్వావలంబనకు నేరుగా దెబ్బ తీసే చర్యగా భావించింది. ప్రధాని చేసిన వ్యాఖ్యలు 'రైతుల సంక్షేమం కోసం ఏదైనా త్యాగానికి సిద్ధంగా ఉన్నాను' అన్నవి రైతులకు ధైర్యాన్ని ఇచ్చేలా ఉన్నాయి. వ్యవసాయ రంగం, మత్స్యకారుల హక్కులు, గ్రామీణ జీవన విధానం ఇవన్నింటిపై ప్రభుత్వం అమరంగా నిలవబోతున్నదన్న సంకేతం ఇచ్చింది. అమెరికాతో వాణిజ్య చర్చలు విఫలమైన నేపథ్యంలో, భారత్ తన ప్రాథమిక నిబంధనలను తాము రాజీపడబోమన్న స్పష్టతతో ముందుకు సాగుతోంది. దేశ



ప్రయోజనాల పరిరక్షణకు ఇది తప్పనిసరి. ఈ పరిణామాలు భారత్ విదేశీ మార్కెట్లపై అధికంగా ఆధారపడే విధానాన్ని పునఃపరిశీలించే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే కొత్త మార్కెట్లను అన్వేషించే దిశగా అడుగులు వేసింది. యూరోప్, జపాన్, కొరియా, రష్యా వంటి దేశాల్లో భారత సముద్ర ఆహార ఉత్పత్తులకు అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఆయా దేశాల నిబంధనలకు అనుగుణంగా ప్రాసెసింగ్, క్వాలిటీ, ట్రేసబిలిటీ వంటి అంశాల్లో మెరుగుదల చేయాల్సిన అవసరం ఉంది. దేశీయంగా కూడా వినియోగాన్ని పెంపొందించేందుకు ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలన్న దిశగా ప్రభుత్వ ఆలోచనలు సాగుతున్నాయి. ఈ రంగంలో ముఖ్యంగా చిన్న రైతులు, మహిళా కార్మికులు పెద్ద ఎత్తున ఆధారపడుతున్నారు. ఈ ఆదాయ ప్రవాహం ఆగిపోవడం గ్రామీణ జీవనరీతిని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టే ప్రమాదాన్ని కలిగిస్తోంది. పరిశ్రమల్లో సగటున 15 శాతం నిల్వగా ఉన్న ఉత్పత్తులు తక్కువ ధరలకు అమ్మకానికి దారి తీయడం, ప్రాసెసింగ్ యూనిట్ల మూతలు పడే ప్రమాదం, ఈ వ్యవస్థలో పనిచేస్తున్నవేలాది మందికి ఉద్యోగ నష్టం కలిగే ప్రమాదం కూడా గమనించదగినది. ప్రస్తుతం ఈ సమస్యకు తక్షణ పరిష్కారం అవసరం. ప్రభుత్వం ఇప్పటికే కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ, రుణ మాఫీలు, ఉత్పత్తి సబ్సిడీలు, స్థిరమైన మార్కెట్ లింకేజీలు, ఎగుమతులకు ప్రమాణపత్రాలు, సాంకేతిక మద్దతు వంటి అంశాల్లో మరింత ప్రభావవంతమైన చర్యలు అవసరం. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సమన్వయంతో వ్యవహరించి రైతులకు ప్రత్యక్ష సహాయాన్ని అందించాల్సిన బాధ్యతను మరిచిపోవద్దు. ఈ సంక్షోభం మానవీయ ప్రభావంతో పాటు వ్యవసాయ విధానాలలో ఉన్న లోపాలను బయటపెడుతోంది. పరిమిత మార్కెట్లపై ఆధారపడటం ఎంత ప్రమాదకరమో ఇది బలంగా చాటింది. వ్యవసాయ రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేయాలంటే మార్కెట్ విస్తరణ, నిల్వ సదుపాయాల పెంపు, విలువ ఆధారిత ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి వ్యూహాలు వెంటనే అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు తాత్కాలికంగా కనిపించినా, దీర్ఘకాలికంగా పరిశ్రమపై తీవ్ర ప్రభావాన్ని చూపవచ్చు. మత్స్య పరిశ్రమ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన భాగంగా ఉంది. ఈ రంగానికి తగిన ప్రోత్సాహం లభించకపోతే గ్రామీణ ఆదాయ భద్రత ప్రమాదంలో పడుతుంది. ప్రభుత్వం, పరిశ్రమలు, రైతులు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగినప్పుడే ఈ సంక్షోభానికి స్థిర పరిష్కారం దొరుకుతుంది. ఈ సమస్యను అవకాశంగా మలచుకోవడం మన చేతుల్లోనే ఉంది. ధైర్యవంతమైన నిర్ణయాలు, వ్యూహాత్మక ఆలోచనలు, సమర్థవంతమైన కార్యాచరణ ద్వారా రైతుల జీవనోపాధిని కాపాడుకోవడమే కాకుండా, దేశ ఆర్థిక భద్రతను నిలబెట్టుకోవచ్చు. ఇప్పుడు తీసుకునే చర్యలు, రైతుల పట్ల మన గౌరవాన్ని సూచించేవే కావాలి. మన భవిష్యత్తు వ్యవసాయ రంగాన్ని పునర్నిర్మించేందుకు ఇదే సరైన సమయం. •

# ప్రజావాక్కు



## కఠిన శిక్షలు వేగవంతం చేయాలి

**ఈమధ్య** ఇళ్ళల్లోకి దొంగలు యధేచ్ఛగా ప్రవేశించి ఇంట్లోని వారిని హింసించి బీరువాలను పగలగొట్టి దొరికినంత దోచుకుని పారిపోతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి గుడికి వెళ్ళినా ఏదైనా ఊరికి వెళ్ళినా రెక్కీలు నిర్వహించి చటుక్కున వచ్చి ఏదోవిధంగా వారొచ్చిన పనిని నిర్విఘ్నంగా చేసుకుపోతున్నారు. ఆడవారి మెడలో చైన్ స్నాచింగ్‌లు నిత్యకృత్యం అయిపోతున్నాయి.బ్యాంకు ఎ.టి.ఎమ్. మిషన్లను చాకచక్యంగా ఓపెన్ చేసి అందులోని కాష్ మొత్తాన్ని దోచుకువెడుతున్నారు.నిన్నగాక మొన్న హైద్రాబాద్ చాందానగర్‌లోనున్న ఖజానా నగల దుకాణంలో పట్టపగలు పిస్టళ్లతో మొహాలకు గుడ్డలు కట్టుకుని నగలను దోచుకెళ్లారు.సిసికెమెరాల్లో కనిపించిన వారి ఆచూకి ఇంతవరకు తెలియరాలేదు. ఇందుకు కారణాలు ఈజీగా డబ్బు సంపాదించవచ్చనే దురాలోచన. చట్టాలను కొత్తగా మారిస్తే సరిపోదు. కఠిన శిక్షలు వేగవంతం చేయాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ప్రాజెక్టులు నిర్మించాలి

**తెలంగాణ** సాధారణ వర్షాపాతం ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు ఎక్సెస్ రైన్ ఫాల్ వచ్చి ఉంటుంది అలా వచ్చిన నీటిని ఎంత వరకు స్టోర్ చేస్తున్నాం అనే దాని మీద తెలంగాణ భవిత ఆధారపడి ఉంటుంది అని గుర్తు పెట్టుకోవాలి. ఎందుకంటే తెలంగాణకు సముద్ర మార్గం కానీ అంతర్జాతీయ నీటి ప్రవాహం మార్గం కానీ లేదు. భూమిలోపలికి నీటినిఇంకేటట్టు చేయడం,చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలి. తెలంగాణ ఉద్యమంలో నీళ్ల అనేదిఒక మేజర్ ఆబ్జెక్టీవ్‌గా ఉన్నప్పుడు గత ప్రభుత్వం కోట్ల రూపాయలతో చెక్ డ్యామ్‌లు నిర్మించినప్పుడు ఈ ప్రభుత్వం ఎందుకు ఆ పని చేయకూడదు.

- భారత అవినాష్, జనగామ

## మద్యం కేంద్రాలను నిషేధించాలి

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్ని నగరాలలో జనవాడల మధ్య ఉంటున్నాయి.మద్యసేవకులు మోతాదు ఎక్కువై అక్కడ ఇతరులతో ఘర్షణలు శృతి మించి కొట్టుకుంటూ ఆ దృశ్యం భయం కలుగుతున్నది. కొత్త షాప్‌లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

- కె.రామారావు, విశాఖపట్నం

## పరిష్కారం చూపాలి

**ఇటీవల** జాతీయ స్థాయిలోనడుస్తున్న కేంద్ర ఉద్యోగుల ఆరోగ్య పథకం మొత్తం ఆన్లైన్ సదుపాయాన్ని వేరే కొత్త సి డాక్ అనే సాఫ్ట్వేర్‌కి మార్చారు. మార్పు ఏదైనా మెరుగైన సదుపాయం, సులువు ఉంటే లబ్ధిదార్ల సేవలకు ఇబ్బంది ఉండదు. ఇది ఉచిత పథకం కాదు. ఒక వ్యక్తి సుమారు 35000 చొప్పున కట్టిన తర్వాత గుర్తింపు కార్డులు జారీచేశారు. సుమారు ఐదు సంవత్సరాలు సేవలు జరిగిన పథకంలో ఇప్పుడు కొత్త విధానంవారి అర్హత,వాలిడిటీలు తప్పుగా చూపిస్తూ తప్పుడు సమాచారంతో లబ్ధిదారులకు వైద్యం కోసం సేవలు నిరాకరించడం జరిగింది. స్థానిక కేంద్ర అధికార్లు సదరు ఫిర్యాదుని ముఖ్యంగా భావించి , డేటా మార్పిడి కోసం వారి పరిశీలనతో త్వరగా ఎగువ స్థాయి కేంద్రానికి నివేదికతో పాటు ,ఆన్లైన్ వ్యవస్థను వాడుకోవాలి. ఇది చాలా మందికి ఇదే సమస్య వచ్చిందనడం, తాము సరిచేయలేమని చెప్పడం కన్నా పరిష్కారం చూపాలి.

- బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

## ఉచిత బస్సు అందరికి ఇవ్వకూడదు

ఆడ, మగ సమానం అని చెప్పడానికి ఎంత ప్రయత్నిస్తున్నప్పటికీ ఒకటిమాత్రం కాదు.ఆడవారి దుస్తులు వేరు మగ వారు దుస్తులువేరు. ఆడవారి అవసరాలు వేరు మగవారి అవసరాలు వేరు.ఆడవారు చేయగలిగిన పనులకు మగవారు చేయగలిగిన పనులకు వ్యత్యాసం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ప్రియాతి ప్రియమైన శిష్యుడైనటువంటి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన స్త్రీలకు ఉచిత బస్సు పథకం ఆర్థిక కష్టాలకు కారణమై అభాసుపాలయ్యింది. హైదరాబాదులో ఆటో డ్రైవర్ల ఆగ్రహానికి హేతువయ్యింది. ఉచిత బస్సు ప్రయాణం ఆర్థికంగా వెనకబడిన వారికి అనుమతించాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## రైళ్ల హాల్ట్ పునరుద్ధరణ మాట గాలికేనా?

**వ్యాపార,** వ్యవసాయ విద్యారంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిన పశ్చిమ గోదావరి జిల్లాఅత్తిలిలో టిక్కెట్లు విక్రయాలు తక్కువగా ఉన్నాయన్న సాకుతో 2021 సంవత్సరం కరోనా సమయంలో అత్తిలి రైల్వే స్టేషన్లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ రద్దు చేశారు. కరోనా భయం పూర్తిగా తొలగి ప్రయాణికుల సంఖ్య పెరిగినా, హాల్ట్‌ల పునరుద్ధరణ విషయం మాత్రం గాలికి వదిలివేసినట్లుగా కనిపిస్తుంది.

-డి. వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం ప.గోజిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఓట్ల చోరీకి మరోసారి బిజెపి కుట్ర

బీహార్ ఓట్ అధికార యాత్రలో రాహుల్ గాంధీ



**పాట్నా, ఆగస్ట్ 17:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం కొత్త కుట్ర జరుగుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆదివారం బీహార్‌లోని సాసారాం లో ఓట్‌అధికార్ యాత్రను ఆయన ప్రారంభిం చారు. అంతకు ముందు రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సంఘంపై ఆయన తీవ్ర ఆరోపణలు సంధించారు. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ద్వారా ఓట్లను తొలగించడం, జోడించడం ద్వారా ఎన్నికల్లో ఓట్లను దొంగిలించడానికి కొత్త కుట్ర జరుగు తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించేం దుకే తాను ఈ యాత్ర చేపట్టినట్లు ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఇలాగే ఓట్లు చోరీకి గురయ్యాయని ఆందోళన చెందారు. బీహార్‌లో ఎస్ఐఆర్ ద్వారా ఓట్ల దొంగిలించేం దుకు కుట్ర జరుగుతుందని మండిపడ్డారు. దీని ద్వారా దేశ ప్రజలకు ఎన్నికల సంఘం ఎలా ఓట్లను చోరీ చేస్తుందో అర్థమవుతుందని చెప్పారు. అయితే ఓటుచోరీపై తాను ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన తర్వాత అఫిడవిట్ సమర్పించాలని తనను ఎన్నికల సంఘం కోరిందన్నారు. కానీ బీజేపీ నేతలు చేసిన ఆరోపణలపై మాత్రం ఎన్నికల సంఘం స్పందించ లేదన్నారు. బీహార్‌లో ఓట్ల చోరీని తాము అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. పేదవారికి ఓటు ఒకటే అధి కారమని తెలిపారు. వారి ఓటును లాక్కొనే అధికారం ఎవరికి లేదన్నారు. ఇక ప్రతి ఎన్నికల్లో బిజెపినే ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. మహారాష్ట్రతోపాటు పలు ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధిస్తుందని పలు ఒపినియన్ పోల్స్ స్పష్టం చేశాయని గుర్తు చేశారు. 2024, సార్వత్రిక ఎన్నికల్లోనే కాదు.. అంతకు ముందు జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఇండియా కూటమిదే అధికారమని తేల్చి చెప్పాయని పేర్కొన్నారు. కానీ ఆ ఎన్నికలన్నింటిలో బిజెపి భాగస్వామ్య పక్షాలే గెలిచాయని వివరించారు. దాదాపు కోటి ఓట్లను కొత్తగా ఓటర్ల జాబితాలో చేర్చడం ద్వారా ఈ గెలుపు సాధ్యమైందని ఎంపీ రాహుల్ గాంధీ వివరించారు. అయితే బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఆందోళన చేస్తాయని తెలిపారు. మరికొన్ని నెలల్లో జరగనున్న బిహార్ అసెంబ్లీఎన్నికలు జరగనున్నాయని పేర్కొన్నారు. వాటి లక్ష్యంగా ఓటు హక్కు తొలగించేందుకు ఎన్నికల సంఘం తన వంతు ప్రయత్నం చేస్తుం దని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ అధికార్ యాత్ర ప్రారంభ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాష్ట్రీయ జనతాదళ్ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, ఆ పార్టీ నేత తేజస్వీ యాదవ్‌తోపాటు ఇండియా కూట మికి చెందిన నేతలు పలువురు పాల్గొన్నారు. ఆగస్ట్ 17వ తేదీన సాసారాంలో ప్రారంభమైన ఈ యాత్ర సెప్టెంబర్ 1వ తేదీతో పట్నాలో ముగియనుంది.



## భారత్ గడ్డపైకి అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

### ఢిల్లీ సీఎం, కేంద్ర మంత్రులు ఘనస్వాగతం

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** యాక్సియం-4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యోమగామి శుభాంశు శుక్లా భారత్‌కు చేరుకున్నారు. అంతరిక్ష యాత్ర విజయవంతమయ్యాక అమెరికాలో ఉన్న ఆయన, ఆదివారం తెల్లవారుజామున స్వదేశానికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు భార్య కామ్నా శుక్లా, కుమారుడు సమక్షంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా శుభాంశుకు ఘన స్వాగతం పలికారు. శుక్లాశుభాంశు స్వదేశానికి చేరుకోవడం భారత్‌కు గర్వకారణమైన క్షణంగా కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అభివర్ణించారు. భారతదేశానికి గర్వకారణమైన క్షణం అని ఇస్రోకు కీర్తినిచ్చే క్షణం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఇందుకు దోహదపడిన వ్యవస్థకు కృతజ్ఞత తెలుపుతూ, దేశ అంతరిక్ష పరిశోధనలు భారత్‌సైతం చేయగలిగిందన్నారు. భారతమాత దిగ్గజ పుత్రుడు శుభాంశు శుక్లా ఈరోజు తెల్లవారు జామున ఢిల్లీలో అడుగుపెట్టారు. ఆయనతో పాటు మిషన్ గగన్‌యాన్‌కు ఎంపికైన వ్యోమగాముల్లో ఒకరైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా ఉన్నారని మంత్రి తెలిపారు. యాక్సియం4 మిషన్ విజయవంతం తర్వాత తొలిసారి భారత్‌కు వస్తున్నానంటూ శుక్లా శనివారం పోస్టు ద్వారా తెలిపారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు విమానంలో కూర్చున్నప్పుడు భావోద్వేగానికి గురైనట్లు చెప్పారు. మిషన్ కోసం గతేడాది నుంచి తన స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇది తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు. వారిని కలిసి తన అనుభవాలను పంచుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని అన్నారు. అయితే భారత్‌కు వచ్చిన శుక్లా, సోమవారం మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈనెల 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో కూడా శుక్లా పాల్గొం టారని వెల్లడించాయి. ఇటీవల నిర్వహించిన యాక్సియం4 మిషన్ ప్రయోగం విజయవం తమైంది. రోదసిలో 18 రోజులు గడిపి మాన వాళికి ప్రయోజనం కలిగించే పలు ప్రయో గాలను నిర్వహించిన శుభాంశు శుక్లా బృందం జులై 15న భూమికి తిరిగి వచ్చింది. ఆ వెంటనే వ్యోమగాములను క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ (పోలండ్), టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

## కతువా జిల్లాలో భారీ వరదలకు నలుగురి మృతి

**శ్రీనగర్, ఆగస్టు 17:** జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గత రాత్రి కురిసిన భారీ వర్షాలు నలుగురి ప్రాణాలను బలితీసుకున్నాయి. మరికొందరు గాయపడ్డారు. వరద ప్రవాహం కారణంగా ఒక గ్రామానికి బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా జిల్లాలో తీవ్ర నష్టం వాటిల్లింది. రైల్వే ట్రాక్‌తో పాటు జాతీయ రహదారి కూడా దెబ్బతిన్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌పైనా వరద ప్రభావం పడిందని ఆయన 'ఎక్స్'లో వెల్లడిం చారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తు న్నామని, పౌర, సైనిక, పారామిలిటరీ బలగాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ దుర్ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో కతువా జిల్లా యంత్రాంగం ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. నదులు, వాగులు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలకు దూ రంగా ఉండాలని సూచించింది. ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉన్నందున అత్యంత అప్రమ త్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## హిమాలయ రాష్ట్రాల్లో క్లౌడ్‌బరస్ట్‌లతో అతలాకుతలం



**శ్రీనగర్, ఆగస్టు 17:** జమ్మూకాశ్మీర్‌లో గత కొన్ని రోజుల నుంచి క్లౌడ్ బరస్ట్‌లు వరుస విషాదాలకు దారి తీస్తున్నాయి. గత గురువారం కిస్త్వార్‌లోని చషోటి గ్రామంలో క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. దీంతో 60 మంది చనిపోయారు. శనివారం కథువా జిల్లాలో క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. ఇలా జమ్మూకాశ్మీర్‌లో విలయం సృష్టిస్తున్న క్లౌడ్ బరస్ట్‌తో అపారనష్టం జరిగింది. అతి తక్కువ సమయంలో,అతి తక్కువ భౌగోళిక ప్రాంతంలో, అతి ఎక్కువ వర్షపాతం పడటాన్ని క్లౌడ్ బరస్ట్‌అని అంటారు. 20 నుంచి 30 చదరపు కిలోమీటర్ల పరిధిలో గంటలకు 10 సెంటీ మీటర్ల వర్షపాతం పడితే దాన్ని క్లౌడ్ బరస్ట్ అంటారు. ఒక్కోసారి ఉరుములు, పిడుగులతో భారీ స్థాయిలో కురిసే వర్షాల కారణంగా వర దలు సైతం వస్తుంటాయి. స్వల్ప పరిధిలో రెండు గంటల వ్యవధిలో 5 సెంటీమీటర్లు లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం పడితే మినీ క్లౌడ్ బరస్ట్ అంటారు. అయితే, తక్కువ సమయంలో కురిసే అన్ని భారీ వర్షాలను క్లౌడ్ బరస్ట్‌లు అనలేము. కొన్ని వాతావరణ పరిస్థితులు ఉంటేనే క్లౌడ్ బరస్ట్ అంటాము. రుతు పవనాలు దేశంలోకి ప్రవేశం చినపుడు అరేబియా సముద్రంలోనుంచి తేమతో కూడిన గాలులు వీస్తాయి. ఇవి అధిక తేమ కలిగిన మేఘాలుగా మారతాయి. వాతావరణం లో వేడి వల్ల ఈ మేఘాలు కరుగుతూ ఉం టాయి. అలా కరిగి, కరిగి మేఘాలు బరువెక్కుతాయి. ఏదో ఒక చోట పేలిపోతాయి. అలా తక్కువ ప్రాంతంలో, తక్కువ సమయంలో భారీ వర్షం పడి వినాశనం జరుగుతుంది. 1970లో ఉత్తరాఖండ్‌లోని అలకనందా లోయలో క్లౌడ్ బరస్ట్ కారణంగా భారీ విధ్వంసం జరిగింది. అలకనందా నదికి వరద నీరు పోటెత్తటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. 1993లో ఉత్తరాఖండ్‌లోని పితోరాఘర్ జిల్లా, మల్ప గ్రామంలో క్లౌడ్ బరస్ట్ కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో కైలాష్ మానస సరోవర్ యాత్రకు వెళుతున్న భక్తులు చాలా మంది చనిపోయారు. 2003 నుంచి 2004 మధ్య కాలంలో ఉత్తరాఖండ్‌లోని కులు, చమలీ ఏరియాలో మినీ క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. దీంతో కొండ ప్రాంతంలో ఆస్తి నష్టం సంభవించింది. 2010లో లడఖ్‌లోని లేహ్‌లో క్లౌడ్ బరస్ట్ కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. దాదాపు 200 మంది చనిపోయారు. వందల మంది గాయపడ్డారు. 2022 జమ్మూకాశ్మీర్‌లో అమర్‌నాథ్ గుహ దగ్గర క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు చనిపోయారు.

## తెరుచుకున్న శబరిమలై: ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రధానాచార్యులు



**పతనంతిట్ట, ఆగస్టు 17:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్పస్వామి ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. వార్షిక చింగం మాస పూజల కోసం శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయ పూజారులు తలుపులు తెరిచారు. ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి తంత్రి కందరరు మహేష్ మోహనరు సమక్షంలో ఆలయ దీపాలను, ఆళి (పవిత్ర అగ్నిగుండం)ను వెలిగించారు. వేలాది మంది అయ్యప్ప భక్తులు భారీ వర్షాన్ని లెక్కచేయకుండా వేడుకను తిలకించారు. చింగం మాస పూజలను పూర్తి అయ్యే వరకు పడిపూజ కార్యక్రమం ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటలకు జరుగుతుంది. అదే సమయంలో సెప్టెంబర్ 20న పంబా నది ఒడ్డున గ్లోబల్ అయ్యప్ప సమావేశం జరుగుతుందని దేవాదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ ప్రకటించారు. ఇంత పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి కాబట్టి, ఒక చారిత్రాత్మక కార్యక్రమంగా నిలవనుందని తెలిపారు. వివిధ దేశాల నుంచి 3,000 మంది ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నట్లు తెలిపారు. రూ.1,300 కోట్ల విలువైన మాస్టర్ ప్లాన్ సిద్ధంచేసామన్నారు. శబరిమల ప్రపంచ ఖ్యాతిని పెంచే లక్ష్యంతో జరిగే ఆ సమావేశంలో కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొంటారు. శబరిమల సంప్రదాయాలను కాపాడుతూ, భక్తుల ప్రయోజనాలను గౌరవిస్తూ, శబరిమలని ప్రపంచ తీర్థయాత్ర కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి వాసవన్ పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.1,300 కోట్ల విలువైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించిందని తెలిపారు. అందులో శబరిమల విమానాశ్రయం, కొత్త రైల్వే లైన్ సహా వివిధ ప్రణాళికలు ఉన్నాయి. విమానాశ్రయం 2028 నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో పథనంతిట్టలో ప్రధాన నిర్వాహక కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. పంబా, పెరునాడ్, సీతాథోడ్‌లలో అదనపు కార్యాలయాలు ఉంటాయి. ప్రతినిధులకు బస్సుల ద్వారా రవాణా, వసతి ఏర్పాట్లు చేయనున్నారు. పంబాతో సహా ఆ ప్రాంతంలోని ఆసుపత్రులలో ఆధునిక వైద్య సౌకర్యాలు కల్పించనున్నారు. వాహనాల పార్కింగ్ కొండపై ఉండనుంది. స్వచ్ఛంద సంస్థలు పారిశుద్ధ్యం, శుభ్రపరిచే విషయంలో సహాయం చేస్తాయి.

## బిగ్‌బాస్ విజేత ఎల్విస్ యాదవ్ ఇంటివద్ద కాల్పులు



**గురుగ్రామ్, ఆగస్టు 17:** ప్రముఖ యూట్యూబర్, బిగ్ బాస్ ఓటీటీ 2 విజేత ఎల్విష్ యాదవ్ నివాసం వద్ద కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న ఆయన ఇంటిపై ఈ తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఉదయం 5 నుంచి 6 గంటల మధ్య బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు ఎల్విష్ యాదవ్ ఇంటిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. దాదాపు 25 నుంచి 30 రౌండ్ల వరకు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని వారు తెలి పారు. కాల్పులు జరిగిన సమయంలో ఎల్విష్ యాదవ్ (27) పని నిమిత్తం హర్యానా బయట ఉన్నట్లు తెలిసింది. అయితే, ఆయన కుటుంబ సభ్యులు, ఇంటి కేర్‌టేకర్ మాత్రం ఇంట్లోనే ఉన్నారు. ఈ భవనంలోని రెండు, మూడు అంత స్తుల్లో ఎల్విష్ కుటుంబం నివాసం ఉంటోంది. ఘ టన గురించి సమాచారం అం దుకున్న వెంటనే గురుగ్రామ్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. సెక్టార్56 పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలం నుంచి ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించింది. దుండగులను గుర్తించేందుకు సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాగా, ఈ ఘటనపై ఎల్విష్ యాదవ్ కుటుంబ సభ్యులు ఇంకాఅధికారికంగా పోలీసులకు ఫిర్యాదు చేయ లేదని తెలిసింది. దుండగులు ఎందుకు కాల్పులకు తెగబడ్డారనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.



## పాకిస్థాన్‌లో పట్టాలు తప్పిన ప్యాసింజర్‌రైలు

**కరాచి, ఆగస్టు 17:** పొరుగుదేశంలో ప్యాసిం జర్‌రైలు పట్టాలు తప్పింది. ఆదివారం పెషావ్ నుంచి కరాచీకి వచ్చే ప్యాసింజర్‌రైలులోని నాలుగు బోగీలు ఆకస్మికంగా పట్టాలు తప్పా యి. లోద్రాన్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రయాణీకులతో బయలుదేరిన ప్యాసింజర్‌రైలు ఆకస్మికంగా పట్టాలు తప్పింది. ఈరైలు కరాచీకి చేరుకునేలోపే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్నవెంటనే రైల్వే అధికారులు సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. పట్టాలు తప్పిన బోగీల్లో ఉన్న ప్రయాణీకులను బయటకు తీసారు. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించారు. లోద్రాన్ డిప్యూటి కమయిషనర్ డాక్టర్ లుబ్నా నజీర్‌ప్ర కారం మరో ఇద్దరు వ్యక్తులపరిస్థితి విషమంగా ఉంది. వీరంతా ఆసుపత్రిలో చికిత్స పొం దుతున్నారు. ప్రమాదానికి గల కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. ప్రమాదం తర్వాత ఈమార్గం లో కొన్ని గంటలపాటు రాకపోకలు నిలిపి వేసారు. ట్రాక్ పునరుద్ధరించి తర్వాతనే రైళ్ల రాకపోకలు ప్రారంభం అయ్యాయి.



## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు దక్షిణ కొరియా మద్దతు

### జైశంకర్ ధన్యవాదాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** పహల్గామ్ ఉగ్రదాడి, ఉగ్రవాదంపై పోరాటంలో దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో హ్యున్ భారత్‌కు సంఘీభావం ప్రకటించారు. భారత ప్రభుత్వం, ప్రజలతో తమ దేశం నిలుస్తుందని పేర్కొన్నారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చో హ్యున్ దక్షిణ కొరియా ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ విషయంలో తాము చాలా కఠినంగా, దృఢంగా ఉన్నామన్నారు. ఏదైనా ఉగ్రవాద దాడిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. భారత ప్రభుత్వం, భారత ప్రజలతో ఉంటామన్నారు.

## ప్రియురాలికోసం కట్టుకున్న భార్యనే కడతేర్చిన బిజెపినేత

**అజ్మీర్, ఆగస్టు 17:** ప్రియురాలితో కలిసి జీవించేందుకు కట్టుకున్న భార్యనే అత్యంత దారుణంగా హత్య చేశాడో భర్త. ఈ ఘోరాన్ని కప్పిపుచ్చేందుకు దోపిడీ నాటకం ఆడినా, పోలీసుల విచారణలో అసలు నిజం బయటపడింది. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. బిజెపినేత అయిన భర్తే ఈ దారుణానికి పాల్పడటం గమనార్హం. అజ్మీర్‌కు చెందిన బిజెపి నాయకుడు రోహిత్ సైనీకి సంజు అనే మహిళతో వివాహమైంది. అయితే, అదే ప్రాంతానికి చెందిన రీతూ సైనీ అనే మరో మహిళతో రోహిత్‌కు కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో తమ బంధానికి భార్య సంజు అడ్డుగా ఉందని భావించారు. ఈ నెల 10న సంజు అనుమానాస్పద స్థితిలో ఇంట్లో మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టగా రోహిత్ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. ఇంట్లోకి చొరబడిన దొంగలు, తన భార్యను హత్య చేసి విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే, అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో నేరాన్ని అంగీకరించాడు. ఈ కేసు వివరాలను అడిషనల్ ఎస్పీ (రూరల్) దీపక్ కుమార్ మీడియాకు వెల్లడించారు. "ప్రియురాలు రీతూ ప్రోద్బలంతోనే రోహిత్ తన భార్యను హత్య చేసినట్లు అంగీకరించాడు. తమ మధ్య నుంచి సంజును తొలగించుకోవాలని రీతూ ఒత్తిడి చేయడంతో ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపాడు.

ఘటన జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించామని ఆయన వివరించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రోహిత్ సైనీతో పాటు, హత్యకు ప్రేరేపించిన అతని ప్రియురాలు రీతూ సైనీని కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని మరింత లోతుగా విచారిస్తున్నారు.

## న్యూయార్క్‌లో కాల్పుల కలకలం.. ముగ్గురి మృతి

**వాషింగ్టన్, ఆగస్టు 17:** అమెరికాలో కాల్పుల ఘటన కలకలం రేపింది. న్యూయార్క్ సిటీలోని రద్దీగా ఉన్న ఓ క్లబ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. న్యూయార్క్ సిటీలో తుపాకీ హింస రికార్డు స్థాయిలో తగ్గిపోయిన వేళ ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో క్లబ్‌లో ఓ వివాదం చెల రేగిన తర్వాత పలు ఆయుధాలతో ఈ కాల్పులు జరిగినట్లు అనుమానిస్తున్నామని న్యూయార్క్ పోలీసు కమిషనర్ జెస్సికా టిష్ వెల్లడించారు.

ఘటనాస్థలం నుంచి 36 షెల్ కేసింగ్‌లను, సమీపంలోని వీధిలో ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతుల వయసు 27 నుంచి 61 యేళ్ల మధ్యలో ఉంటుందని చెప్పారు. గాయపడిన వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారని, వారంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.



## పదవీ కాంక్షలేదు: ఆసిఫ్ మునీర్

**ఇస్లామాబాద్, ఆగస్టు 17:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ తనను తాను రక్షకుడిగా చెప్పుకునేందుకు తాపత్రయపడుతున్నారు. రాజకీయాలు, అత్యున్నత స్థానాలపై పదవీ కాంక్ష లేదని ప్రకటించడం గమనార్హం. దేశ సేవ కోసమే భగవంతుడు తనను పుట్టించాడని.. ప్రజలను కాపాడటం తప్ప తనకు మరో ఆలో చన ఉండదని అన్నారు. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీని బలవంతంగా గద్దెదించి దేశ సైనిక దళాల ప్రధానాధికారి ఆసీం మునీర్ ఆ స్థానాన్ని ఆక్రమించనున్నారంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో రాజకీయగా ఉద్రిక్తతలను సృష్టించడానికి కొందరు ఇటువంటి వార్తలను ప్రచారం చేస్తున్నారన్నారు.

## గాజా పౌరులకు వీసాలు నిలిపివేసిన యుఎస్

**వాషింగ్టన్, ఆగస్టు 17:** ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గాజా ప్రజలపై మరో పిడుగు పడింది. ఇకపై గాజా ప్రజలకు వీసాలు నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన అనేకమంది ప్రజలు చికిత్స కోసం యుఎస్‌కు వస్తున్నారని ట్రంప్ యంత్రాంగానికి ఫిర్యాదు అందడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక వైద్య-మానవతా వీసాలను జారీ చేయడానికి ఉపయోగించే ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా గాజా ప్రజలకు అన్నిరకాల వీసాలు నిలిపివేస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది.



## సంక్షిప్తంగా..

### 4 కిలోమీటర్ల టార్గెట్‌ను ఛేదించిన ఉక్రెయిన్ సైనికుడు

#### రష్యా సైనికుడిని హతమార్చి రికార్డు



**హైదరాబాద్, ఆగస్టు 17:** రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు చెందిన ఓ స్నైపర్ అసాధారణ ప్రతిభతో ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసు కున్నాడు. ఏకంగా 13,000 అడుగుల (దాదాపు 4 కిలోమీటర్లు) దూరం నుంచి రష్యా సైనికుడిని గురితప్పకుండా కాల్చిచంపి చరిత్ర సృష్టించాడు. ఈ విషయాన్ని కీవ్‌పోస్ట్ పత్రిక అధికారికంగా ప్రకటించింది. పొక్రొవొస్క్ ప్రాంతంలో ఆగస్టు 14న ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి. స్థానికంగా తయారు చేసిన శక్తివంతమైన ఎలిగేటర్ 14.5 ఎంఎం రైఫిల్‌తో ఈ స్నైపర్ ఇద్దరురష్యాసైనికులను మట్టుబెట్టినట్లు సమా చారం. ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతం చేయడానికి ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డ్రోన్ టెక్నాలజీనిఉపయోగించుకున్నట్లు మిలిటరీ జర్నలిస్ట్ యూరి బుట్సోవ్ ధ్రువీకరించారు.

### ఒడిశాలో 20 మెట్రిక్ టన్నుల బంగారం నిక్షేపాలు



**భువనేశ్వర్, ఆగస్టు 17:** ఒడిశాలో భారీ స్థాయిలో బంగారు ఖనిజ నిక్షేపాలు బయటపడినట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ప్రకటించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సుమారు 10 నుంచి 20 మెట్రిక్ టన్నుల నిక్షేపాలను గుర్తించినట్లు తెలిపింది. సుందర్ గఢ్, నవరంగ్ పూర్, కియోంజర్, దేవగఢ్ జిల్లాల్లో ఇప్పటికే బంగారు నిక్షేపాల వెలికితీత పెద్ద ఎత్తున కొనసాగుతోంది. ఈ క్రమంలో మైనింగ్ కార్పొరేషన్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ పరిశోధనలు చేపట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ధర చుక్కలను అంటుతున్న వేళ ఒడిశాలో బంగారు నిక్షేపాల సంగతి బయటపడడంతో అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భారతీయ తాలిబన్ 'ఆర్ఎస్ఎస్'

### కాంగ్రెస్ సీనియర్‌నేత బికె హరిప్రసాద్



**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)ను 'ఇండియన్ తాలిబన్లు'గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత బీకే హరిప్రసాద్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆరెస్సెస్‌పై ప్రశంసలు కురిపించిన నేపథ్యంలో హరిప్రసాద్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై అధికార బిజెపి తీవ్రంగా స్పందించింది. జాతీయవాద సంస్థలను అవమానించడం, నిషేధిత సంస్థలను ప్రేమించడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని ఘాటుగా బదులిచ్చింది. కర్ణాటక ఎమ్మెల్సీ అయిన బీకే హరిప్రసాద్ మాట్లాడుతూ "దేశంలో శాంతికి భంగం కలిగించేందుకు వారు (ఆరెస్సెస్) ప్రయత్నిస్తున్నారు. నేను ఆరెస్సెస్ ను తాలిబన్లతో మాత్రమే పోలుస్తాను. వాళ్లు భారతీయ్కతాలిబన్లు. అలాంటి వారిని ప్రధాన మంత్రి ఎర్రకోటనుంచి ప్రశంసిస్తున్నారని విమర్శించారు.

## 13 మంది చనిపోయారు: అంగీకరించిన పాకిస్థాన్

**కరాచి, ఆగస్టు 17:** భారత వాయుసేన జరిపిన ఆపరేషన్ సిందూర్ మెరుపు దాడుల్లో తమకు భారీ నష్టం వాటిల్లిన విషయాన్ని పాకిస్థాన్ ఎట్టకేలకు పరోక్షంగా అంగీకరించింది. ఈ సైనిక చర్యలో 13 మంది సైనిక సిబ్బంది సహా 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్టు ఘటన జరిగిన మూడు నెలల తర్వాత అంగీకరించింది. తమ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మరణించిన సైనికులకు మరణానంతరం శౌర్య పతకాలను ప్రదానంచేసి, ఈ నిజాన్ని ప్రపంచం ముందుఒప్పుకుంది. అధ్యక్ష భవనంలో జరిగిన ఓకార్యక్రమంలో ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో మరణించిన సైనిక సిబ్బందికి మరణానంతరం పురస్కారాలు అందజేశారు. ఈదాడుల్లో భోలారీ ఎయిర్‌బేస్‌పై జరిగిన దాడిలో మరణించిన స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసఫ్‌కు 'తమ్ఘాఇబసాలత్' పురస్కా రాన్ని ప్రకటించారు. ఆయనతో పాటు హవల్దార్ ముహమ్మద్ నవీద్,నాయక్ వకార్ ఖాలిద్, లాన్స్‌నాయక్ దిలావర్ ఖాన్‌లకుమరణానంతరం ఈ పురస్కారాన్ని ఇచ్చారు. భారత దాడులు జరిగిన నూర్‌ఖాన్, సర్గోధా, జాకోబాబాద్, భోలారీ,షోర్‌కోట్ వైమానిక స్థావరాల్లో పలువురు గాయపడినట్లు కూడా సమాచారం.



# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

## సొసైటీలు అన్నదాతలకు ఉత్తమ సేవలందించాలి: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**ఇందుకూరుపేట, (నెల్లూరు), ఆగష్టు 17, ప్రభాతవార్త:** అన్నం పెట్టే అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఇందుకూరుపేటలో ఉన్న అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ అమర్నాథ్‌రెడ్డి, డైరక్టర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ సొసైటీ చైర్మన్, డైరక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన వారు రైతులకు ఉత్తమ సేవలు అందించాలని ఆమె అన్నారు. అమరేంద్రరెడ్డికి ఎలక్షన్ టైంలో మంచి పదవి ఇవ్వాలని ఆలోచించామని, కష్టపడే తత్వం ఉన్న వ్యక్తి అని, అందుకే సొసైటీ చైర్మన్‌గా నియమించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవతో రైతుల ఖాతాలో నగదు జమ చేశారని, తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారన్నారు. ఇటీవల మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి మాట నిలబెట్టుకున్నారని వెల్లడించారు. సహకార బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉంటే రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

రైతులకు ఎరువులు, పురుగు మందులు, ఆక్వా సాగు అధికంగా ఉన్న ప్రాంతాల్లో రైతులకు చేపల మేతకు కూడా సొసైటీ అందిస్తుందని చెప్పారు. కొత్త చైర్మన్ రైతుల అవసరాలను దృష్టిలో రైతుల ప్రయోజనాలను కాపాడుతూ అభివృద్ధికి పాటుపడ తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోదూరు కమలాకర్‌రెడ్డి, బ్యాంకు చైర్మన్ గండవరపు అమర్నాథ్‌రెడ్డి, డైరక్టర్ పెనుబల్లి కృష్ణ చైతన్య, డైరక్టర్ శూదలగుంట ప్రేమలత, జడ్పీ వైస్ చైర్మన్ జయలక్ష్మి, ఇందుకూరుపేట మండల అధ్యక్షుడు పవన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రావిళ్ళ వీరేంద్ర నాయుడు, చెంచు కిషోర్ యాదవ్, దేవిరెడ్డి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల విద్యకు కార్యాచరణ

## 125 అటిజం కేంద్రాల ఏర్పాటుకు ఎస్ఎస్ఏ చర్యలు

**విజయవాడ, ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని విభిన్న ప్రతిభావంతులకు చదువు నేర్పడంతో పాటు వారి భవితకు బాటలు వేసేందుకు ఏపీ ప్రభుత్వం కీలక కార్యచరణ అమలె చేస్తుంది.ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కృషి చేస్తోంది.ఇలాంటి విద్యార్థులను సాధారణ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా వారికి సమాన అవకాశాలు కల్పిస్తోంది. ట్యాబ్‌లలో 33 రకాల యాప్‌లను ఇన్స్టాల్ చేసి,బోధన చేయిస్తోంది. ఫ్యామిలీ యాప్‌కు పిల్లల ఐడీని లింక్ చేయడం ద్వారా విద్యార్థి ఎంత సేపు యాప్ ఉపయోగించారో పర్యవేక్షిస్తున్నారు. దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతి కోసం ఇప్పటికే 679 భవిత కేంద్రాలు ఏర్పాటు చేయగా...దేశంలో తొలిసారి అటిజం పిల్లల కోసం పట్టణాల్లో 125 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 85,046 మంది ప్రత్యేకావసరాలు కల్గిన విద్యార్థులకు ప్రత్యేక విద్యను అందిస్తున్నారు.ఏటా బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు సర్వే చేస్తారు. గుర్తించిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేస్తున్నారు.భవిత కేంద్రాల్లో పిల్లలకు ఫిజియోథెరపీ,స్పీచ్‌థెరపీలతో పాటు ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో చెప్పిస్తున్నారు.తీవ్రమైన వైకల్యంతో పాఠశాలలకు రాలేని పిల్లలకు ప్రతి శనివారం వారి ఇంట్లోనే బోధన చేస్తున్నారు.చదువుకు సహాయంగా భత్యంగా ఇస్తున్నారు.దివ్యాంగ పిల్లలకు నెలకు రూ.600 చొప్పున రవాణా భత్యాన్ని అందిస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో 3,932,సెకండరీ స్థాయిలో 4,058 మందికి ఈ భత్యాన్ని ఇస్తున్నారు. బాలికలకు నెలకు రూ.200 అదనంగా ఇస్తున్నారు. సొంతంగా బడికి రాలేని వారికి సహాయకుల భత్యాన్ని అందిస్తున్నారు. 1-8 తరగుల్లో నమోదై 40% హాజరు ఉన్న పిల్లల సహాయకులకు నెలకు రూ.600 చొప్పున ఇస్తున్నారు.ఇంటివద్దనే ఉండే వారికి పది నెలలకు రూ.3 వేలు ఇస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో 6,790 మంది ఈ సహాయాన్ని పొందుతున్నారు.

వారంలో 3 రోజులు ఫిజియోథెరపిస్టులు భవిత కేంద్రాలను సందర్శించి సేవలు అందిస్తున్నారు.క్రీడల కోసం ప్రత్యేకంగా జిల్లాకు రూ.లక్ష వరకు వ్యయం చేస్తున్నారు.భవిత కేంద్రాల్లో రూ.7వేల చొప్పున గౌరవ వేతనమిస్తూ సహాయకులను నియమించారు.

## అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వఉద్యోగుల సమాఖ్య

# జాతీయ ఉపాధ్యక్షుడిగా అలపర్తి విద్యాసాగర్ ఎన్నిక

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడిగా అలపర్తి విద్యాసాగర్ ఎన్నికయ్యారు.న్యూఢిల్లీలో జరుగుతున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశంలో ఎన్‌జిజిఓ ఆంధ్రప్రదేశ్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడుని జాతీయ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడు రోజుల తారీకులలో న్యూఢిల్లీ ఫరీదాబాద్ లో జరుగుతున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో 29 రాష్ట్రాల నుంచి రాష్ట్ర సంఘ నాయకులు పాల్గొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి సుకుమార్ ఎన్నికను ప్రతిపాదిస్తూ అలపర్తి విద్యాసాగర్ పేరును జాతీయ ఉపాధ్యక్షుడిగా సూచించారు. జాతీయ కార్యవర్గ సభ్యులందరు.రాష్ట్రాల ప్రతినిధులు ఎన్నికను ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఎన్నికను ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రకటించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆలపర్తి విద్యాసాగర్ జాతీయ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ తన బాధ్యతలో మరింత పెరిగాయని, జాతీయ స్థాయిలో జరిగే ఉద్యమాల కార్యాచరణ బాధ్యత కూడా తన మీద ఉంటుందని, ముఖ్యంగా జాతీయస్థాయిలో జరిగే సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, లేబర్ కోడ్ వంటి అంశాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమాన్ని, ఎన్నికలు నడిపించిన చైర్మన్ సుభాష్ లాంబ, ప్రధాన కార్యదర్శి సుకుమార్ కు జాతీయ కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన విద్యాసాగర్ ను సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వి రమణ, ఆల్ ఇండియా వుమెన్ సబ్ కమిటీ కన్వీనర్ రాజ్యలక్ష్మి, విబిబివీ నాయకులు రవిశంకర్, కిషోర్ మరియు మాజీ నాయకులు మహమ్మద్ ఇక్బాల్ అభినందనలు తెలిపి సత్కరించారు.

# కొందరు పార్టీ రాష్ట్ర నేతలకు బిజెపి తెలంగాణలో అధికారంలోకి రావడం ఇష్టం లేదు: రాజాసింగ్

**హైదరాబాద్ (గోషామహల్), ఆగస్టు 17, ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి అధ్యక్ష పదవిని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావుకు అప్పగించడాన్ని నిరసిస్తూ నిరసనగా రాజాసింగ్ బిజెపి గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. వెంటనే శాసనసభ్యుడు రాజాసింగ్ రాజీనామాను అధిష్ఠానం కూడా ఆమోదించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బిజెపి పార్టీపై గోషామహల్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.రాజాసింగ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.ఆయన ఓ మీడియా చానల్ ప్రతినిధితో మాట్లాడుతూ తెలంగాణలో బిజెపి ప్రభుత్వం రాదు అని మరోసారి సంచలమైన వ్యాఖ్యలు చేశారు.ప్రతి జిల్లాలో నా మనిషే అంటే ఎన్నో ఏళ్ల నుండి ప్రాణంపెట్టి పని చేసిన పాత కార్యకర్తలు ఎక్కడికి పోవాలి అన్నారు.బిజెపి అధిష్టానం కూడా తెలంగాణ రాష్ట్రంపై దృష్టి సారించడం లేదని,ఇతర రాష్ట్రాల మీద ఉన్న శ్రద్ధ తెలంగాణ రాష్ట్రంపై లేదన్నారు.బిజెపి అధిష్టానానికి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని ఇష్టం లేదని మరోసారి సంచలమైన వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలోని పెద్ద బాబులు చెప్పిందే అధిష్టానం వింటుందన్నారు.వాళ్ల పేర్లు చెప్పలేను అన్నారు. వాళ్ల వల్ల తెలంగాణ బిజెపికి చాలా నష్టం జరుగుతుందని శాసన సభ్యులు రాజాసింగ్ తీవ్రఆరోపణలు చేశారు. బిజెపి గతంలో రాజా సింగ్ రాజీనామాను అమోదించినప్పటికి మరోసారి తాజాగా చేసిన వ్యాఖ్య లపై అధిష్టానం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

# 20 నుంచి సిపిఐ రాష్ట్ర మహాసభలు

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సమసమాజమే లక్ష్యంగా ఆవిర్భవించి అనేక త్యాగాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 20 నుంచి 22 వరకు మూడు రోజులు పాటు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరగనున్నాయి.

# పి4 నుంచి మరో 'విజయ'ప్రస్థానం

## 5,465 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా కృష్ణా మిల్క్ యూనియన్

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వినూత్న పీ4 విధానంలో మరో మైలురాయిగా నిలుస్తోంది ఈ "విజయ" ప్రస్థానం. విజయ బ్రాండ్ పేరిట పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తూ.. పాడి రైతుల సంక్షేమంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ పీ4లో మేము సైతం అంటూ 5,465 గ్రామీణ బంగారు కుటుంబాలకు మార్గదర్శనం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చింది. ఈ మేరకు కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షులు చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు తాజాగా నందిగామ మండలం, మునగచర్లలో జరిగిన సామూహిక గోకులం కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశకు ప్రమాణ పత్రాలు అందజేశారు. వత్సవాయి మండలం నుంచి 1,524 బంగారు కుటుంబాలు, పెనుగంచిప్రోలు మండలం నుంచి 1,192, విస్సన్నపేట మండలం నుంచి 1,255, విజయవాడ గ్రామీణ మండలం నుంచి 747, చందర్లపాడు నుంచి 747 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ఆంజనేయులు ప్రకటించారు. బంగారు కుటుంబాల ఆర్థికస్థితిగతులను అధ్యయనం చేసి వారి జీవితాలను సాధికారత దిశగా నడిపించేందుకు అవసరమైన చేయూత అందించనున్నట్లు పేర్కొన్నారు. పాడి పశువుల కొనుగోలుకు కేడీసీసీ ద్వారా ఇచ్చే రూ. లక్ష చొప్పున రుణాలకు సంబంధించి వడ్డీని యూనియన్ భరిస్తుందన్నారు. పశు గ్రాసంతో పాటు పశు వైద్యసేవలు వంటి విషయాలపై యూనియన్ ప్రత్యేకంగా దృష్టిసారిస్తుందని.. అవసరం మేరకు సామూహిక గోకులాలు ఏర్పాటుచేసి వాటిని సద్వినియోగం చేసుకునేలా చేయిపట్టి నడిపిస్తామన్నారు. మహిళా పాడి రైతులను కూడా పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని.. పాడితో కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి అడుగులువేస్తామన్నారు. బంగారు కుటుంబాలకు చెందిన సభ్యులకు అవసరం మేరకు ఆరోగ్య సేవలు కూడా అందిస్తామని వివరించారు. మేలు జాతి పశు సంతతి, పాల ఉత్పత్తి వృద్ధికి వీలుగా పెయ్యి దూడలు పుట్టేలా లక్ష దోసుల లింగ నిర్ధారిత వీర్యాన్ని అందించేందుకు రూ. కోటి సహాయాన్ని కూడా కృష్ణా మిల్క్ యూనియన్ ప్రకటించింది. రూ. 150 విలువైన ఒక్కో దోసుకు రూ. 100 రాయితీ ఇవ్వనున్నట్లు వివరించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని మార్చే సత్తా పాడి పరిశ్రమకు ఉందని.. ఈ నేపథ్యంలో పాడితో పేదరికాన్ని తరిమికొట్టాలనే సంకల్పంతో వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చిన కృష్ణా మిల్క్ యూనియన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

ఇదే స్ఫూర్తితో మరిన్ని యూనియన్లు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, వ్యక్తు లు, ఇలా మనసున్న ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావొచ్చని కలెక్టర్ పిలుపునిచ్చారు.



పీ4 ప్రమాణ పత్రాలను ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీశకు అందిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ నాయకులు

# వరస వివాదాల్లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

### నిన్న దగ్గుబాటి, ప్రభాకర్ చౌదరి మధ్య మాటల యుద్ధం

### నేడు జూనియర్ ఎన్టీఆర్, లోకేష్‌ను ఉద్దేశించిన ఎమ్మెల్యే ఆడియో వైరల్

### అందరి చూపు అధిష్టానం పైనే

**అనంతపురం, ఆగస్టు 17, ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం అర్బన్ శాసనసభ స్థానం నుంచి గత ఎన్నికల్లో మొదటి సారిగా ఎన్నికైన పారిశ్రామికవేత్త దగ్గుబాటి వెంకట ప్రసాద్ వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. మొన్న టిడిపి నేత, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని ఉద్దేశించి పరోక్షంగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ విలేకరుల సమయం ఏర్పాటు చేసి ఆరోపణ స్పందిస్తే అదే రోజు అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి కూడా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేరు చెప్పి డైరెక్టుగా ఘాటుగా స్పందించి కడిగిపారేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక 14 నెల కాలంలో ఏదో విధంగా తనను బదనానం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడని, కొందరి టిడిపి నాయకులు ఆత్మహత్య చేసుకున్నారని, మహిళా తాళిబొట్టులు తెంచారని, సొసైటీ భూములను కాజేశారని తదితర ఆరోపణలను తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఉద్దేశించి ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పలు ఆరోపణ లు చేశారు.. ఎమ్మెల్యే ఆరోపణలకు ప్రభాకర్ చౌదరి స్పందిస్తూ ఏడాదిన్నర కాలంలో అనంతపురం అర్బన్ లో ఎమ్మెల్యే దగ్గుబాటి పార్టీని భ్రష్టు పట్టించారని, అనంతపురం ఎమ్మెల్యే చర్యల వల్ల ఇతరు నియోజకవర్గాల్లో కూడా పార్టీకి చెడ్డ పేరు వస్తుందని, కార్యకర్తలను, ఇతరులను ఎమ్మెల్యే ఏ విధంగా బెదిరించాలన్నది నా వద్ద ఆరోపణలు ఉన్నాయని వెల్లడించారు. పార్టీకి చెడ్డ పేరు వస్తుందని నేను ఇంతవరకు చెప్పలేదని, ఇద్దరిపై వచ్చిన ఆరోపణలకు బహిరంగ చర్చకు సిద్ధమని, తేల్చుకునేందుకు సిద్ధమని ప్రభాకర్ చౌదరి సవాలు విసిరారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదంపై టిడిపి అధిష్టాన వర్గం ఎలా స్పందిస్తుందో అన్నది పార్టీ క్యాడర్ లో చర్చ జరుగుతోంది.. సహజంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పై గత కొన్ని నెలలుగా వివిధ ఆరోపణలు వస్తున్నాయి. ఎమ్మెల్యే వర్గీయులు కబ్జాలకు పాల్పడుతున్నారు అని, కార్యకర్తలను బెదిరిస్తున్నారు అని, స్థల వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నారని, మద్యం షాపుల నిర్వహణలో దౌర్జన్యంగా వ్యవహరి స్తున్నారు అని, తదితర ఆరోపణలు బలంగా వచ్చాయి.. ఇందులో భాగంగా మద్యం మాఫియా డాన్ గా పేరున్న అనంతపురం టిడిపి నేత సుధాకర్ నాయుడు ను ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ వర్గీయులు హత్యకు ప్లానింగ్ చేసిన సంఘటన గతంలో చర్చనీయాంశం అయింది. ఈ విషయంలో సుధాకర్ నాయుడు జిల్లా ఎస్పీ జగదీష్ ని కూడా కలిసి ఫిర్యాదు చేశారు. పత్రికల్లో, టీవీల్లో ఈ సంఘటన వార్తలు అప్పట్లో ప్రముఖంగా వచ్చారు. ఆ సమయంలో రాయల సీమ జిల్లాల టిడిపి పరిశీలకుడు జోక్యం చేసుకొని ఎమ్మెల్యేను, సుధాకర్ నాయుడుని విజయవాడకు పిలిపించుకొని గట్టిగా మందలించారు. ఆ సంఘటనపై పార్టీ పెద్దలు జోక్యం చేసుకోవడం తో ఆ వివాదం సమీసి పోయి టీ కప్పులో తుఫానుగా మారిపోయింది. ఈ నేపథ్యంలో మొన్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆరోపణలు, ప్రతి ఆరోపణలు చేసుకున్నారు. ఇది మర్చిపోకముందే ఆదివారం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే ఆడియో వైరల్ అయ్యింది. జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్2 సినిమా ను అనంతపురంలో ఆడించే ప్రశ్నలేదని, తదితర విషయాలపై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి మరో వ్యక్తితో మాట్లాడిన ఆడియో వివాదం ఆదివారం చర్చనీయాంశమైంది. ఆ ఆడియోతో తమకు సంబంధం లేదని ఎమ్మెల్యే చేసినప్పటికీ టిడిపిలో రసవత్తల చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయి అనంతపు రం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. అనంతపురం తో పాటు మరో రెండు అసెంబ్లీ స్థానాల్లో వివాదం వివాదాలు నెలకొడంతో ముగ్గురు ఎమ్మెల్యేలపై పార్టీ విచారణకు ఆదేశించింది.

# వరద ముంపు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలి : కమిషనర్ ధ్యానచంద్ర



## నగరపాలక సంస్థ సిబ్బందికి సహకరించమని విజ్ఞప్తి

### వినకపోతే పోలీసు,రెవెన్యూ శాఖలసహకారంతో పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశాలు

**విజయవాడ కార్పొరేషన్,ఆగస్టు 17,ప్రభాతవార్త:** కొండ ప్రాంతాల్లో,వరద ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని,మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆదివారం సాయంత్రం శాఖాధిపతులు,స్పెషల్ ఆఫీసర్లతో ఆయన టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదానికి గురయ్యే అవకాశమున్న ఇల్లులు ఎన్ని,అందులో నివసిస్తున్న ప్రజలు ఎంతమంది ఉన్నారు అని అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లను అడగ్గా సర్కిల్-1 అసిస్టెంట్ సిటీ ప్లానర్ చంద్రబోస్ కొండ ప్రాంతాల్లో ప్రమాదానికి గురయ్యే ఇళ్ళు 10 ఉన్నాయని,సర్కిల్-3 అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు 15 ఉన్నాయని,15లో అత్యంత ప్రమాదానికి గురిఅయ్యే ఇల్లు రెండు ఉన్నాయని, వారికి ఎంత అవగాహన కల్పించినా వారు ఇప్పుడు కాదు తర్వాత వెళ్తామని దాటేస్తున్నారని తెలిపారు. దాంతో కొండ ప్రాంతాల్లో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న ఇళ్ళను పూర్తి స్థాయిలో పరిశీలించి సంపూర్ణ నివేదికను తమకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వరద హెచ్చరికలు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన దగ్గర నుంచి విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు వరద ముంపు కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి, సురక్షిత ప్రదేశాలకు తరలిరావాలని అవగాహన కల్పిస్తున్నప్పటికీ వారు వినని పక్షంలో పోలీసు, రెవిన్యూ శాఖ సహకారంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ముంపు ప్రాంతానికి దగ్గరలో అన్ని వసతులు కల్పించిన ఒక పునరావాస కేంద్రం ఉండేటట్లు ఖచ్చితంగా చూసుకోవాలని,ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్‌ను ఆదేశించారు. ప్రతి పునరావాస కేంద్రంలో ప్రజలకు భోజన సదుపాయాలను ముందుగానే ఏరాపటు చేసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసరుల తమ తమ వార్డుల్లో గల వర్షపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి ఖచ్చితంగా అవగాహన కల్పించి హెచ్చరికలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

# అద్దెకు దిగుతామంటూ ఇళ్ల యజమానుల బ్యాంకు ఖాతాలు వివరాల సేకరణ

## కొత్తపద్ధతిలో మోసానికి సైబర్ నేరగాళ్లు

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎప్పుడు ఎలా జరుగుతుందో తెలియకుండా వుండడంతో ఏ పాపం తెలియని అమాయకులు కేసుల్లో ఇరుక్కుని ఇక్కట్లు పడుతుండగా సైబర్ నేరగాళ్లు మాత్రం దర్జాగా అందినంత దోచుకుంటూ జల్సాగా జీవి స్తున్నారు. కొత్త తరహాలో వెలుగు చేసిన సైబర్ నేరాల్లో ముఖ్యమైనది అద్దె ఇంట్లో దిగుగూ ఇళ్ల యజమానుల ఆధార్ కార్డులు, బ్యాంకుల ఖాతాల వివరాలు తీసుకుని, వాటిని సైబర్ నేరాలకు సంబంధించిన లావాదేవాలకు వాడడం. ఈ తరహా నేరాల్లో సైబర్ నేరగాళ్ల మొదట అద్దె ఇంట్లోకి ది గుతారు. ఇంటి యజమాని ఆధార్ కార్డును తీసుకుంటారు. ఇంటి యజమాని ఆధార్ కార్డు వుంటేనే తాము పలానా వ్యక్తి ఇంట్లో అద్దెకు వుంటునా ్నమని, తమ కంపెనీ నమ్ముతుందని, ఇంటి అద్దె ఇస్తుందని నమ్మబలుకుతారు. దీని తరువాత ఇంటి యజమాని బ్యాంకు ఖాతాను, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డులు తీసుకుంటారు. వీటి ఆధారంగా లాగిన్ ఐడి, పాస్‌వర్డ్‌లు తీసుకుంటారు. వీటి ఆధారంగా సైబర్ నేరగాళ్ల నేరాలకు శ్రీకాకం చుడ తారు. ఇంటి యజమాని బ్యాంకు ఖాతాల ద్వారా సైబర్ నేకాలకు సంబంధించిన లావాదేవీలు నిర్వహిస్తారు. ఈ విషయం ఎప్పుడో కానీ ఇంటి యజమానులకు తెలియదు. తీరా తెలిసే సమయానికి పోలీసులు కేసు నమోదు చేసి వారిని నిందితులుగా చూపుతారు. అవసరం అయితే అరెస్టు చేసి వారిని జైళ్లకు కూడా పంపుతున్నారు. నగరంలోని సనత్‌నగర్‌కు చెందిన ఓ ఆటో డ్రైవర్ తన సొంత బావమరిదికి అడగగా ఆధార్ కార్డు, బ్యా ంకు ఖాతా వివరాలు, డెబిట్ కార్డు ఇచ్చాడు. మూడు నెలల తరువాత సదరు ఆటో డ్రైవర్ బ్యాంకు ఖాతాలో సైబర్ నేరాలకు సంబంధించి లక్ష లాది రూపాయల లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి విచారణకు పిలిచారు. తనకు ఇదంతా ఏమీ తె లియదని, తన బావమరిది అడిగితే ఇచ్చానని చెప్పగా అదంతా నీవు...నీ బావమరిది తేల్చుకోవాలి...అంటూ ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు పోలీసులు. ఇటువంటిదే శివార్లలో వెలుగు చూసింది. 20 వేల రూపాయలకు పెద్ద ఇంటిని తీసుకున్న సైబర్ నేరగాళ్ల ఈ క్రమంలో ఇం టి యజమానిని దోస్తీ చేసుకుని అతని బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని వీటి ద్వారా సైబర్ నేరాలకు దిగారు. ఈ కేసులో ఇంటి య జమాని బ్యాంకు ఖాతాలో 25 లక్షల రూపాయల సైబర్ నేరాల లావాదేవీలు జరిగినట్లు తేలింది.

ఈ నేరం వెలుగుచూసే సమయానికి సైబర్ నేరగాళ్లు ఉడాయించగా ఇంటి యజమాని పోలీసు కేసులో ఇరుక్కుని ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది. ఈ తరహా మోసాలు దేశ వ్యాప్తంగా అనేకచోట్ల వెలుగు చూడడం ఆయా ప్రాంతాలలో సంచలనం రేపింది. బడా సైబర్ నేరగాళ్ల విదేశాల్లో వుంటుండగా వారికి అనుచరులుగా వుంటున్న వారు భారత్‌లోని ఉత్తర, తూర్పు రాష్ట్రాలలో వుంటున్నారు. వీరికి ఏజెంట్లుగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారుంటున్నారు. ఈ ఏజెంట్లు కొందరు సబ్ ఏజెంట్లను నియమించుకుని తెలివిగా ఆయా బస్తీలలో వుండే ఆటో డ్రైవర్లు, సామాన్య కూలీల చేత బ్యాంకు ఖాతాలు తెరిపించి, వారికి కొంత క మీషన్ ఇస్తున్నారు.

ఇలాంటి కేసుల్లో కూలీలు, ఆటో డ్రైవర్లు పోలీసు కేసుల్లో ఇరుక్కోగా తాజాగా ఇళ్ల యజమానుల వంతు వచ్చింది. ముందుగా ఆయా ప్రాంతాలలో అద్దెకు వుండే ఇళ్లను కనుగొని సైబర్ నేరగాళ్ల అక్కడ దిగుతున్నారు. ఇంటి యజమాని అడిగినంత అద్దె ఇచ్చేందుకు సిద్ధమవ డంతో పాటు ఐదారు నెలల అడ్వాన్స్ కూడా ముందుగానే ఇచ్చేస్తున్నారు. అనంతరం వారి నమ్మకాన్ని చూరగొని ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా లను, డెబిట్ కార్డులను తీసుకుని వీటి ఆధారంగా సైబర్ నేరాలకు సంబంధించిన లావాదేవీలు నడుపుతున్నారు. ఇక పోలీసులు కేసు నమోదు చేసి బ్యాంకు ఖాతాదారులను అరెస్టు చేసే సమయానికి నేరాలకు పాల్పడిన వారు ఉడాయిస్తున్నారు. ఎవరికి పడితే వారికి బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డులు, డెబిట్ కార్డులు ఇవ్వకూడదని వారు హెచ్చరిస్తున్నారు.

# విదేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్న భారత్

### ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి శ్రేయస్కరం

### ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం

### ఎంతో ప్రయోజనం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**వర్గల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగంలో దేశం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టగా, వ్యవసాయ ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సింగాయ పల్లిలో క్రిస్టల్ విత్తనోత్పత్తి సంస్థను పరిశీలించి వివిధ విభాగాలను ప్రారం భించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షిం చారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి శ్రేయస్కరం కాగా, క్రిమిసం హారక మందుల వినియో గాన్ని తగ్గించి కంపోస్టు ఎరువుల వాడకంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ విధానంతో విత్తన ఎంపిక నుండి పంట కోత వరకు ప్రయోజనం, అలాగే నీరు, ఎరువుల వినియోగం సరైన మోతాదులో ఉంటుందన్నారు. ముఖ్యం గా క్రిమిసంహారక మం దులు అధిక ఎరువుల వినియోగంతో సాగు నేల ఆరోగ్యం దెబ్బ తింటుం దని, దీనిని దృష్టిలో పెట్టుకొని సహజ పద్ద తుల్లో పండించే సాగులో కంపోస్ట్ ఎరువులు వినియోగించి పర్యావరణానికి హాని కలగకుండా ఆరోగ్యకర పంట ఉత్పత్తులు చేసుకోవచ్చని చెప్పారు. అంతేకాకుండా వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించే నూతన వంగడాలను ప్రోత్సహించి వాతావరణ మార్పులు, తెగుళ్ళ నుండి పంటలు కాపాడుకోవాలని కోరారు. కేంద్ర వ్యవసాయ, డైరీ రంగాన్ని ప్రోత్సహిస్తూ అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు ఎంఎస్పీ పెంచుతూ పంటల బీమా పథకం వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఎదుర్కొనే క్రమంలో నీరు వృధా చేయకుండా భూమిలో చేర్చేందుకు దృష్టి పెట్టాలని, తద్వారా ప్రతి ఒక్కరికి ఎంతో ప్రయోజనం ఉంటుందని అన్నారు. ప్రధాని నరేంద్రమోడిపై ఎంత వత్తిడి వస్తున్నప్పటికీ ఇతర దేశాల పంట ఉత్పత్తుల దిగుబడుల జోలికి వెళ్లకుండా, దేశీయ వ్యవసాయం, రైతులను ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రపంచ దేశాలకు ధీటుగా భారత్‌ను గొప్ప ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతూ అమెరికా వంటి దేశాలకు ధీటైన సమాధానం చెబుతున్నట్లు వివరించారు.




క్రిస్టల్ విత్తనోత్పత్తి సంస్థలో పలు విభాగాలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

Main tab page 7_Main tab page 7.qxd 8/18/2025 12:08 AM Page 1





విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త




## సంపత్ వినాయక నవరాత్రుల మొదటి ఆహ్వాన పత్రిక మావూరికి

**విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్ట్ 17, ప్రభాతవార్త**

శ్రీ సంపత్ వినాయక స్వామి వారి దేవాలయం లో ఈనెల 27 నుండి సెప్టెంబర్ 4 వరకు జరుగు శ్రీ వినాయక నవరాత్రుల మొట్ట మొదటి ఆహ్వానశుభలేఖను సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణకి అందజేసినట్లు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు, శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయం, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు.

## నేడు జిల్లాలో అన్ని పాఠశాలలకు సెలవు

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంథిర ప్రసాద్

**విశాఖపట్నం, ఆగస్టు 17, ప్రభాతవార్త**

అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విశాఖపట్నం జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంథిర ప్రసాద్ తెలిపారు. విద్యార్థుల రక్షణ, భద్రత దృష్ట్యా ముందస్తుగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించిన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సంబంధిత జిల్లా అధికారుల ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.

### చంద్రబాబుని విమర్శించే అర్హత

## వరదు కళ్యాణానికి లేదు :టిడిపి మహిళా నేతలు

- టిడిపి మహిళా నేతలు

**విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్ట్ 17, ప్రభాతవార్త**



మహిళలు ఉచిత బస్సు పథకం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు అని జిల్లా తెలుగు మహిళలు సర్వసిద్ధి అనంతలక్ష్మీ అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో అనంతలక్ష్మీ మాట్లాడుతూ వరుదు కళ్యాణికి ఆహ్వానం మీరు ఎక్కడ బస్ ఎక్కితే అక్కడ ఎక్కిస్తాం స్త్రీ శక్తి పథకం లో ప్రకటించిన ఐదు బస్సుల్లో మాతో పాటు రండి కలసి ప్రయాణం చేద్దాం లేకపోతే మూసుకొని ఉండండి అన్నారు. కనీసం స్వాతంత్ర దినోత్సవం నాడు జాతీయ జెండా ఎగరవేయలేదు.రాఖీ రోజు చెల్లి కి రాఖీ కట్ట లేదు,తల్లిని చెల్లిని గౌరవించలేని వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు.వరుదు కల్యాణి ఆ పార్టీ లో ఎంత మోసం పోయారో అందరికి తెలుసు అని వ్యంగ్యంగా అన్నారు. ముప్పే గంటల్లో 12 లక్షలు మంది ఈ ఉచిత బస్సు వినియోగించుకున్నారు. వరుదు కల్యాణి మాటలు

మిగతా 8లో..

## ఏపీలో 5 జిల్లాలకు రెడ్ అలెర్ట్

**విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్ట్ 17, ప్రభాతవార్త**



దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరో 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశముందని, ఈ నెల 19న దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతం మధ్య తీరం దాటవచ్చని వాతావరణ కేంద్రం డైరెక్టర్ భారతి తెలిపారు. దీని ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. విశాఖ, అనకాపల్లి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణ, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు.

మిగతా 8లో..

## జోరువానలో లోతట్టు ప్రాంతాలలో ఎమ్మెల్యే వంశీకృష్ణ సుడిగాలి పర్యటన

**విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్ట్ 17, ప్రభాతవార్త**



నియోజకవర్గంలో వర్షం కారణంగాఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, కూటమి నేతలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన పూర్ణ మార్కెట్, వెలంపేట, రామకృష్ణ జంక్షన్, జనతా బజార్, స్టేడియం, టౌన్ కొత్త రోడ్, జ్ఞానాపురం పరిసర ప్రాంతాలలో సుడిగాలి పర్యటన జరిపారు. జోనల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించారు. జ్ఞానాపురంలో ఎర్రిగెడ్డ పరిస్థితిని స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక కూటమి నేతలు అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వివిధ వార్డులో ఉన్న కూటమి నాయకులకు, కార్యకర్తలను తెలిపారు. లోతట్టు, కొండవాలు, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్య ఎదుర్కొన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## ప్రాణాలు తీసిన ఈత సరదా..ఇద్దరు చిన్నారులు మృతి

**హుకుంపేట, ఆగస్టు 17, ప్రభాతవార్త**



హుకుంపేట మండలం మత్య పురం పంచాయతీ ఉప్ప దిగ ఊరు మరియు చెరుచింత గ్రామంలో ఇద్దరు చిన్నారులు ఈత సరదాకు దిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది ఆలస్యంగా అందిన వివరాలు ప్రకారం ఈ విధంగా ఉన్నాయి.



ఉప్ప ధిగవూరు, చెరుచింత గ్రామానికి చెందిన పాతుని నాగేంద్ర పాత్రుడు కుమారుడు లిఖిత్ పాత్రుడు (3) తామర్ల వెంకటేష్ కుమారుడు తామర్ల హర్షవర్ధన్(4) ఇద్దరూ తమ అంగన్వాడి కార్యాలయం సిబ్బంది పాడేరు మీటింగుకు హాజరు కావడంతో ఇద్దరు పిల్లలు తమ తల్లిదండ్రులతో పొలం పనుల దగ్గర వెళ్లారు. తీవ్ర వర్షాభావం కావడంతో పిల్లలు ఇద్దరినీ తమ ఇళ్లకు వెళ్ళమని కొంతవరకు పంపించి తమ తల్లిదండ్రులు పొలం పనులు నిమగ్నమయ్యారు. అయితే దారి మధ్యలో కొంతమంది స్నేహితులతో కలిసి గ్రామానికి సమీపాన గల నీటి కుంటలో ఈతకు దిగారు నీటి కుంట లోతు ఎక్కువగా

మిగతా 8లో..

# భారీ వర్షాలతో పారా హుషార్

### 24 గంటల్లో వాయుగుండంగా మారనున్న అల్పపీడనం అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

**విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్ట్ 17, ప్రభాతవార్త**



పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని కేంద్రీకృతమైన అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మంగళవారం మధ్యాహ్నానికి దక్షిణఒడిశా ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని, దీని ప్రభావంతో రెండు రోజులు కోస్తాలో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు తీరం వెంబడి ఈదురుగాలులు వీచే అవకాశం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నానికి దక్షిణ ఒడిశాఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని వెల్లడించారు. తీరం వెంబడి గంటకు 4050కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. బుధవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని సూచించారు. భారీవర్షాలు, బలమైన గాలులు నేపథ్యంలో ప్రజలు చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న రెండు రోజులు వాతావరణం క్రింది విధంగా ఉండనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. సోమవారం శ్రీకాకుళం,విజయనగరం, పార్వతీపురం మన్యం,అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మంగళవారం చెదురుమదురుగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు విశాఖ జిల్లా కాపులుప్పాడలో 144మిమీ, పరదేశీపాలెంలో 129మిమీ, మధురవాడలో 122మిమీ, ఆనందపురంలో 114మిమీ, శ్రీకాకుళం జిల్లా హరిపురంలో 113.5 మిమీ, విశాఖ జిల్లా శ్రీరామ్ నగర్ మరియు పెందుర్తిలో 111మిమీ చొప్పున అధిక వర్షపాతం నమోదైందన్నారు.

### రాబోయే రెండు మూడు రోజులు వర్షాల ప్రభావంతో ప్రజలందరూ

## అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు అందుబాటులో ఉండాలి
- రాష్ట్ర తెలుగుదేశం అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



**విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్ట్ 17, ప్రభాతవార్త**

రాష్ట్రవ్యాప్తంగా వాతావరణ శాఖ భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక శాసనసభ సభ్యులు పల్లా శ్రీనివాసరావు అధికార యంత్రాంగంపై పలు దిశానిర్దేశాలు జారీ చేశారు. "కొండవాలు, లోతట్టు ప్రాంతాలు, సముద్రతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జీవీఎంసీ సిబ్బంది, ఏపీ ఈపీడీసీఎల్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలి. ఎటువంటి కారణం చెప్పకుండా ప్రతి ప్రాంతంలో సకాలంలో స్పందించాలి." అని అన్నారు. గంగవరం, యారాడ, దిబ్బపాలెం పరిసర ప్రాంత ప్రజలు చేపల వేటకు వెళ్లకుండా ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని, సముద్రం పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నందున, చేపల వేటకు వెళ్లవద్దని స్పష్టం చేశారు. వర్షాల తీవ్రత పెరిగితే కలెక్టరేట్, రెవెన్యూ, పోలీస్, వైద్య, మున్సిపల్ శాఖలు సక్రమంగా సమన్వయం చేసుకుని పనిచేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూములు ఇప్పటికే ఏర్పాటు చేసినట్టు, ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినపుడు ప్రజలు వెంటనే సంబంధిత నంబర్లకు సంప్రదించాలని సూచిస్తూ వైద్య సేవలు కోసం 108, అగ్నిమాపక సేవల కోసం 101, పోలీస్ కంట్రోల్ రూమ్ కోసం 100, విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 నంబర్లుకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి శ్రేణులు ప్రజల పక్షాన నిలబడి సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలి. అధికారులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు" అని అన్నారు.

## అట్టహాసంగా మోడల్ పోలీస్‌కు భూమి పూజ.!

- డిజిపి, రాష్ట్ర హోం మంత్రి అనితలకు ఘన స్వాగతం..
- హెటిరో సంస్థకు అభినందనలు.. వారి సహాయం మరువలేనిది
- డిజిపి "గుప్తా " పోలీస్ స్టేషన్ అంటే ప్రజలదే: డిజిపి



నక్కపల్లి, ప్రభాతవార్త

8

### కూంబింగ్ బలగాలపై కాల్పులకు ప్రయత్నించిన

## మావోయిస్టు అరెస్ట్

- 303 తుపాకీ, 9ఎంఎం పుస్తోల్,సామాగ్రి స్వాదీనం
- జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్




**పాడేరు, ఆగస్ట్ 17, ప్రభాతవార్త**

అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ, చింతగుప్ప పరిసర ప్రాంతాల్లో శనివారం కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీస్ బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపేందుకు ప్రయత్నించి నఘటన ప్రదేశం నుండి తప్పించుకొని కొంతమంది మావోయిస్టులు పారి పోయే ప్రయత్నించగా అందులో ఒక మావోయిస్టును అదుపులోకి తీసుకుని ఆ మావోయిస్టు వద్ద లభ్యమైన ఆయుధాలను స్వాదీనం చేసుకున్నామని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ వెల్లడించారు.

మిగతా 8లో..




## ఏయూ ముగ్గురు పూర్వ రిజిస్ట్రార్‌లకు అరెస్టు వారెంట్

**విశాఖ క్రైమ్, ప్రభాతవార్త**

ఆంధ్ర విశ్వ కళాపరిషత్‌కు చెందిన ముగ్గురు పూర్వ రిజిస్ట్రార్ లకు అరెస్టు వారంటూ జారి అయింది. కోర్టు ఆదేశాలు ధిక్కరించినందుకు గాను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఆగస్టు 14 వ తేదీన అరెస్టు వారెంట్ జారీ చేశారు. సీనియర్ కౌన్సిల్ డి.వి. సీతా రామమూర్తి, అడ్వకేట్ ఎన్. అశ్విని కుమార్ వాదనలను పరిగణలోకి తీసుకున్న జస్టిస్ గన్నమనేని ఈ ఆదేశాలను వెలువరించారు. ఆంధ్ర విశ్వ కళా పరిషత్‌లో రిజిస్ట్రార్‌లుగా పనిచేసిన ఆచార్య వెలగపూడి ఉమా మహేశ్వరరావు, ఆచార్య కే. నిరంజన్, ఆచార్య వడ్డాది కృష్ణమోహన్ కోర్టుకు గైర్హాజరు కావడంతో న్యాయమూర్తి అరెస్ట్ వారెంట్ జారీ చేశారు.ఆంధ్రా యూనివర్సిటీ రంగస్థల

మిగతా 8లో..

Main tab page 8_Main tab page 8.qxd 8/18/2025 12:09 AM Page 1



## కూంబింగ్ బలగాలపై కాల్పులకు ప్రయత్నించిన మావోయిస్టు అరెస్ట్

**తరువాయిలు** ఆదివారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వివరాలను వెల్లడించారు. అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ, చింతగుప్ప పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపేందుకు ప్రయత్నించి అక్కడ నుండి తప్పించుకొని పారిపోయే ప్రయత్నంలో బలగాలు చాకచక్యంగా ఒక మావోయిస్టును అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్పీ తెలిపారు. పోలీస్ బలగాలు అదుపులోకి తీసుకున్న మావోయిస్టు ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా భాలియాపుట్టు గ్రామానికి చెందిన నైతో (అలియాస్ నరేష్,సంతు) గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. మావోయిస్టు నైతో (అలియాస్ నరేష్, సంతు) 2011 వ సంవత్సరంలో జననాట్య మండలి బృందంలో నరేష్ విప్లవాలకు ఆకర్షితుడై 15 సంవత్సరాల క్రితం మావోయిస్టు పార్టీ సభ్యత్వం పొందాడన్నారు. మావోయిస్టు దళంలో చేరి 2017 లో కట్ ఆఫ్ బోయిపరిగూడ మావోయిస్టు దళ కమెండర్ గా బాధ్యతలు చేపట్టిన నరేష్ ప్రస్తుతం డీసీఎం మెంబర్ మరియు పెదబయలు కోరుకొండ ఏరియా కమిటీ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టి మావోయిస్టు కార్యకలాపాలు చేస్తున్నాడని మావోయిస్టు నైతో 8 ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నాడని ఎస్పీ పేర్కొన్నారు. అదుపులో తీసుకున్న మావోయిస్టు నైతో వద్ద 9 ఎమ్ ఎమ్ పిస్టల్,9 ఎమ్ఎమ్ లైవ్ అమ్యునిషన్ 04, ,303 రైఫిల్ మ్యాగజైన్,01, 303 లైవ్ అమ్యునిషన్ 02 3 కిట్ బ్యాగులు,విప్లవ సాహిత్యాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ అమిత్ బర్దర్ తెలియజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మావోయిజం అనేది ఒక నిషేధిత సిద్ధాంతమని దానిని విడిచిపెట్టి మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోవాలని ఎస్పీ పిలుపు నిచ్చారు. స్వచ్ఛందంగా లొంగిపోయిన మావోయిస్టులపై ఎటువంటి కేసులు నమోదు చేయకుండా ప్రభుత్వ పునరావాసం కల్పించడం జరుగుతుందని ఎస్పీ హామీ ఇచ్చారు. ఎవరైనా మావోయిస్టులకు ఆశ్రయం ఇచ్చిన వారికి సహాయ సహకారాలు అందించిన వారిపై సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతున్నారని కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ అమిత్ బర్దర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో పాడేరు ఏఎస్పీ ఇన్ స్పెక్టర్ దీనబంధు పాల్గొన్నారు.జి.మాడుగుల మండలం కిల్లంకోట పరిసరాల్లో మావోయిస్టుల కదలికలు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు.కూంబింగ్ వెళుతున్న పోలీస్ బలగాలపై మావోయిస్టులు కాల్పులకు ప్రయత్నించగా వాటిని చాకచక్యంగా బలగాలు అప్రమత్తం వ్యవహరించి ఒక మావోయిస్టును ఆ అదుపులోకి తీసుకోవడంతో ఆయుధాలు పాటు తుపాకీలు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనకు పాల్పడిన మావోయిస్టులు ఎంతమంది ఉన్నారనే కోణంలో పోలీసు యంత్రాంగం ఆరా తీస్తోంది. కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న మళ్లీ మావోయిస్టుల కదలికలు ఈ ప్రాంతంలో కనిపిస్తుండటంతో పోలీస్ యంత్రాంగం లోనే కాకుండా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ కదనం ప్రకారం అరెస్ట్ అయిన మావోయిస్టు నైతో కిల్లంకోట ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు వచ్చే అవకాశాలు ఉన్న దృష్ట్యా కిల్లంకోట ప్రాంతంలో స్థానిక గిరిజనుల సహకారంతో మావోయిస్టుల సమావేశం నిర్వహించడానికి ముందస్తుగా గిరిజనుల సహకారం తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందని ఎస్పీ తెలిపారు.దీంతో కిల్లంకోట ప్రాంతాన్ని బలగాలు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.ఇదిలా ఉండగా పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు సొంత గ్రామం కిల్లంకోట కావడంపై పోలీసులు మరింత అప్రమత్తం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఏయూ ముగ్గురు పూర్వ రిజిస్ట్రార్లకు అరెస్టు వారెంట్





విభాగానికి చెందిన ముగ్గురు అధ్యాపకులు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. రంగస్థలం విభాగానికి చెందిన శాశ్వత అధ్యాపకులు అందరూ 1999లో ఉద్యోగ విరమణ చెందడంతో నాటి వైస్ చాన్సలర్ రొక్కం రాధాకృష్ణ, రిజిస్ట్రార్ ఆచార్య జె ఎం. నాయుడు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదంతో ముగ్గురు అధ్యాపకులను విధుల్లోకి తీసుకున్నారు. రంగస్థల విభాగంలో డాక్టరేట్లు చేసిన మల్లెల రాజేంద్రప్రసాద్, మరపట్ల భాస్కర రావు, మీగడ శశి భూషణ్ స్వామి విధుల్లోకి చేరారు. రంగస్థలం విభాగానికి శాశ్వత అధ్యాపకుల అవసరం ఉన్నప్పటికీ మీరు ముగ్గురిని రెగ్యులర్ చేయలేదు. అదే విధంగా స్కేల్ కూడా అమలు చేయలేదు. దీంతో 2011లో వీరు ముగ్గురు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. 2016 జనవరి ఏడో తేదీన బడ్జెట్ వేకెన్సీ లలో ఈ ముగ్గురిని రెగ్యులర్ చేయాలని ఏపీ హైకోర్టు తీర్పు వెలువరించింది. అప్పటి వైస్ చాన్సలర్ ఆచార్య జి. ఎస్. ఎన్. రాజు కోర్టు ఉత్తర్వులు త్వరిగతిన అమలు చేయమని ఆదేశించినప్పటికీ నాటి రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమా మహేశ్వరరావు ఈ విషయాన్ని పెద్దగా పరిగణలోకి తీసుకోలేదు. ఆరు నెలలు లోగా కోర్టు ఆదేశాలు అమలు చేయాల్సి ఉండగా ఫుల్ బెంచ్ ఆపిల్ కు వెళ్లారు. యూనివర్సిటీ వాదనలను ఫుల్ బెంచ్ పరిగణలోకి తీసుకోలేదు. ఆ తర్వాత వచ్చిన రిజిస్ట్రార్ ఆచార్య కే నిరంజన్ సుప్రీం కోర్టు ను ఆశ్రయించారు. హై కోర్టులో వాదనలు వినిపించుకోవాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అయినప్పటికీ ఆ తర్వాత వచ్చిన రిజిస్ట్రార్ లు ఆచార్య వడ్డాది కృష్ణమోహన్ తదితరులు అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేయడం యూనివర్సిటీ అలసత్వానికి నిదర్శనం. కోర్టు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తున్నప్పటికీ రిజిస్ట్రార్లు పట్టించుకోలేదు. ఉద్దేశ్య పూర్వకంగానే వీరు జాప్యం చేస్తున్నారని కోర్టు భావించి ఆగస్టు 14 వ తేదీన ప్రస్తుత, ముగ్గురు పూర్వ రిజిస్ట్రార్ లు అందరూ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని జూలై 24 న ఆదేశాలు ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుత రిజిస్ట్రారు ఆచార్య ఈ.ఎన్. ధనుంజయరావు హాజరయ్యారు. కోర్టుకు గైర్హాజరైన ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు, ఆచార్య కే. నిరంజన్, ఆచార్య వడ్డాది కృష్ణమోహన్ పట్ల న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కోర్టు పట్ల నిర్లక్ష్యం తగదని పేర్కొని వారికి అరెస్టు వారెంట్ జారీ చేశారు. నూరేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వ కళా పరిషత్ కళల విభాగాన్ని చిన్న చూపు చూడడంతో వ్యవహారం అరెస్టుల వరకు వెళ్ళింది.

## చంద్రబాబుని విమర్శించే అర్హత వరదు కళ్యాణానికి లేదు


వెనక్కి తీసుకోవాలి లేని పక్షంలోమా కూటమి ప్రభుత్వానికి, సీఎం కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గణగళ్ళ సత్యవతి మాట్లాడుతూ మహిళలకు పథకాలు ఇచ్చింది తెచ్చింది టిడిపి అని గర్వంగా చెప్పుకుంటాం అని అన్నారు. మహిళలు పై దాడులు చేసింది వైసిపి ప్రభుత్వం, ఈ రోజు విమర్శలు చేస్తున్న వైసిపి మహిళలు కాస్త వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి అని అన్నారు. దక్షిణ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కేదారి లక్ష్మీ మాట్లాడుతూ వరుదు కళ్యాణి విమర్శలు చేసే ముందే కాస్త అవగాహన తెచ్చుకోవాలి అని హితవు పలికారు. ఉచిత బస్సు పథకం కోసం నోటికి వచ్చినట్టు మాట్లాడుతోంది. చంద్రబాబు ను విమర్శించే అర్హత వరుదు కల్యాణికి లేదని, మహిళలకు అన్యాయం చేసింది వైసీపీ పార్టీ, కల్తీ మద్యం తెచ్చింది తాళి బొట్లు తెంచింది వైసీపీనే అని పేర్కొన్నారు. సమావేశంలో తెలుగు మహిళలు గొలగాని సౌజన్య, రామలక్ష్మీ పాల్గొన్నారు.

## ప్రాణాలు తీసని ఈత సరదా..ఇద్దరు చిన్నారులు మృతి

ఉండడంతో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈ విషయం తెలియక తల్లిదండ్రులు గ్రామంలో అన్ని వీధులను వెతకశాగారు సాయంత్రం 4 గంటల వరకు పిల్లల ఆచూకీ తెలియలేదు.అయితే తమ ఇంటికి సమీపాన ఉన్న నీటి కుంట గుర్తుకు వచ్చి అక్కడ వెళ్లిచూడగా అక్కడ పిల్లలు మిగతాజీవులై కనిపించారు. వెంటనే సమాచారం అందించి మృతదేహాలు బయటికి తీసి హుటాహుటిన సమీపానగల ఉప్ప ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చిన్నారులు మృతి చెందారని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. మృతి చెందిన విషయం తెలిసిన గ్రామం తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయింది.

## మోంట్ అబూ పర్వతంపై మారథాన్‌లో
## రన్నరప్‌గా నిలిచిన దాట్ల రామరాజు

**విశాఖపట్నం ప్రతినిధి, ఆగస్ట్ 17, ప్రభాతవార్త**




"విశ్వ సహోదరత్వం కోసం పరుగు" అనే నేపథ్యంతో అందరి మధ్య ఐక్యత మరియు సమగ్రత సందేశాన్ని వ్యాప్తి చేయడం కోసం బ్రహ్మ కుమారీస్, మోంట్ అబూ రాజస్థాన్ లో ఆదివారం నిర్వహించిన 7వ ఖిదాదీ ప్రకాషమని మోంట్ అబూ ఇంటర్నేషనల్ హాఫ్ మారథాన్‌ఖి లో పట్టణానికి చెందిన దాట్ల రామరాజు 2వ రన్నరప్ గా నిలిచారు. ఇది ప్రపంచంలోనే ప్రత్యేకమైన పరుగుగా రామరాజు అభివర్ణించారు. 3 ఎమ్ రిట్రీట్ మైండ్, మెడిటేషన్, మారథాన్ (3ఎం) మానసిక స్థితిస్థాపకత, స్పష్టత , శ్రేయస్సు ను పరుగులో నైపుణ్యం పెంచడానికి శిక్షణ ఇస్తారని చెప్పారు. విశాఖపట్నం రైల్వే న్యూ కాలనీ బ్రహ్మ కుమారీస్ ప్రత్యేక ఆహ్వానంతో లొల్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు, ట్రై అథ్లెట్ ఆర్మీ రామరాజు దాట్ల పాల్గొన్నారు. 900 మీటర్ల ఎత్తులో ఉన్న అబూ పర్వతం పైకి 21.1 కి.మీ పరుగు చాలా కఠినంతో కూడుకున్నదని, కేవలం 1 గం" 43 ని" లో సాహసోపేతంగా పూర్తి చేసి 2వ రన్నరప్ గా నిలిచినట్లు తెలిపారు. ప్రశంసా పత్రం, ట్రోఫీ, 51000/ నగదు బహుమతిగా గెలుచుకుని ఆ సంస్థ ప్రతినిధులతో ప్రశంసలు అందుకున్నట్లు చెప్పారు.

## అట్టహాసంగా నక్కపల్లిలో మోడల్ పోలీస్‌కు భూమి పూజ.!

- డిజిపి, రాష్ట్ర హోం మంత్రి అనితలకు ఘన స్వాగతం..
- హెటిరో సంస్థకు అభినందనలు.. వారి సహాయం మరువలేనిది
- డిజిపి "గుప్తా " పోలీస్ స్టేషన్ అంటే ప్రజలదే: డిజిపి

**నక్కపల్లి, ప్రభాతవార్త**



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని నక్కపల్లి లో మోడల్ పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం అట్టహాసంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చేతులు మీదుగా ఆదివారం నిర్వహించారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి వచ్చిన హోం మంత్రి వంగలపూడి అనిత డిజిపి హరీష్ కుమార్ గుప్తా డిఐజి గోపీనాథ్ జెట్టి లకు ఎస్పి తుహిన్ సింహా ఆధ్వర్యంలో డిఎస్ పి పోతిరెడ్డి శ్రీనివాస్ సీఐ లు కే. కుమార్ స్వామి, జి అప్పన్న, లద్దు రామకృష్ణ ,ఎస్సై సన్ని బాబు, ట్రైన్ ఎస్సై సాహిబా అంజుమ్ లు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా శంకుస్థాపన చేసి డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఎన్డియే ప్రభుత్వంలో పోలీసు శాఖకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గంజాయి నిర్మూలన కోసం ఈగిల్ వ్యవస్థ ను ప్రవేశపెట్టి ఉక్కుపాదం మోపుతున్నామని పేర్కొన్నారు. సీఎస్ఆర్ నిధుల కింద ..2.5 కోట్లు కేటాయించిన హెటిరో సంస్థ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి నిధులు హెచ్చించడం నక్కపల్లి ప్రజలు అదృష్టమని అన్నారు. పారిశ్రామిక ఈ ప్రాంతం భవిష్యత్తులో ఊహించని స్థానానికి చేరుకోబోతుందని అన్నారు. వచ్చే నెల రోజుల్లోనే పోలీసు విభాగానికి కొత్త వాహనాలు అందజేస్తామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున సుమారు 60000 సీసీటీవీ కెమేరాల ఏర్పాటు జరుగుతోందని వివరించారు. మహిళలకు భద్రత, భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. పోలీస్ శాఖలో కూడా వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను సమర్థవంతంగా ఉపయోగిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో రెండో స్థానంలో ఉందని, ఈ స్థానాన్ని మరింత మెరుగుపరచాలని కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడు కూడా మొదటి స్థానంలో ఉండాలని చెబుతుంటారని ఏ వ్యవస్థ అయినా క్షుణ్ణంగా పరిశీలనతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని సూచిస్తుంటారని అన్నారు ఈ సమావేశంలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ హెటెరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా రూ.2.5 కోట్ల వ్యయంతో ఈ భవనం నిర్మించేందుకు ముందుకు రావడం శుభపరిణామని వారి సేవలు అమోఘమని అన్నారు. ఈ మోడల్ పోలీస్ స్టేషన్ ప్రజల పోలీస్ స్టేషన్ అని 9 నెలల్లో పూర్తి చేయడం జరుగుతుందని మళ్లీ ఈ పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి నక్కపల్లి కి వస్తానని హరీష్ కుమార్ గుప్తా చెప్పారు నూతన పోలీస్ స్టేషన్ ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యంగా, వేగవంతమైన సేవలను అందించే లక్ష్యంతో నిర్మించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, నర్సీపట్నం డిఎస్పీ పి.శ్రీనివాసరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ ఎం.శ్రావణి, హెటెరో కంపెనీ ప్రతినిధులు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కుల్లాయి రెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మూర్తి, సి.ఎస్.ఆర్ ఎగ్జిక్యూటీవ్ శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, టిడిపి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ, పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, కూటమి ప్రజా ప్రతినిధులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, అమలకంటి అబద్ధం, గుర్రం రామకృష్ణ, వినోద్ రాజు, కోసూరు శ్రీనివాసరావు, వేలగా శ్రీనివాసరావు, వైబోయిన వెంకటరమణ, అయినంపూడి అప్పలరాజు, పట్టణ అధ్యక్షులు అద్దూరి లోవరాజు, నానేపల్లి రాఘవులు, గుణగాల రామకృష్ణ, ఎండిఓ దెందుకూరు సీతారామరాజు , తాసిల్దార్ ఆర్. నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రిగెడ్డలో వ్యర్థాలను నిరంతరం వెలికి తీయండి

- వర్షాల కారణంగా వస్తున్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించండి: జీవీఎంసీ కమిషనర్

**విశాఖపట్నం, ఆగస్టు 17 ప్రభాతవార్త**



విశాఖ నగరంలో విపరీతంగా వర్షాలు కురుస్తున్న సందర్భంగా ఎర్రిగెడ్డ లో వ్యర్థాలు ఎక్కువగా చేరుతాయని వెంటనే వాటిని తొలగించేలా నిరంతరం వెలికితేత పనులు చేపట్టాలని , నగరంలో వర్షాల కారణంగా ఏర్పడుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆదివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల సిటీ ఆపరేషన్స్ సెంటర్‌ను, అలాగే ఎర్రిగెడ్డ లో వ్యర్థాలను వెలికి తీసే పనులను స్వయంగా పరిశీలించారు. విశాఖ నగరంలో నిరంతరం కురుస్తున్న వర్షాలు కారణంగా కొండవాలు ,లోతట్టు ,మురికివాడ ప్రాంతాల్లో, పలు కాలనీలలో ఏర్పడుతున్న సమస్యలపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల సిటీ ఆపరేషన్స్ సెంటర్ నందు స్వయంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నిర్వాహకులను ఆరా తీశారు. వర్షాల కారణంగా 41 ప్రజా ఫిర్యాదులు సిటీ ఆపరేషన్ సెంటర్ కి అందగా వాటిని సంబంధిత జోనల్ అధికారులకు సమాచారం అందించామని, ఇప్పటికే 37 ఫిర్యాదుల యొక్క సమస్యలను పరిష్కరించడం జరిగిందని , అందులో ముఖ్యంగా పలుచోట్ల చెట్లు విరిగిపడినవి, కాలువల్లో అడ్డంకులు ఏర్పడి నీరు నిలువ ఉన్నవి, భూగర్భ మురుగు నీటి కాలువ పొంగి పొర్లినవి, తదితర సమస్యలు పై ఫిర్యాదులు ఉన్నాయన్నారు. నిరంతరం ప్రజా ఫిర్యాదులను గమనిస్తూ సంబంధిత అధికారులకు సమాచారం అందించి వెంటనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని, అలాగే అందరు జోనల్ కమిషనర్లు, అధికారులు, ఉద్యోగులు వర్షాలు కారణంగా చేపట్టవలసిన విధులపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం జోన్ 5లో గల 41 వార్డులో నున్న ఎర్రిగెడ్డ లో వర్షాలకు అధికంగా వస్తున్న వ్యర్థాలను నిశ్రీ 200, నిశ్రీ 70, జెసిబి యంత్రాలతో వెలికి తీస్తున్న పనులను స్వయంగా పరిశీలించారు. ఎర్రిగెడ్డలో ఉన్న మూడు స్క్రీన్ ల పనితీరును పరిశీలించి స్క్రీన్ల మధ్య ఎక్కువగా ఖాళీలు ఉన్నందున వాటి మధ్య ఎం.ఎస్. స్క్రీన్ లను ఏర్పాటు చేయాలని, యంత్రాల పనివేళలను అడిగి తెలుసుకుని వర్షాల కారణంగా అధికంగా వ్యర్థాలు వస్తాయని అందుకు సిద్ధంగా సంబంధిత సిబ్బంది, యంత్రాలు నిరంతరం విధులు నిర్వహించాలని పర్యవేక్షక ఇంజనీర్ సంపత్ కుమార్ కు ఆదేశించారు. నిరంతరం వ్యర్థాలను వెలికి తీసే యంత్రాలు, సిబ్బంది నిర్విరామంగా విధులు నిర్వహిస్తున్నారని, వెలికి తీసిన వ్యర్థాలను ఏ రోజుకు ఆ రోజు 5 ట్రిప్పర్ల ద్వారా తరలించే ప్రక్రియ నిత్యం జరుగుతుందని, వర్షాలు కారణంగా చెట్లు కొమ్మలు, దుంగలు, అధిక సంఖ్యలో వస్త్రాలు గెడ్డ లోనికి వస్తున్నాయని తదితర వ్యర్థాలను అడ్డంకులు లేకుండా వెంటనే వెలికి తీసే చర్యలు చేపడుతున్నామని కమిషనర్ కు ఉప కార్యనిర్వాహక ఇంజనీరు భరణి కుమార్ కమిషనర్ కు తెలిపారు. ఎర్రిగెడ్డ పొంగిపొర్లకుండా వ్యర్థాలను వెలికితీతకు ఏర్పాటుచేసిన మూడు స్క్రీన్లు సక్రమంగా పని చేసేలా గుత్తేదారునకు ఆదేశాలు జారీ చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ కు కమిషనర్ ఆదేశించారు. వర్షాలు కారణంగా అన్ని ప్రాంతాల్లో ఏర్పడుతున్న సమస్యలపై స్పందించి ఇప్పటికే అధికారులు అన్ని ప్రదేశాల్లో పర్యవేక్షిస్తూ సమస్యలు పరిష్కార దిశగా చర్యలు చేపట్టడం జరుగుతున్నదని కమిషనర్ తెలిపారు. పలు ప్రాంతాల్లో ఏర్పడిన సమస్యలపై సిటీ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై వెంటనే పరిష్కార మార్గాలకు చర్యలు చేపట్టాలని అన్ని జోనల్ అధికారులకు ఆదేశించడం జరిగిందని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు. జీవీఎంసీ యంత్రాంగం ప్రజలకు అందించే సేవలలో నిమగ్నమైఉందని,ముఖ్యంగా లోతట్టు ,కొండవాలు, మురికివాడాల ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురి కావద్దని కమిషనర్ ప్రజలకు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్ పద్మావతి,అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, ఎమినిటీస్ కార్యదర్శి గౌతమ్, గుత్తేదారు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విశాలాక్షి నగర్‌లో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మీ పర్యటన

**ఆరిలోవ, ఆగస్టు 17, ప్రభాతవార్త**



రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక తొమ్మిదో వార్డ్ విశాలాక్షి నగర్ లో ఆదివారం జోన్ 2 జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పర్యటించారు. ప్రజల నుండి సమస్యలు తెలుసుకున్నారు. ఓ అపార్ట్మెంట్ ముందునా కాల్వ పూర్తిగా కప్పి ఉండడం గమనించిన ఆమె అపార్ట్మెంట్ యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా శానిటరీ సిబ్బంది అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ తో పాటు వార్డ్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం. చిన్నాజీ రావు, శానిటరీ సూపర్వైజర్ శ్రీనివాసరాజు సిబ్బంది పాల్గొన్నారు.

## పొంగిప్రవహిస్తున్న గోస్తనీ నది
## పాండ్రంగి గ్రామానికి రాకపోకలు బంద్

**పద్మనాభం, ఆగస్టు 17, ప్రభాతవార్త**

గత మూడు రోజులు నుండి కురుస్తున్న బారి వర్షాల వల్ల గోస్తనీ నది పొంగిప్రవహిస్తుంది. దీంతో పాండ్రంగి గ్రామం వద్ద గోస్తనీ నదిలో ఉన్న కాజువేపై నుండి రాకపోకలను మండల తహశీల్దారు కె. ఆనందరావు నిలిపివేసారు. అలాగే నది వద్ద హెచ్చరిక బోర్డులను, పోలీసు పికెట్లను ఏర్పాటు చేసారు. అయితే ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలు వల్ల నదికి నీరు ఉదృతి పెరుగింది.

## సత్యసాయిబాబా ఆధ్యాత్మిక సేవా కేంద్రం శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

**మాధవధార, ఆగస్టు 17, ప్రభాతవార్త**



మురళినగర్ వాటర్ ట్యాంక్ రోడ్డులో సత్యసాయిబాబా ఆధ్యాత్మిక సేవా కేంద్రం నిర్మాణం కొరకు సత్య సాయి సేవా కేంద్రం సభ్యులు ఆదివారం శంకుస్థాపన చేపట్టారు.కార్యక్రమంలో నార్త్ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు,50వ వార్డు టీడీపీ అధ్యక్షులు సనపల వరప్రసాద్ పాల్గొని వారి చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు.ఈ సేవా కేంద్రం నిర్మాణం నిమిత్తం ఎటువంటి సహాయ సహకారాలైన అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావంతో మెలగాలని ఎమ్మెల్యే సూచించారు.మురళి నగర్ సత్యసాయి సేవా కేంద్రం వారు నిర్వహించే అనేక సేవా కార్యక్రమాలు చుట్టుపక్కల గ్రామాల వారికి ఎంతో లబ్ధి చేకూరుతుందని, ఆధ్యాత్మికతతో కూడిన సేవ మాత్రమే నిజమైన సేవ అని వరప్రసాద్ అన్నారు.కార్యక్రమంలో 50 వ వార్డు జనసేన, బిజెపి పార్టీ సభ్యులు,మాధవధార మరియు మురళి నగర్ గ్రామ పెద్దలు,భగవాన్ శ్రీ సత్య సాయి బాబా భక్తులు పాల్గొన్నారు.

## చెరువులు తలపిస్తున్న సింహాచలం బిఆర్‌టిఎస్ రోడ్డు

**సింహాచలం, ఆగష్టు 17, ప్రభాతవార్త**

ఆదివారం కురిసిన భారీ వర్షాలు కి సింహాచలం బి ఆర్ టి ఎస్రోడ్లు జలమయం అయ్యాయి. పైడితల్లి అమ్మవారి ఆలయం దగ్గర, గోశాల ప్రాంతం రోడ్లు రోడ్లు గెడ్డలు తలపించాయి. సుమారు మూడు అడుగులు నీరు రోడ్ పై నిలిచిపోవడం తో వాహనందార్లు ఇబ్బంది గురియ్యారు. ప్రధానంగా కాలవలు గెడ్డలు ఆక్రమణ గురి కావడం తో కలవాలు అన్ని చిన్నబోయ్యి దీనితో భారీ వర్షాలు కి కలవాలు పొంగి రహదారులు పై నీరు చేరుకుపోయంది. కార్పొరేటర్ పి. వి. నరసింహం ఘటన స్థలానికి. చేరికొని హట హుటున జీవీఎంసీ సిబ్బంది తో మరమ్మతులు చేయంచి సమస్య పరిష్కరించారు. ఇదేవిధంగా భారీ వర్షాలు కురిషినట్లు అయితే క్రింద వాళ్ళ ప్రాంతాల్లో ఇంటిలోకి చొరబడటం కాయం అని స్థానికులు వాపోతున్నారు. ఇప్పడికయన అధికారులు స్పందించి ఆక్రమణ గురయన గెడ్డలు తొలగించాలి అని స్థానికులు కోరుకుంటున్నారు.

## క్యాన్సర్‌పై పోరాటం

- క్యాన్సర్ నిరోధానికి ముందస్తు వ్యాక్సిన్ - 200 మందికి పైగా ఉచిత వ్యాక్సిన్
- దిగుమర్తి ఫౌండేషన్ మానవ సేవ ట్రస్టు ద్వారా పంపిణీ
- హోమి బాబా మాజీ డైరెక్టర్ దిగుమర్తి రఘునాథరావు పర్యవేక్షణలో టీకాలు
- ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్

**విశాఖపట్నం, ఆగస్టు 17, ప్రభాతవార్త**




క్యాన్సర్ మహమ్మారిని అరికట్టేందుకు నిరంతర ప్రయత్నాలు జరుగుతు న్నాయి. అయినప్పటికీ పలువురు ఈ వ్యాధి బారిన పడి మరణిస్తూనే ఉన్నారు. ఈ వ్యాధిని అరికట్టి, మరణాలను తగ్గించేందుకు అమెరికాకు చెందిన ద్వివేదుల నర్సింహ శాస్త్రి నిర్వహిస్తున్న మానవ సేవ ట్రస్టు, దిగుమర్తి ఫౌండేషన్ ముందుకు వచ్చాయి. స్థానిక కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో ఆదివారం హోమిబాబా క్యాన్సర్ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ దిగుమర్తి రఘునాథరావు, ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను చేపట్టిన నాటేరి కాళిదాసు భానుమతి, సుమారు 200 మంది పిల్లలకు క్యాన్సర్ వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రకృతి ప్రసాదించిన ఆహార పదార్థాలను తీసుకోవడం వలన క్యాన్సర్ దరిచేరదని అన్నారు. అలాగే క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు మన పూర్వీకులు అనుసరించిన విధానాలను కొనసాగించాలని హితవు పలికారు. అనంతరం డాక్టర్ రఘునాథరావు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి దరిచేరకుండా ఉండేందుకు ప్రైమరీ ప్రివెన్షన్ వ్యాక్సిన్ ఇస్తున్నామని తెలిపారు. 9 నుంచి 14 సంవత్సరాల వయసు కలిగిన వారికి ఆరు నెలల వ్యవధిలో రెండు డోసులు వ్యాక్సిన్ ఇస్తామని చెప్పారు. అలాగే 15 నుంచి 21 సంవత్సరాల నుంచి వయసు కలిగిన వారికి మూడు డోసులు ఇస్తామన్నారు. గతంలో ఈ వ్యాక్సిన్ విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవారుమని, ఇప్పుడు ఈ వ్యాక్సిన్ మన దేశంలోనే అందుబాటులో ఉందని తెలియజేశారు. ఇప్పుడు వరకు తాము ఐదు వేల మందికి ఈ వ్యాక్సిన్ పంపిణీ చేశామని రఘునాథరావు వివరించారు. ఈ ఖిహ్యూమన్ పేపిలోమా వైరస్ వ్యాక్సిన్‌ఖి ఆరు రకాల క్యాన్సర్లను నిరోధించగలుగుతుందని ఆయన తెలియజేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వారు క్యాన్సర్ బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ఎనిమిది గ్రామాలలో ఈ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం పూర్తి చేసామని ఆయన తెలిపారు. వివాహం తరువాత కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని వారికి స్క్రీనింగ్ టెస్ట్ ముందుగా నిర్వహిస్తున్నామని రఘునాథరావు వెల్లడించారు. దీనివలన క్యాన్సర్ ను ప్రాథమిక దశలోనే గుర్తించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.గ్రామీణ ప్రాంతాలలో ప్రతి లక్ష మందిలో 35 నుంచి 65 మంది ఈ వ్యాధికి గురవుతున్నారని, పట్టణ ప్రాంతాలలో ప్రతి లక్ష జనాభాలో 135 నుంచి 175 మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి నిర్వహణ సారధ్యం వహించిన నాటేరి కాళిదాసు మాట్లాడుతూ గతంలో షీలా నగర్, ధర్మారాయుడుపేట, అప్పాపురం, పోర్లుపాలెం, ప్రాంతాలకు చెందిన చెందిన 180 మందికి ఈ వ్యాక్సిన్ అందజేశామని తెలిపారు. గతంలో ఈ వ్యాక్సిన్ ప్రతీ డోసు ఖరీదు 3000 ఉండేదని ఇప్పుడు అది 1200 రూపాయలకు లభిస్తోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డిపాలెం, గాజువాక, షీలా నగర్, వెంకటేశ్వర కాలనీకి చెందిన సుమారు 200 మంది బాలికలకి ఈ వ్యాక్సిన్ ఇచ్చామని కాళిదాసు వివరించారు. ఈ క్యాన్సర్ నిరోధక ముందస్తు వ్యాక్సిన్ గురించి రాష్ట్రమంతా తెలియజేయటానికి ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించనున్నామని కాళిదాసు తెలిపారు.

## వైభవంగా శ్రీ శ్రీ శ్రీ సత్తెమ్మ తల్లి మహోత్సవం

**గాజువాక, ఆగస్టు 17, ప్రభాతవార్త**



గాజువాక రాజీవ్ మార్గంలో వైభవంగా జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ సత్తమ్మ తల్లి పండుగ మహోత్సవంలో ఆదివారం రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సత్తెమ్మ తల్లి ఆశీస్సులు నియోజకవర్గం ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షిస్తూ కమిటీ సభ్యులందరిని అభినందించారు. గుడికి సంబంధించి ఏం అవసరం ఉన్నా తన దృష్టి కి తేవాలని అన్నీ విధాలుగా అండగా ఉంటానని కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులతో పాటు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పదవులు...హోదాలు తాత్కాలికం...వారికి చెసిన సేవయే శాశ్వతం

- కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

**గాజువాక,ఆగష్టు 17,ప్రభాతవార్త**



చేపట్టిన పదవులు..హోదాలు తాత్కాలికం...ప్రజలకు చెసిన సేవలే శాశ్వతం అని జీవీఎంసీ 69వ వార్డ్ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం వార్త ప్రతినిధి తో మాట్లాడుతూ కౌన్సిలర్ గా 69వ వార్డు కార్పొరేటర్‌గా గెలిచి సుధీర్ఘకాలంగా వార్డ్ ప్రజలకు అనేక సేవలు అందించానని అన్నారు. కొన్ని కోట్ల రూపాయల నిధులతో అనేక అభివృద్ధి,సంక్షేమ, ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలు చేపట్టామని అయితే చిన్నాచితక పనులుతప్ప చేసిన పనులు అన్నీ సంతృప్తినిచ్చాయని,వార్డ్ ప్రజలు కూడా సంతృప్తిగాఉన్నారనిఅన్నారు. దీర్ఘ కాలంగా ఉన్న ప్రధాన సమస్య అయిన తుంగ్లాంప్రజలకు నేరుగా ప్రధాన రహదారి ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతున్న విషయం కొంతబాధాకరం గా ఉన్న మిగిలిన విషయంలో తాను అహర్నిశలు కష్టబడి వార్డ్ ను అభివృద్ధి పథంలో నిలిపామని అన్నారు. ఇది స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో అధికారుల సహకారం వార్డ్ ప్రజల దీవెనలతో సాధ్యమైందన్నారు. అన్నింటి కన్నా హరిజన జగ్గయ్యపాలెం" గ్రామ ప్రజలు ఎంతటి వరదలు, వానలు, తుఫాను వచ్చినా ఏ ప్రభుత్వ అధికారి సహాయం కోసం ఎదురు చూడకుండా హాయిగా జీవనం సాగిస్తున్నారు. ఇది తనకు ఎంతో ఆనందంగా ఉందని వార్డ్ ప్రజల ఆశీస్సులతో వార్డును ఆదర్శ వార్డ్‌గా తీర్చి దిద్దేందుకు మరింత కృషి చేస్తానని కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, JANIPELLI SIRISHA D/O BALARAJU, previously called JANIPELLA SIREESHA R/O 1-211, GATTUVARIPETA, KOMARAGIRI, I.POLAVARAM, DR.BR AMBEDKAR KONASEEMA, now changed my name from JANIPELLA SIREESHA to JANIPELLI SIRISHA. Henceforth I will be called as JANIPELLI SIRISHA for all purposes.
(Ro.18915)

★ I, SEEKOTI SOWJANYA W/O SEEKOTI GANGABABU previously called SIKOTI SOWJANYA R/O 3-146/2, CHANDRAMPALEM, SAMARLAKOTA, KAKINADA, now changed my name from SIKOTI SOWJANYA to SEEKOTI SOWJANYA. Henceforth I will be called as SEEKOTI SOWJANYA for all purposes.
(Ro.No.19066)

★ I, SEEKOTI GANGABABU S/O SEEKOTI MADHAVASWAMI, previously called SIKOTI GANGABABU R/O 3-146/2, CHANDRAMPALEM, SAMARLAKOTA, KAKINADA, now changed my name from SIKOTI GANGABABU to SEEKOTI GANGABABU. Henceforth I will be called as SEEKOTI GANGABABU for all purposes.
(Ro.No.19067)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

Main tab page 62_Main tab page 62.qxd 8/18/2025 12:10 AM Page 1






## నేడు విద్యా సంస్థలకు సెలవు

### - జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్



**పాడేరు, ఆగస్టు 17, ప్రభాతవార్త**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాల కురుస్తున్న భారీ వర్షాల సందర్భంగా అన్ని విద్యాసంస్థలకు ఈ నెల 18వ తేదీన (సోమవారం) ఒకరోజు సెలవు ప్రకటించామని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, ప్రైవేట్ విద్యా సంస్థలు ఒకరోజు పాఠశాలలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యాశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అల్పపీఠం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## అధికారు నిర్లక్ష్యంపై మండిపడ్డ ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను

**రంపచోడవరం, ఆగస్టు 17, ప్రభాతవార్త**



అక్రమ కట్టడాల కూల్చివేత పై అధికారుల చిత్తశుద్ధి మసక బారిపోయిందని, దీని మూలాన ఇప్పటికే తొలగించిన అక్రమ కట్టడాలను మళ్లీ అక్రమాలు చేపడుతున్నారని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అధికారులపై మండిపడ్డారు. ఆదివారం నాడు ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ స్థాయి కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారుల యొక్క నిర్లక్ష్య ధోరణి వలన అక్రమ కట్టడదారులు విచ్చలవిడిగా మళ్లీ అక్రమ కట్టడాలు నిర్మాణాలు మొదలుపెట్టారని, " అక్రమ కట్టడాలు తొలగింపు ఆగలేదు అని అన్నారు. అధికారులు ఆక్రమణలు తొలగింపు పై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి అధికారులు పట్టించుకోవడంలేదని అక్రమ కట్టడాలు మళ్లీ పునర్నిర్మాణం చేయటానికి ప్రోత్సహిస్తున్నారని ఇదే విషయాన్ని గతంలో రంపచోడవరం ప్రాజెక్టు అధికారి వారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకుంటామని చెప్పి కూడా ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ప్రజా గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసిన కూడా ఉన్నత అధికారులు వాటిపై దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోకపోతే ఇక కిందిస్థాయి అధికారులు ఎందుకు పట్టించుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహిస్తున్న స్థానిక అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులే ఏజెన్సీలో చట్టాలను పటిష్టంగా అమలు చేయకుండా అక్రమ కట్టడాలను చూసి చూడనట్లు వదిలేస్తుంటే ఇక ఏజెన్సీ చట్టాలు ఎలా అమలైతాయని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ లోని రాత్రికి రాత్రి అక్రమ కట్టడాలను నిర్మిస్తున్న ఉన్నా అది స్థానిక అధికారులకు తెలుసిన గాని పట్టించుకోవటం లేదని ఇదే వ్యక్తి అక్రమ కట్టడాలలో భాగంగా సగం కూల్చివేసిన బిల్డింగును 40 లక్షలకు కొనుక్కొని యుద్ధ ప్రాతిపదికన అక్రమ నిర్మాణం కొనసాగిస్తున్నాడని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చొడి ప్రదీప్ కుమార్ దొర, డివిజన్ కోఆర్డినేటర్ పీట ప్రసాద్, నాయకులు కంగారు అబ్బాయి దొర, చొడి ఏడుకొండలు రావు దొర ప్రసాద్ దొర తదితరులు పాల్గొన్నారు.

## భారీగా మద్యం పట్టివేత.. నలుగురి అరెస్ట్

### - ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ

**చింతపల్లి, ఆగస్టు 15, ప్రభాతవార్త**



అక్రమ మద్యం వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగంగా అనకాపల్లి మరియు అల్లూరి సీతారామరాజు ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ శాఖ అధికారులు భారీ స్థాయిలో నాటు సారాయి మరియు మద్యాన్ని పట్టుకున్నామని చింతపల్లి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బి .జగదీశ్వర్ రావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫ్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మహేష్, అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరిండెంట్ సురేష్ ఆదేశాల మేరకు ముందస్తు సమాచారంతో మండలంలోని కోరుకొండ గ్రామంలో దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో అక్రమంగా నిలువ ఉంచిన ఒడిస్సా రాష్ట్రానికి చెందిన 409 లీటర్ల నాటు సారాయి, ఒడిస్సా రాష్ట్రమద్యం 6.12 లీటర్లు, బీరు సీసాలు 34.45 లీటర్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహత్యం 24.3 లీటర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ అక్రమ నిల్వ కార్యక్రమాల్లో పాలుపంచుకున్న కోరుకొండ గ్రామానికి చెందిన వారరాజు, ఉర్ల సూరిబాబు, షేక్ మొహమ్మద్ రఫీ, వల్లంగి రమణబాబు లను అరెస్టు చేశామన్నారు. అలాగే ఒరిస్సా రాష్ట్రం జనతాబై గ్రామానికి చెందిన రాజేష్ కుమార్ సింగ్ అలియాస్ శివ ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా గుర్తించడం జరిగిందన్నారు. అతన్ని కూడా త్వరలో అరెస్టు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అక్రమ మద్య సమాచారాన్ని సమీప ఎక్సైజ్ అధికారులకు అందజేయాలని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడుల్లో సబ్ ఇన్స్పెక్టర్లు గిరిబాబు, వీర్రాజు, కానిస్టేబుల్ రమేష్ సంతోష్ లు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి అప్రోచ్ రోడ్డుకు గండి

**చింతపల్లి, ఆగస్టు 17, ప్రభాతవార్త**



తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని చాలా ప్రాంతాలు నీట మునిగాయి. వర్షం ప్రభావంతో కాలువల నీరు పొంగిపొర్లడంతో మండలంలోని రాజుపాకల గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణంలో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణంలో ని అప్రోచ్ రోడ్డుకు గండి పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే మడిగుంట గ్రామంలోని పంట పొలాలన్నీ నీట మునిగాయి. రాజుపాకలు అప్రోచ్ రోడ్డుకు గండిపడడంతో నర్సీపట్నం నుండి చింతపల్లి, గూడెం కొత్త వీధి, సీలేరు వంటి గ్రామాలకు రవాణా స్తంభించింది. సుమారు 11 గంటల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అల్పపీడన ప్రభావంతో సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.



## కంట్రోల్ రూమ్ ఏర్పాటు లోతుట్టు ప్రాంతాల

# ప్రజలకు అప్రమత్తం చేయాలి

### - ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టండి: జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్



**పాడేరు, ఆగస్టు 17, ప్రభాతవార్త**

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నీటి నిల్వలు పెరుగుతున్నాయని, అన్ని శాఖలు సమన్వయంతో లోతుట్టు ప్రాంతాల ప్రజలకు అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్ లో జిల్లాలోని అధికారులు ముఖ్యంగా జలవనరులు, రెవిన్యూ, పోలీసు,రవాణా, మత్స్యశాఖ, పంచాయతీ రాజ్, రహదారులు భవనాలు, వ్యవసాయ తదితర శాఖల అధికారులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే లోతట్టు ప్రాంతాల ప్రజలకు అప్రమత్తం చేయాలన్నారు. కావలసిన జనరేటర్లు, త్రాగునీరు అందుబాటు లో ఉంచుకోవాలన్నారు. దండోరా వేసి ప్రజలకు అప్రమత్తం చేయాలన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీ పై ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్ అండ్ బి, ఈపిడిసిఎల్, వైద్య ఆరోగ్య, మత్స్య సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగ కుండాముందస్తు అప్రమత్తం అవసరమ న్నారు. మత్స్యకారులు ఎవరు వేటకి వెళ్ల కుండా అప్రమత్తం చేయాలన్నారు. ముం పుకు గురైన ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను తుఫాన్ రిలీఫ్ కేంద్రాలకు తరలిం చేలా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట్ల లోతట్టు ప్రాంత ప్రజలను ముఖ్యంగా గర్భవతులు, పాలిచ్చు తల్లులు, చిన్నారులు, వృద్ధులను, వైద్య సహాయం అత్యవసరంగా కావలసినవారిని ప్రత్యేక శ్రద్ధతో పునరావాస కేంద్రాలకు తరలించేందుకు కావలసిన ముందస్తు చేర్యలు చేపట్టాలన్నారు. అలాగేఎక్కడైనా రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగితే పునరుద్ధరణ పనులు తక్షణమే చేపట్టాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, రంపచోడవరం, చింతూరు ప్రాజెక్ట్ ఆఫీసర్స్, జిల్లా రెవెన్యూ అధికారి కె పద్మలత, ప్రత్యేక ఉప కలెక్టర్లు, చింతూరు డివిజనల్ స్థాయి ఆదికారులు, వివిధ శాఖల అధికారులు సంబంధిత మండలాల ఎంపిడిఓలు, తహసీల్దార్లు ఉన్నారు.

## అరకులోయలో వీకెండ్ సందడి

**అరకు రూరల్, ఆగస్టు 17, ప్రభాతవార్త**





పర్యాట కేంద్రమైన అరకులోయ లో వీకెండ్ సందడి నెలకొంది. ఇటీవల కాలంలో వర్షాల కారణంగా వెలవెలబోయిన ప్రముఖ సందర్శిత ప్రాంతాలు పద్మాపురం ఉద్యానవన కేంద్రం, గిరిజన మ్యూజియం లు వీకెండ్ శని ఆదివారాల్లో మాత్రం సందర్శకులతో సందడి చేశాయి. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో ఇక్కడికి చేరుకుని సందర్శిత ప్రాంతాలను తొలగించారు. కాగా అరకులోయలో గత నెలలో రోజంతా వర్షాలు కురవగా, ఈ నెలలో విభిన్న వాతా వరణం నెలకొంది. ఉదయం నుండి మధ్యాహ్నం ఎండ కాస్తున్నప్పటికీ మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. అరకు లోయ వాతావరణానికి పర్యాటకులు ముద్దులవుతూ పేరుకు తగ్గట్టుగానే అరకులోయ అందాలు ఉన్నాయని, ఇక్కడి అందాలు కాశ్మీర్ ను తలపిస్తున్నాయని పర్యాటకులు ఆనందంగా పేర్కొంటున్నారు. ఏది ఏమైనప్పటికీ పర్యాటకులతో సందడి చేస్తున్న అరకులోయ ఆంధ్ర కాశ్మీర్ గా ప్రపంచ పర్యాటక రంగంలో తనకంటూ ప్రఖ్యాతను ఓ సంతరించుకుందనడం లో ఎటువంటి సందేహం లేదు.

## అరకులోయలో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి కొత్తగా మూడు బైకులను ప్రారంభించిన సీఐ. ఎల్ హిమగిరి

**అరకు రూరల్, ఆగస్టు 17, ప్రభాతవార్త**



అరకులోయలోని ట్రాఫిక్ నియంత్రించడానికి కొత్తగా ఇచ్చిన మూడు బైకులను సీఐ. ఎల్ హిమగిరి, ఎస్సై జి. గోపాల్ రావు జెండా ఊపిప్రారంభించారు. అరకు లోయ సీఐ ఎల్. హిమగిరి మాట్లా డుతూ పర్యాటక కేంద్రమైన అరకులోయలో నిత్యం పర్యాటకుల తాకిడి ఎక్కువ అవడంతో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మూడు బైకులను అరకు లోయ పోలీస్ స్టేషన్ ఇచ్చినం దుకు గాను జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కొత్తగా ఇచ్చిన బైకులు ట్రాఫిక్ నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడతాయని టూరిస్టులు యొక్క సేఫ్టీని దృష్టిలో పెట్టుకొని విజిబుల్ పోలీసింగ్ ను చేయి పెడతామని అలాగే 112 డయల్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణం పోలీసులు హాజరవ్వడానికి ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని రాత్రివేళ గస్తీ పోలీసులు చిన్న వీధులలో కూడా సులభంగా వెళ్లడానికి ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

## పాలసీబజార్‌లో మహిళల ప్రత్యేక బీమా సౌకర్యం టాటా ఏఐఏ శుభ్‌శక్తి

**విశాఖపట్నం, ఆగస్టు 17, ప్రభాతవార్త**

సాంప్రదాయకంగా, టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు పురుష కేంద్రీకృత విధానంతో రూపొందించ బడ్డాయిని, దీనిని దృష్టిలో పెట్టుకొని మహిళా ప్రాధాన్యత పరంగా టాటా ఏఐఏ శుభ్ శక్తి పేరుతో ఒక ప్లాన్ ప్రారంభించినట్టు టాటా ఏఐఏ చీఫ్ కంప్లైయన్స్ ఆఫీసర్ గాయత్రి నాథన్ వెల్లడించారు. ఈ బీమా ఆన్లైన్లో కూడా అందుబాటులో ఉందని, పాలసీ బజార్ ద్వారా ఈ బీమా పొందవచ్చని చెప్పారు. భారతీయ మహిళల భీమా కొనుగోలు ప్రవర్తన మారుతోందని, పాలసీబజార్ సెప్టెంబర్ 2024 రిపోర్ట్ ప్రకారం, టర్మ్ ఇన్సూరెన్స్ పథకాలను కొనుగోలు చేసే మహిళల సంఖ్య 80 శాతం పెరిగిందన్నారు. ఇది మహిళలలో టర్మ్ ఇన్సూరెన్స్ మరియు ఆర్థిక చేరిక కోసం డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని సూచిస్తుందన్నారు. టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్. .ఈ మార్గదర్శక, మహిళా కేంద్రీకృత టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ప్రత్యేకంగా భారతదేశంలో పనిచేసే మహిళల కోసం రూపొందించబడింద న్నారు. సరసమైన ప్రీమియంల వద్ద సమగ్ర కవరేజ్ మరియు తగిన ఆరోగ్య ప్రయోజనాలను అందించడం ద్వారా ఆర్థిక స్వాతంత్రం సాధించడానికి ఇది వారికి అధికారం ఇస్తుందన్నారు. పాలసీ బజార్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వివేక్ జైన్ మాట్లాడుతూ భీమా ఈ పదం మహిళలకు అవసరమైన ఆర్థిక సాధనంగా మారుతోందన్నారు. మహిళా సెంట్రిక్ టర్మ్ ప్లాన్ యొక్క భావన, ప్రత్యేకంగా భారతదేశంలో పనిచేసే మహిళల కోసం రూపొందించబడిందని చెప్పారు.

## కొండవాల ప్రాంతంలో కూలిన గోడ..తృటిలో తప్పిన ప్రమాదం

**ఆరిలోవ, ఆగస్టు 17, ప్రభాతవార్త**



రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తూర్పు నియోజకవర్గం పరిధిలో గల స్థానిక 12వ వార్డు పెదగదలి కొండవాల ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియక భయంతో బతుకుతున్నారు. ఆదివారం కురిసిన వర్షాలకు ఓ ప్రహరీ గోడ ఒక్కసారిగా విరిగి పడటంతో అక్కడ ప్రజలు భయంతో పరుగులు తీశారు. అదే ఇంట్లో నివాసముంటున్న సారిక పైడిరాజు మూర్తమ్మ అనే వృద్ధులకు ఎటు వెళ్ళాలో తెలియక పోవడంతో స్థానికులు సహాయంతో సురక్షిత ప్రాంతానికి తరలించారు. తృటిలో పెను ప్రమాదం తప్పిందంటూ అక్కడ వారందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మా ప్రాంతంలో ఇదే సమస్యతో బాధపడుతున్నామని, సింహాచలం దేవస్థానం అధికారులు స్పందించి మాకు పక్కా నిర్మాణాలకు అనుమతులు ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.



## పద్మనాభంలో చెరువులను తలపిస్తున్న పంటపొలాలు

**పద్మనాభం, ఆగస్టు 17, ప్రభాతవార్త**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల గత మూడు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న బారీ వర్షాలతో పద్మనాభం మండలంలో పలు గ్రామాలలో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాల గట్లుపై నీరు ప్రవహిస్తుంది. దీంతో రైతులు ఆం దోళన చెందుతున్నారు. రెండు వారాల కిందట మద్దిగ్రామం, విలాసఖానపాలెం, అనంతవరం, కృష్ణాపురం, పద్మనాభం,పొట్నూరు గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ బోర్లువద్ద వేసిన వరినాట్లు నేడు నీటమునిగాయి. ఈ నీటిని బయటకి తీయడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అయితే నీట మునిగిన వరిమొనలు కుల్లిపోయి పనికి రాకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాగున ఈ వర్షాలు మరో మూడు రోజులు కొనసాగితే ఇటీవల వేసిన వరిపంటకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు తెలిపారు.

## వర్షాల్లో గిరిజన పాఠశాలల్లో భయం... భయం..

**రాజవొమ్మంగి, ఆగస్టు 17, ప్రభాతవార్త**





వర్షాకాలంలో ఈపాఠశాలల భవనాల్లో చదవాలంటే భయపడే పరిస్థితి ఉంది. రేవటిపాలెం, మర్రిపాలెం, అప్పలరాజుపేట, కిర్రాబు గ్రామాల్లో ఉన్న గిరిజన ప్రాథమిక పాఠశాలల భవనాలు శిధిలవ్యవస్థకి చేరాయి. సింగంపల్లి, బోర్నగూడెం గ్రామాల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలల్లో నిరూపయోగ భవనాలు ఉన్నాయి. ఏళ్ళు గడుస్తున్నా వాటిని తొలగించడం లేదు. వాతంగి ఆశ్రమో న్నత పాఠశాలలో శిధిలవ్యవస్థలో వర్షానికి కారుతున్న భవనం కూడా ఉంది. వాతంగి పంచాయితీ ఒగిపాలెం గ్రామంలో జి. పి. ఎస్ పాఠశాల నూతన భవనం నిర్మాణ పనులు గత ప్రభుత్వంలో నాడు నేడు పథకంలో ప్రారంభించి చివరిదశలో ఆగిపోయింది. ఈ పరిస్థితుల్లో ఒగిపాలెం కమ్యూనిటీ హాలులో ఐదు తరగతులు బోధన సాగుతుంది. ఒకే గది కావడంతో ఏ తరగతి విద్యార్థిలకు ఏపాఠాలు చెబుతున్నారో తెలియని అయోమయ పరిస్థితిని విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. లోదొడ్డి గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి వరకూ విద్యాబోధన, హెచ్. యం., వార్డెన్ అన్నీ ఒక్కరే ఉన్నారని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు సమస్యను వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే.

## మాగ్రామ రహదారి కష్టం తీరే దెప్పుడో.. గిరిజనులు ఆవేదన

**రాజవొమ్మంగి, ఆగస్టు 17, ప్రభాతవార్త**





ప్రభుత్వాలు మారుతున్నా మారహదారి కష్టాలు తీరడం లేదని వంచంగి సర్పంచ్ కొర్రాబు పద్మావతి, గిరిజనులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. వంచంగి పంచాయితీ జి. కొత్తపల్లి గ్రామంలో అందరూ గిరిజన కొండరెడ్డి చెందినవారు నివాసం ఉంటున్నారు. కొండలింగంపర్తి ఆర్ అండ్ బి రహదారి నుండి జి. కొత్తపల్లి గ్రామానికి రహదారి ఉన్నా పూర్తిగా రాళ్ల లేచి ఉన్నాయి. రహదారి మధ్యలో కాలువ ప్రతీ వర్షాకాలంలో పొంగి ప్రవహిస్తాది. ఈపరిస్థితుల్లో చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బాహ్య ప్రపంచంతో సంబందాలు పూర్తిగా తెగిపోతాయి. గ్రామం నుండి బయటకు రావాలంటే వేరొక రహదారి లేదు. రహదారి నిర్మాణంతో బాటు కాలువ వద్ద వంతెనను ఏర్పాటు చేసి సమస్యను తీర్చాలని సర్పంచ్ పద్మావతి, ఎంపిటిసి కోసూరి చిన్నాలమ్మ ఐ.టి.డి.ఏపి.ఓ, జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

## గాలిలో దీపంలా మంచినీటి ట్యాంకు..

### - ప్రజల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు

**రాజవొమ్మంగి, ఆగస్టు 17,ప్రభాతవార్త**



ప్రజలకు సురక్షిత త్రాగునీటి పథకం గాలిలో దీపంలా ఉంది. కాలం చెల్లిన త్రాగునీటి పథకం వల్ల ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జడ్డంగి గ్రామంలో సుమారు 15 సం. క్రితం త్రాగునీటి పథకాన్ని నిర్మించారు. 20 వేల లీటర్ల త్రాగునీటి నిల్వ సామర్థం గల ఈ పథకం ద్వారా గ్రామంలో సగం జనాభాకు నీరు 300 కొళాయిలు ద్వారా అందుతోంది. త్రాగునీటి పథక లోపల భాగంలో క్లోరినేషన్ చేయడానికి కనీసం మెట్లు కూడా పడిపోయాయి. అదికారులకు పలు మార్లు అర్జీలు ఇస్తూనే ఉన్నామని జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ అన్నారు. చిన్నయ్యపాలెం, జడ్డంగి ఎస్టీ కాలనీ, వాల్మీకి నగర్ ల్లో చేతిపంపులు మరమ్మత్తులకు గురై నెలరోజులు అవుతుందని నేటికీ త్రాగునీటి సమస్య పరిష్కరించలేదని సర్పంచ్ మురళీకృష్ణ అన్నారు.

## పూజలు అందుకోవడానికి సిద్ధమైన విఘ్నేశ్వరుడు

**రాజవొమ్మంగి, ఆగస్టు 17, ప్రభాతవార్త**



ఈ నెల 27 తేదీన జరిగే వినాయక చవితి సందర్భంగా భక్తులు నుండి పూజలను అందుకోవడానికి వివిధ రకాల రంగుల్లో విఘ్నేశ్వరుడు సిద్ధంగా ఉన్నారు. హిందువులకు ముఖ్యమైన పండుగగా వినాయకుడు జన్మదినాన్ని పురస్కరించుకొని పండుగను జరుపుకొంటారు. హిందువులు చేసుకొనే శుభ, అశుభ కార్యక్రమాల్లో ముందుగా విఘ్నేశ్వరునికి పూజలను ముందుగా చేస్తారు.

## పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

**హుకుంపేట, ఆగస్టు 17, ప్రభాతవార్త**



భారీగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని వాగులు వంకలు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. మండల కేంద్రాం లోగల చీడుపుట్టు వంతెన భారీ స్థాయిలో నీరు పెరగడంతో ఎక్కడి గ్రామాల ప్రజలు అక్కడే ఉండిపోయారు. వాహనాల సైతం తిరగక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు పంచాయతీలకు చెందిన సుమారు 15 గ్రామాల ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎడతెరిపి లేని వానలుకారణంగా ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అంటూ బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదిస్తున్నారు. ఇదేకాక ఉప్పబ్రిడ్జి నీటిమట్టం పెరగడంతో ఎక్కడ వాహనాలు అక్కడ నిలిచి పోయి జనజీవనం స్తంభించిపోయింది.

## జివిఎంసిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

### - విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు. జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

**విశాఖపట్నం, ఆగస్టు 17, ప్రభాతవార్త**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాలయాలలోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" 2025 ఆగస్టు 18 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు.కావున, నగరంలో పారిశుద్ధం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై ఆగస్టు 18 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.




# చోడవరంలో వరద బీభత్సం జలమయమైన లోతట్టు ప్రాంతాలు

**చోడవరం, ఆగస్టు 17, ప్రభాతవార్త**

గత రెండు రోజుల కురుస్తున్న భారీ వర్షాలు మూలంగా చోడవరం పట్టణ పరిధిలో గల వివిధ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా బాలాజీ నగర్, పూర్ణ థియేటర్, చీడికార్డ్ రోడ్లో, రెల్లి వీధి మెయిన్ రోడ్డు. రత్న రెస్టారెంట్ ,పాత బస్టాండు తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. బాలాజీ నగర్, రెల్లి వీధి ఇళ్లల్లోకి కూడా నీరు చేరడంతో వారు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు పలుచోట్ల రాకపోకలు నిలిచిపోతున్నాయి. కోపరేటివ్ కాలనీ మెయిన్ రోడ్డు ఆరోగ్య హాస్పిటల్ వద్ద చెట్టు పడిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కాలువ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైకే వరద నీరు పొంగిపొర్లి జలమయమవుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. చోడవరం లో ఈ పరిస్థితి మారదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఏమాత్రం వర్షం కురిసిన ఈ లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి అద్వానంగా ఉంటుందని కాబట్టి ఇప్పటికైనా సరే ప్రభుత్వం తగు చొరవ చూపి తమ ప్రాంతాల్లో వరద నీరు నిలవ లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.





## ఏలేరు కాలంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**కసింకోట, ఆగస్టు 17, ప్రభాతవార్త**



మండలంలోని పరిధిలోని అచ్చెర్ల గ్రామం వద్ద మొదట గుర్తు తెలియని మృతదేహం ఎలేరూ కాలువలో కనిపించిందని కసింకోట సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. గుత తెలియని మృతదేహం కనిపించినట్టు కనిపించి అనంతరం కనిపించలేదని చెప్పారు. సిఐ అల్లు. స్వామి నాయుడు, ఎస్సై పి. మణోజ్ కుమార్ సిబ్బంది కలసి పడవలు, డ్రోన్ల సహాయంతో ఏలేరు కాలువలో గాలింపుచర్యలు చేపట్టారు. గాలింపు చర్యలో భాగంగా మృతదేహం ఎలేరూ కాలువ బంగారయ్యపేట వద్దకు చేరిందన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందని చెప్పారు. కే.డి.పేట ప్రాంతానికి చెందిన వ్యక్తి గల్లంతయిందని అనుమానిస్తున్నామని అన్నారు. ఎట్టకేలకు బంగారయ్య పేట వద్ద మృతదేహాన్ని గుర్తించామన్నారు. అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి శవ పంచానామా నిర్వహించమని తెలిపారు.ఎవరైనా అదృశ్యమైన వ్యక్తి గురించి సమాచారం తెలిసిన వారు కశింకోట పోలీస్ స్టేషన్ ఫోన్: 9440796088 సంప్రదించాలని కోరారు.

## కొమ్మోజుకు అరుదైన పురస్కారం

**అనకాపల్లి, ఆగస్ట్ 17, ప్రభాతవార్త**



పట్టణానికి చెందిన లెక్చరర్ కొమ్మోజు రమేష్‌కు అరుదైన పురస్కారం లభించింది. సమాజానికి చేసిన విశేష సేవలను గుర్తించి, 2025 ఆగస్టు 16 న పుదుచ్చేరి లోని షెన్బాగా హాల్ లో జరిగిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ కాన్వొకేషన్ లో విశ్వవిద్యాలయ ప్రతినిధులు రిజిస్టర్/ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ డాక్టర్ ఎ. గోపికన్నన్ దక్షిణ భారత యుఎన్ఐపీసీ చీఫ్ డైరెక్టర్ డా.ఎ ప్రభు రాజేంద్రన్ చీఫ్ కౌన్సిల్ మెంబెర్, గ్లోబల్ అక్రిడిషన్ కౌన్సిల్, జర్మనీ డాక్టర్ జార్జ్ ఫ్రాయిండ్ పీటర్ చేతులమీదుగా కొమ్మోజు రమేష్ కి "హానరరీ డాక్టరేట్ ఆఫ్ సోషియల్ సర్వీస్" బహూకరించడం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ "ఈ గౌరవం తన ఒక్కడిది మాత్రమే కాదు, ఆకర్ష్ కుటుంబం అంతటిది అదే విధంగా వాలంటీర్లుగా సహకరించిన ప్రతి ఒక్కరికి చెందుతుందని అన్నారు. ఇది మాకు మరింత బాధ్యతను, మరింత కృషి చేయాలనే ఉత్సాహాన్ని ఇస్తుంది" అని అన్నారు. అదేవిధంగా "జీవితంలో ఎదురైన వ్యక్తిగత వేదన, సమాజానికి వెలుగునిచ్చే మార్గం అవుతుంది"అనే ధ్యేయంతో 2010 డిసెంబర్ 31 న తన సోదరి నాగ పద్మావతి అనూహ్యంగా ఈ లోకం విడిచిపెట్టడం, తన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది అని అన్నారు,ఆ వేదనను తట్టుకుని, తన సోదరి జ్ఞాపకార్థం సమాజానికి ఏదో చేయాలనే సంకల్పంతో పుట్టినదే ఈ ఆకర్ష్ రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ అన్నారు. 2012 ఆగస్టు 28న "ఆకర్ష్ రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ" అనే స్వచ్ఛంద సంస్థను అధికారికంగా రిజిస్టర్ చేసి, పది మందితో మొదలైన ఈ ప్రయాణం నేటికి కూడా వాలంటీర్ల మద్దతుతో ముందుకు సాగుతుందని తెలిపారు. ఆకర్ష్ రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ పర్యావరణ పరిరక్షణ, పేద విద్యార్థుల విద్య, ఆరోగ్య సేవలు, మహిళా సాధికారిత, చట్ట అవగాహన, క్రీడల ప్రోత్సాహం, అనాథల సంరక్షణ వంటి మొదలు కార్యక్రమాలు నిర్వహించడంలో ఆకర్ష సంస్థ సఫలీకృతమైందని తెలిపారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో మరిన్ని గ్రామీణ ప్రాంతాలకు చేరుకుని, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, యువత అభివృద్ధి రంగాల్లో విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టాలని రమేష్ సంకల్పించారు. అదేవిధంగా 2021-22 లో అఖిల భారత అవార్డు యువాచార్య అవార్డు, 2022-23లో అఖిల భారత అవార్డు కల్పాచార్య అవార్డు, 2024 లో వాసవీ స్వయం సేవా ట్రస్ట్ వారి అద్వర్యంలో అనంత సేవా స్మృతి పురస్కారం, 2024 లో ఎస్.కె.వి.బి. సహకార సంఘం వారి అద్వర్యంలో ఉత్తమ సామాజిక సేవా పురస్కారం, 2025లో ఆర్టిఐ మరియు సోషల్ యాక్టివిస్ట్ విభాగంలో మాజీ రాష్ట్రపతి బ్రహ్మశ్రీ "జ్ఞాని జైల్ సింగ్ జాతీయ అవార్డు" పొందినట్లు తెలిపారు.

## మండలంలో భారీ వర్షం జలమయమైన పంట పొలాలు

**గొలుగొండ ఆగస్టు 17 ప్రభాతవార్త**



తుఫాన్ ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం 11 గంటల నుండి ప్రారంభమైన వర్షం సాయంత్రానికి కూడా ఆగకుండా కురవడంతో పొలాలన్నీ జలమయమయ్యాయి. రోడ్లు అన్ని గెడ్లను తలపిస్తూ ప్రమాదకరంగా మారాయి. ఏమాత్రం ఆద మరిచిన ప్రమాదం తప్పదు అన్నట్టుగా కొన్ని కొన్ని ప్రదేశాల్లో రోడ్లపైనే భారీగా వర్షం నీరు నిలిచిపోయాయి. ఇక పంట పొలాలు పూర్తిగా చెరువులుగా మారి దర్శనమిస్తున్నాయి. మండలంలో ప్రధానంగా ప్రవహించే బొడ్డేరు, ధారగడ్డ, వరాహ నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.



పప్పు శెట్టి పాలెం పంచాయితీ శివారు గ్రామమైన జమ్మాదేవిపేట వెళ్లే మార్గంలో భారీ వృక్షం కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల ప్రమాదకర పరిస్థితులు ఉన్నట్లుగా గ్రామస్తులు తెలుపుతున్నారు. కొన్ని గ్రామాల్లో కాలువలు ప్రవాహం లేక నీరు నిలిచిపోయి చిన్నపాటి చెరువుల తలపిస్తున్నాయి. ఇదే వర్షాలు కొనసాగితే గెడ్డలు మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని ఆయా పరివాహ ప్రాంత ప్రజలు గ్రామస్తులు తెలుపుతున్నారు. ఏది ఏమైనా ప్రజల అప్రమత్తంగా ఉండాలని బయట కు వెళ్లేటప్పుడు జరిగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## కులయ్య రెడ్డికి ఘన సత్కారం.!

**నక్కపల్లి, ప్రభాతవార్త**




నక్కపల్లి హెటిరో ఔషధ పరిశ్రమ భాగస్వామ్యంతో సిఎస్ఆర్ నిధులు హెచ్చించి నక్కపల్లి కేంద్రంగా రెండు కోట్ల 52 లక్షల రూపాయలతో నిర్మించే మోడల్ పోలీస్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో హాజరైన రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, టిఐజి గోపినాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా హెట్టిరో సంస్థ అసోసియేట్ ఉపాధ్యక్షులు కుల్లయ్య రెడ్డి ,మూర్తి లను ఘనంగా సత్కరించి మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ముందుకు వచ్చిన చైర్మన్ రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారధి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి పోతిరెడ్డి శ్రీనివాస్, సిఐలు కే. కుమార్ స్వామి, జి. అప్పన్న, లడ్డు రామకృష్ణ, ఎస్సైలు సన్ని బాబు, ట్రైనింగ్ ఎస్సై సాహిబా అంజుమ్ పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## హోంమంత్రి అనితని సత్కరించిన డిజిపి.!

**నక్కపల్లి, ప్రభాతవార్త**



నక్కపల్లి హెటిరో ఔషధ పరిశ్రమ భాగస్వామ్యంతో సిఎస్ఆర్ నిధులు హెచ్చించి నక్కపల్లి కేంద్రంగా రెండు కోట్ల 52 లక్షల రూపాయలతో నిర్మించే మోడల్ పోలీస్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో హాజరైన రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఐజి గోపినాథ్ జెట్టి ,ఎస్పీ తుహిన్ సిన్హా, హెట్టిరో సంస్థ అసోసియేట్ ఉపాధ్యక్షులు కుల్లయ్య రెడ్డి, మూర్తి, డిఎస్పి పోతిరెడ్డి శ్రీనివాస్, సిఐలు కే. కుమార్ స్వామి, జి. అప్పన్న, లడ్డు రామకృష్ణ, ఎస్సైలు సన్ని బాబు, ట్రైనింగ్ ఎస్సై సాహిబా అంజుమ్ తదితరులు ఉన్నారు.

## హోం మంత్రి అనిత, డీజీపీలకు నక్కపల్లిలో ఘనస్వాగతం.!

**నక్కపల్లి, ప్రభాతవార్త**



నక్కపల్లి హెటిరో ఔషధ పరిశ్రమ భాగస్వామ్యంతో సిఎస్ఆర్ నిధులు హెచ్చించి నక్కపల్లి కేంద్రంగా రెండు కోట్ల 52 లక్షల రూపాయలతో నిర్మించే మోడల్ పోలీస్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తాలు గౌరవ వందన స్వీకరించారు అనంతరం డిఐజి గోపినాథ్ జెట్టి,ఎస్పీ తుహిన్ సిన్హా ల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత హెట్టిరో సంస్థ అసోసియేట్ ఉపాధ్యక్షులు కుల్లయ్య రెడ్డి,మూర్తిలను డీజీపీకి పరిచయం చేశారు. ఇటువంటి గొప్ప కార్యక్రమాలు ముందుకు వచ్చినందుకు వారిని అభినందించారు. డిఎస్పి పోతిరెడ్డి శ్రీనివాస్, సిఐలు కే. కుమార్ స్వామి, జి. అప్పన్న, లడ్డు రామకృష్ణ, ఎస్సైలు సన్ని బాబు, ట్రైనింగ్ ఎస్సై సాహిబా అంజుమ్ ఉన్నారు.

## ఎస్పీ తుహిన్ సిన్హాకు అభినందనలు వెల్లువ.!

**నక్కపల్లి, ప్రభాతవార్త**



నక్కపల్లి హెటిరో ఔషధ పరిశ్రమ భాగస్వామ్యంతో సి ఎస్ ఆర్ నిధులు హెచ్చించి నక్కపల్లి కేంద్రంగా రెండు కోట్ల 52 లక్షల రూపాయలతో నిర్మించే మోడల్ పోలీస్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తాలు చేతుల మీదుగా డిఐజి గోపినాథ్ జెట్టి సారథ్యంలో తుహిన్ సిన్హాలను ఘనంగా సత్కరించి, జిల్లాలో శాంతి భద్రతల విషయంలో ఆయన ప్రతిభ పట్ల అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్ దేవా ప్రసాద్, డిఎస్పి పోతిరెడ్డి శ్రీనివాస్, సిఐలు కే. కుమార్ స్వామి, జి. అప్పన్న, లడ్డు రామకృష్ణ, ఎస్సైలు సన్ని బాబు, ట్రైనింగ్ ఎస్సై సాహిబా అంజుమ్ తదితరులు ఉన్నారు.

## డిజిపి హరీష్ కుమార్ గుప్తాకు ఘన సత్కారం.!

**నక్కపల్లి, ప్రభాతవార్త**



నక్కపల్లి హెటిరో ఔషధ పరిశ్రమ భాగస్వామ్యంతో సి ఎస్ ఆర్ నిధులు హెచ్చించి నక్కపల్లి కేంద్రంగా రెండు కోట్ల 52 లక్షల రూపాయలతో నిర్మించే మోడల్ పోలీస్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో హాజరైన రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తాకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, టిఐజి గోపినాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా, హెట్టిరో సంస్థ అసోసియేట్ ఉపాధ్యక్షులు కుల్లయ్య రెడ్డి ,మూర్తి ల చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి పోతిరెడ్డి శ్రీనివాస్, సిఐలు కే. కుమార్ స్వామి, జి. అప్పన్న, లడ్డు రామకృష్ణ, ఎస్సైలు సన్ని బాబు, ట్రైనింగ్ ఎస్సై సాహిబా అంజుమ్ ఉన్నారు.

## సహాయ కార్మిక అధికారులు సత్కరించిన వాసవి మర్చంట్స్ అసోసియేషన్

**చోడవరం, ప్రభాతవార్త**

స్వాతంత్రదినోత్సవం సందర్భం గా అల్లూరి సీతా రామ రాజు జిల్లా కలెక్టర్ నుంచి, ఉత్తమ సేవ అవార్డు వచ్చిన సందర్భంగా చోడవరం సహాయ కార్మికాధికారి పి. సూర్యనారాయణకు చోడ వరం వాసవి కిరాణా మార్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ పసుమర్తి వెంకట్ గారి అధ్యకతన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సెక్రటరీ ఉప్పల నాగేశ్వరావు, ట్రీజరీ ఉప్పల కృష్ణాజి, ఉప్పల వెంకటేశ్వ రావు, ఉప్పల రాజలింగం గుప్త, పసుమర్తి సుధాకర్,ఉప్పల బాబు పాల్గొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ సూర్యనారాయణ మాట్లాడుతూ మీ షాప్ లలో పని చేయు కార్మికులు కు కనీస వేతన చట్టం ప్రకారం జీతములు చెల్లించాలని, ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని తెలియజేసారు.

## గంజాయి తరలిస్తున్న కారు డ్రైవర్‌కు రిమాండ్

**విశాఖ క్రైమ్ ప్రభాతవార్త**

ఈ నెల 12న కారు ఢీకొని సుభాష్ నగర్ వద్ద ఏడాదిన్నర వయసు చిన్నారి వర్షిత్ మృతి చెందిన ఘటనలో గంజాయి ఉన్నట్టు గుర్తించి కారును కూడా సీజ్ చేశారు. ఈ నెల 16న కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ ఐ శ్రీనివాస్ కారును తనిఖీ చేస్తున్న క్రమంలో కారులో 21 కిలోల గంజాయిని గుర్తించినట్లు కంచరపాలెం సిఐ కె.రవికుమార్ కి తెలియజేశారు. దీంతో కారు డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని ఆదివారం రిమాండ్ కు తరలించారు. ఘటనకు సంబంధించి కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన అర్జునన్ జెమినీ అధ్మఘం ( 24 ) ఈనెల 12న విజయవాడ వద్ద ఒక ప్రైవేట్ సంస్థ లో ఆన్ లైన్ ద్వారా కారును అద్దెకు తీసుకొని అరకు కు వెళ్ళి అక్కడ సుమారు 21 కిలోల గంజాయి కొనుగోలు చేసుకొని ఎన్ ఏ డీ కొత్త రోడ్ మీదుగా రైల్వే స్టేషన్ వైపుగా వెళ్తున్న క్రమంలో ఊర్వశ జంక్షన్ బి ఆర్ టి ఎస్ రహదారికి వస్తున్న సమయంలో అటుగా రోడ్డు దాటుతున్న దంపతులను ఢీకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రమాదంలో ఏడాదిన్నర బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్ కు తరలించారు. ప్రమాద సమయంలో కారు తాళాలు కనిపించకపోవడంతో ఈ నెల 16న విజయవాడ నుండి కారు తాళాలను తెప్పించిన కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కారు తనిఖీ చేపట్టారు. కారు వెనుక భాగం డిక్కీలో 21 కిలోల గంజాయిని గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు కంచరపాలెం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి అర్జునన్ ను రిమాండ్ కు తరలించారు. అదే విధంగా అతనితోపాటు ఇంకా ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో కూడా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులుగా రవికుమార్

**అనకాపల్లి, ఆగస్ట్ 17, ప్రభాతవార్త**



ది సి.టి. ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులుగా పీలా సూర్యనారాయణ (రవికుమార్? ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఆదివారం జరిగిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సంఘ ఎన్నికలలో నిరంతరం ఉద్యోగుల శ్రేయోభిలాషి రవి ఎన్నిక కావడం చాలా ఆనంద దాయకం అని సహచర ఉద్యోహులు అభినందనలు తెలిపారు. అలాగే పలువురు సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశబాబు, కార్యదర్శి సుధాకర్, కోషాధికారి రత్నకుమార్, కమర్షియల్ టాక్స్ ఎంప్లాయిస్ జీ.వో. సంఘ ఉపాధ్యక్షులు అల్లేనా రమేష్ కుమార్, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు పురుషోత్తం నాయుడు, ఏపీ ఎన్జీజీఓస్ సంఘ జిల్లా అధ్యక్షులు కటారి ఈశ్వరరావు, సెక్రటరీ రవిశంకర్ తదితరులు అభినందించారు. కాగా ఏకగ్రీవంగా జరిగిన సంఘ కార్యవర్గం ఎన్నికల్లో సెక్రటరీ జగదీశ్, అసోసియేట్ ప్రెసిడెంట్ వర్మ, ఆర్గనైసింగ్ సెక్రటరీ రాఘవేంద్ర, ట్రీసురేర్ బాలరావికిరణ్, వైస్ ప్రెసిడెంట్ 1 అప్పలరాజు, వైసెప్రెసిడెంట్ 2 రాజేష్, జాయింట్ సెక్రటరీ 1 సుశీల, జాయింట్ సెక్రటరీ 2 ఉత్తరకుమార్ లు ఎన్నిక అయ్యారు. అధ్యక్షులు గా ఎన్నికైన రవి ని మాజీ శాసనసభ సభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, విశాఖపట్నం మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ శాసనమండలి సభ్యులు బుద్ద నాగజగదీశ్ తదితరులు అభినందనలు తెలిపారు. ఎన్నికల ఆఫీసర్ గా విజయనగరం జిల్లా అధ్యక్షులు మధు, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ గా శ్రీనివాస రావు, అబ్జర్వర్‌గా విజయ్ వ్యవహరించారు.

## పిడుగు పాటు కి 30 గొర్రెలు మృతి

**చోడవరం, ఆగస్టు 17, ప్రభాతవార్త**



అనకాపల్లి జిల్లా చోడవరం మండల పరిధిలోని దుడ్డుపాలెం గ్రామంలో పిడుగు పాటు కి 30 గొర్రెలు మృతి చెందాయి. ఆదివారం ఉదయం యాదా ప్రకారం గొర్రెలను మేపు కోసం గ్రామ శివారులకు తరలించారు. అయితే అనుకోని విధంగా ఉరుములు మెరుపులు రావడంతో మేతమెస్తున్న గొర్రెలపై పిడుగు పడడంతో మృతి చెందాయి. వీటిలో కుర్మదాసు తాతా రావు కి చెందిన 20గొర్రెలు, మొల్లి గోవింద వీ 5,కుర్మాదాసు రమణ వి 5 అనే గొర్రెల ఉన్నాయి. దీంతో గొర్రెలు కాపర్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మృతి చెందిన గొర్రెల విలువ రెండు లక్షల పై ఉంటాదని భావిస్తున్నారు. వీరికి విపత్తు నివారణ సహాయం అందించాలని కోరుతున్నారు.

## రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో పరిశ్రమల ప్రతినిధులు

**నక్కపల్లి, ప్రభాతవార్త**





రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో పలు పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధులతో శనివారం సమావేశం అయ్యారు. ఆ సమావేశంలో హెట్టిరో సంస్థ చైర్మన్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద ఉన్న సంస్థ నుంచి అసోసియేట్ ఉపాధ్యక్షులు కుల్లయ్య రెడ్డి, సామిరెడ్డిలు హాజరయ్యారు. పరిశ్రమకు సంబంధించిన పలు విషయాలు లోకేష్‌తో మాట్లాడారు.

## మోడల్ పోలీస్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమంలో సిఐ "కుమార్ స్వామి"

**నక్కపల్లి, ప్రభాతవార్త**



నక్కపల్లి ప్రస్తుత పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పాత క్వార్టర్స్ స్థలములో హెట్టిరో డ్రగ్స్ కంపెనీ సిఎస్ఆర్ నిధుల నుంచి నిర్మించే మోడల్ పోలీస్ స్టేషన్‌కు చేసే భూమి పూజ కార్యక్రమం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, డిజిపి గుప్తాల చేతుల మీదుగా చేసేముందు లో ముందుగా సీఐ కే. కుమారస్వామి స్వాతి దంపతులు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది మా జీవితంలో మరుపు లేనిదని సీఐ కుమార్ స్వామి సంతోషం వ్యక్తం చేశారు.

## జి.తాతయ్య నాయుడికి ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు

**పాయకరావుపేట ఆగస్టు 17 ప్రభాతవార్త**



శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంద సంస్థ స్ప్రెసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. తాతయ్య నాయుడు ఉత్తమ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డును ఆంధ్ర విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సిలర్ జి.పి. రాజశేఖర్ చేతుల మీదుగా అందుకున్నారని, అంతేకాక ఆయనను జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్‌గా నియమించారని, కళాశాల ప్రిన్సిపల్ ఎ.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్ప్రెసెస్ డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. తాతయ్య నాయుడు మాట్లాడుతూ తమ కళాశాల మేనేజ్మెంట్ విద్యార్థుల సహకారంతో గత విద్యా సంవత్సరంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు ఈ అవార్డు పొందడం ఆనందనీయమని ఆయన తెలిపారు. అవార్డు పొందిన నాయుడిని ఆంధ్రా విశ్వ విద్యాలయ ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఆచార్యులు డి.సింహాచలం, విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.



మండలంలోని నెల్లిపూడి గ్రామంలో చేనేత కాలనీలో సందర్శించిన సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చేనేత కార్మికుల శ్రీనివాసరావు ఇంటి వద్ద మగ్గం నేస్తూ.. ఉప్పాడ పట్టు చీరలు కొనుగోలు చేసిన దృశ్యం..( నక్కపల్లి, ప్రభాతవార్త)

## ప్రాథమిక సహకార పరపతి సంఘాల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

గుర్ల, ఆగస్టు 17, ప్రభాతవార్త



రైతు శ్రేయస్సు కోసం ప్రతి ప్రాథమిక సహకార పరపతి సంఘాలు అభివృద్ధి చేయడమే తెదేపా పార్టీ ప్రధాన లక్ష్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు పేర్కొన్నారు.గూడెం ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రం చైర్మన్‌గా పిల్ల అప్పలనాయుడు ఆదివారం కొలువు దీరారు. ఈ మేరకు ముఖ్య అతిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధి, పరపతి సంఘాలు పరిపుష్టి పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని, ప్రతి రైతుకు తలసరి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి రైతు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. గూడెం వ్యవసాయ పరపతి కేంద్రానికి ఏ సౌకర్యం కావాలన్నా ప్రభుత్వం చేయడానికి సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వెన్ని సన్యాసినాయుడు,పార్టీ మండల అధ్యక్షులు చెనమల్లు మహేష్, తిరుమల రాజు కిరణ్ కుమార్ రాజు, పార్టీ సీనియర్ నాయకులు ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణ మూర్తి, మెరకు ముడుదాం మాజీ ఎంపీపీ తాడి సన్యాసి నాయుడు, కెల్ల పిఏసిఎస్ అధ్యక్షులు విమలారాణి, గొర్లె రామునాయుడు, కనిమేరక కృష్ణ, దాసరి శివప్రసాద్, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత ప్రయాణంపై మహిళలకు అవగాహన..

శృంగవరపుకోట,ఆగస్టు17,ప్రభాతవార్త



ఉచిత బస్సు ప్రయాణంపై ఎస్.కోట ఆర్టీసీ డిపో అధికారులు మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పించారు.ఆదివారం ఎస్.కోట నుంచి విశాఖ అలాగే ఎస్.కోట నుంచి అరుకు వైపు వెళ్ళే బస్సుల్లో నేరుగా డిపో అధికారులు పర్యటించి ఉచిత ప్రయాణానికి సంభందించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీరో ఫేర్ టిక్కెట్ జారీ చేస్తూ ఏయే బస్సుల్లో ప్రయాణించాలి అలాగే ప్రయాణించకూడని బస్సుల జాబితా వివరాలను మహిళలకు తెలియజేశారు.పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు,ఎక్స్‌ప్రెస్,మెట్రో ఎక్స్‌ప్రెస్,సిటీ ఆర్డినరీ ఈఐదు రకాల బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణం ఉంటుందని డీలాక్స్, నాన్ స్టాప్,ఏసీ,ఇంటర్ స్టేట్ బస్సుల్లో ఉచిత ప్రయాణం లేదని తెలియజేస్తూ మహిళా ప్రయాణికులకు అధికారులు అవగాహన కల్పించారు.

## రిజిస్టర్ పోస్ట్‌కు ఇక సెలవు..పోస్టల్ శాఖ కీలక నిర్ణయం

శృంగవరపుకోట,ఆగస్టు17,ప్రభాతవార్త



దేశ వ్యాప్తంగా పోస్టల్(తపాలా) శాఖ గత 50ఏళ్ల నుంచి కోట్లాదిమందికి సేవలందిస్తున్న రిజిస్టర్ పోస్ట్ ఇక కనుమరుగు కానుంది. ఈమేరకు పోస్టల్ శాఖ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి రిజిస్టర్ పోస్ట్ సేవలు బంద్ కానున్నాయి. అయితే రిజిస్టర్ పోస్ట్ సేవలు నిలిపివేసినా ఆస్థానంలో స్పీడ్ పోస్ట్ లేదా ఇతర సేవలను వినియోగించనున్నట్లు తెలుస్తోంది. పోస్టల్(తపాలా) శాఖ తక్కువ ఖర్చుతో గత యాభై ఏళ్లుగా సేవలందించి దేశ ప్రజల హృదయాల్లో నిలిచిపోయింది. అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగ అపాయింట్ మెంట్ లెటర్ వచ్చిందంటే అది తప్పనిసరిగా రిజిస్టర్ పోస్ట్ ద్వారా రావాల్సిందే మరి.ఆకాలంలో రిజిస్టర్ పోస్ట్‌కు ఎనలేని విలువ గుర్తింపు ఉండేది.మరి గత 15ఏళ్లుగా రిజిస్టర్ పోస్ట్ వినియోగం బాగా తగ్గిపోయినట్లు తెలుస్తోంది. ఎందుకంటే ప్రస్తుతం వాట్సాప్ ద్వారా అలాగే సామాజిక మాధ్యమాల్లోనూ కీలకమైన పీడీఎఫ్, ఇతర పత్రాలు, ఫైల్స్ వంటివి అతి సులభంగా నిమషాల వ్యవధిలో ప్రజలు పొందుతున్నారు. అదే రిజిస్టర్ పోస్ట్ ద్వారా అయితే రోజులు పట్టే అవకాశం ఉండడంతో రిజిస్టర్ పోస్ట్ లకు ఆదరణ తగ్గిపోయినట్లు తెలుస్తుంది.అందుకే రిజిస్టర్ పోస్ట్ సేవలను నిలిపివేసి ఆస్థానంలో స్పీడ్ పోస్ట్ ఇతర సేవలను తీసుకురావాలని పోస్టల్ శాఖ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## వాహనదారులు విధిగా హెల్మెట్‌తో పాటు సీటు బెల్టు ధరించాలి : రూరల్ సీఐ రామకృష్ణ

పాచిపెంట, ఆగస్టు17,ప్రభాతవార్త



ద్విచక్ర వాహనదారులతో నాలుగు చక్రాలు వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపాలని అలాగే కార్లు డ్రైవ్ చేసినప్పుడు సీటులతో విధిగా ధరించాలని లేని చట్టపరంగా చర్యలు తప్పవని సాలూరు రూరల్ సర్కిల్ పోలీస్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ ప్రకటన తెలిపారు. మండలంలో జాతీయ రహదారి పి కొనవలస చెక్ పోస్ట్ వద్ద రహదారి భద్రత కార్యక్రమంలో భాగంగా ఆయన తన సిబ్బందితో పాటు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయన రహదారి గుండా వచ్చిన వాహనాలను తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు విధిగా వాహనం యొక్క ఒరిజినల్ నకల్లో తోపాటు డ్రైవింగ్ లైసెన్సు విధిగా వాహనంలో ఉంచాలని అదేవిధంగా సీటు బెల్టు ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని ఆయన హెచ్చరించారు. లేనివాళ్ళకి అపరాధ రుసుము తప్పు అని అన్నారు. వాన దారులు గమ్యానికి చేరాలంటే విధిగా హెల్మెట్ ధరించాలని అదే విధంగా సీట్ బెల్ట్ ప్రతి ఒక్క వాహనదారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ వెంట పాచిపెంట ఎస్ఐ వెంకట సురేష చెక్ పోస్ట్ ఎస్సై దేవుడు సిబ్బంది పాల్గొన్నారు.

## సారా రహిత గ్రామాలుగా ప్రకటించాం : ఎక్సైజ్ సీఐ దాస్

సాలూరు ఆగస్ట్ 17 ప్రభాతవార్త



నియోజవర్గంలో మక్కువ ఇంకా పాచిపెంట నాటు సారా రహిత మండలాలుగా ప్రకటించామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ దాస్ స్థానిక విలేకరులకు తెలిపారు. ఆయన ఆదివారం ఆ వివరాలు తెలియజేస్తూ సాలూరు పరిధిలో ఇప్పటి వరకు 16 నాటుసారా కేసులు నమోదు చేసి 216 లీటర్ల నాటుసారని అలాగే 6400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చెయ్యడం జరిగిందని తెలిపారు. అలాగే రెండు వాహనాలను సీజ్ చేసామని 18 మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామన్నారు.ఇది వరకు నమోదు చేసిన 70 కేసులలో గల ముద్దాయిలను కూడా రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. అంతేకాకుండా 150 మంది పాత ముద్దాయిలను ఇంకా అనుమానితులను మండల తహసీల్దార్ వారి ముందు హాజరుపరచి బైండోవర్ చేసామని స్పష్టం చేశారు. పాచిపెంట అలాగే మక్కువ మండలాల్లో ఉన్న గ్రామాలలో నాటుసారకు సంబందించి అవగాహన సదస్సులు నిర్వహించి ఆ గ్రామాల్లో ఎటువంటి చట్టవ్యతిరేక కార్యక్రమలు జరగకుండా నిర్మూలించామని సీఐ దాస్ తెలియజేశారు.

## వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ సింహాచలం

బలిజిపేట ఆగస్టు 17 ప్రభాతవార్త



సోమవారం నుంచి ప్రతి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించాలి ఇందు కోసమే సోమవారం నుంచి స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నాం ఎస్ఐ తెలిపారు దీని ఉద్దేశం రోడ్డు ప్రమాదాల నుండి అరికట్టవచ్చు తెలిపారు కావున ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని ఉద్దేశంతో పోలీస్ శాఖ కంకణం కట్టుకున్నది లేనిచో అధిక సుంకం చెల్లించవలసి ఉంటుందని హెచ్చరించారు ద్విచక్ర వాహనం ఉన్నవారు హెల్మెట్ 4 చక్రాలు వాహనదారులు సీటు బెల్టు కంపల్సరీ ధరించాలి స్థానిక ఎస్సై సింహాచలం ఒక ప్రకటనలో తెలియజేశారు.

## గ్రంథాలయంకు పుస్తక వితరణ

శృంగవరపుకోట,ఆగస్టు17,ప్రభాతవార్త



ఎస్.కోట గ్రంథాలయం శాఖకు పలువురు దాతలు పుస్తకాలు బహుకరించారు. స్థానిక రైల్వే ఉద్యోగి చింతాడ ఈశ్వరరావు,సచివాలయం ఉద్యోగి షేక్ నబి,రిటైర్డ్ ఫైర్ స్టేషన్ ఉద్యోగి లెంక సాంబమూర్తి ముగ్గురు కలిసి పదివేల రూపాయల విలువ చేసే వివిధ పోటీ పరీక్షలకు సంభందించిన పుస్తకాలను అందజేశారు.గ్రంథాలయం శాఖాధికారి డి.శ్రీధర్ అలాగే పాఠకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## టిడిపి సభ్యుని కుటుంబానికి 15 లక్షలు బీమా పైకం అందించిన ఎమ్మెల్యే కిమిడి

గరివిడి ఆగస్టు,17 ప్రభాతవార్త



మండలంలోని వెదుళ్ళవలస గ్రామానికి చెందిన టీడీపీ సభ్యత్వం పొంది మృతి చెందిన ముల్లు సూర్య నారాయణ కుటుంబానికి చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట రావు 15 లక్షలు బీమా పైకాన్ని అందించారు. వెదుళ్ళవలసకి చెందిన ముల్లు సూర్య నారాయణ టీడీపీ సభ్యత్వం పొంది ఇటీవల మృతి చెందారు.తెదేపా సభ్యత్వం పొంది మృత్యువాత పడిన నేపథ్యంలో ఇన్సూరెన్స్ ద్వారా 5 లక్షలు మంజూరైంది.. అలాగే బ్యాంకులో రూ.500 ఇన్సూరెన్స్ పథకం బాండు కలిగి ఉండటంతో బ్యాంక్ ద్వారా 10 లక్షలు ఇన్సూరెన్స్ మంజూరైంది. ఈ రెండు బీమా పైకాల మొత్తాన్ని ఎమ్మెల్యే కళా వెంకట రావు బాధితుని కుటుంబానికి అందించి వారికి భరోసా కల్పించారు.వారికళ్ళల్లో ఆనందాన్ని నింపారు. ఇన్సూరెన్స్ పైకాన్ని తమ కుటుంబానికి మంజూరు కి కృషి చేసిన ఎమ్మెల్యే కళా వెంకట రావు,వెదుళ్ళవలస మాజీ సర్పంచ్ మన్నెపురి సూర్యనారాయణ, మండల టీడీపీ నాయకులకు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ పైల బలరాం,మండల టిడిపి అధ్యక్షుడు సారేపాక సురేష్,వెదుళ్ళవలస సర్పంచ్ మన్నెపురి సూర్యనారాయణ, బిజెపి చీపురుపల్లి నియోజకవర్గ కో.కన్వీనర్ మెన్నెపూరి శ్రీనివాసరావు, సాగి రంగరాజు ,గొట్టిముక్కల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

## తవ్వే సారు.. వదిలేశారు.. ప్రాణాలు పోతే దిక్కెవరు..

చీపురుపల్లి ఆగస్టు 17 ప్రభాతవార్త



వందలాది మీటర్ల లోతులో గనిబంటాలను తవ్వేశారు.. మైనింగ్ వ్యాపారాలతో కోట్లాది రూపాయలను కొల్లగొట్టారు.. కనీస నిబంధనలు పాటించకుండా గనిబంతాలను వదిలేయడంతో ప్రస్తుతం అవి మృత్యు కూపాలుగా దర్శనమిస్తున్నాయి.. చీపురుపల్లి మండలం లోని మైనింగ్ సంస్థల ఆగడాలకు అడ్డు లేకపోవడంతో విచ్చలవిడిగా గనిబంటాలను తవ్వి వదిలేయడంతో సమీప ప్రాంతాల్లోని గ్రామాలకు చెందిన రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబిఎం) నిబంధనలు గాలికి వదిలేయడంతో చీపురుపల్లి ప్రాంతంలో పలుచోట్ల మైనింగ్ నిర్వాహకులు నిర్లక్ష్యముగా తవ్వి వదిలేసిన మైనింగ్ గోతులు మృత్యుకూపాలుగా దర్శనమిస్తున్నాయి. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ నిబంధనల ప్రకారం మైనింగ్ ఖనిజాలు తవ్వకాలు జరిపి వదిలేసిన ఘని బంటాలను సంబంధిత యాజమాన్యం బాధ్యత వహిస్తూ వాటికి పూర్తిస్థాయిలో రక్షణ కవచం ఏర్పరసివ్వలసి ఉంటుంది. ఈ నిబంధనలను సంబంధిత యాజమాన్యాలు గాలికి వదిలేయడంతో పాటు పర్యవేక్షణ జరపవలసిన అధికారులు సైతం చూసి చూడనట్లు వదిలేయడంతో సామాన్యుల ప్రాణాలు గలిబంటాలులో ఆవిరైపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో చుట్టూ రక్షణ కవచనాలు ఏర్పాటు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం ప్రత్యేక కాప్లాదారులు కూడా నియమించాల్సి ఉంటుందంటూ పలువురు చూసి సూస్తున్నారు. గ నుల శాఖకు సంబంధించిన అధికారులు కూడా ఐబీఎం నిబంధన అమలుపైన నిత్యం పర్యవేక్షణ జరపవలసి ఉన్నప్పటికీ కనీస పర్యవేక్షణ లేకపోవడంతో సంబంధిత యాజమాన్యాలు నిబంధనలను గాలికి వదిలేస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. నిబంధన ల ప్రకారం మైనింగ్ జరిగే ప్రాంతంలో ప్రత్యేక రక్షణ కమిటీని ఏర్పాటు చేసి కమిటీ సభ్యులతో నెలకొకసారైనా సమావేశాలను ఏర్పాటు చేయవలసి ఉన్నప్పటికీ సమావేశాలు రికార్డులకి పరిమితమవుతున్నాయంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశాల ద్వారా రక్షణ అంశాల పైన తీసుకున్న చర్యల పైన చర్చలు జరపవలసి ఉన్నప్పటికీ కనీస చర్యలు కానరావడం లేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధన మేరకు మైనింగ్ ఉన్నత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపవలసి ఉన్నప్పటికీ వీటిని అన్నింటిని యాజమాన్యాల కోసం వారి అభీష్టం మేరకు జరుపుతుండడంతో మైనింగ్ యాజమాన్యాలు ఆడింది ఆటగా పాడింది పాటగా కొనసాగుతుందంటూ పలువురు అధికారుల పనితీరును దుయ్యబడుతున్నారు. మైనింగ్ తవ్వకాల కొరకు అడ్డగోలుగా వందలాది మీటర్ల లోతులో బంటా లను తవ్వి వదిలేస్తున్న నిర్వాహకుల నిర్లక్ష్యం పట్ల సంబంధిత అధికారులు కనీస పర్యవేక్షణ లేకపోవడం విచారకరం. మైనింగ్ ముడి కనీసం కోసం జరిపిన తవ్వకాలతో కని జం దొరికిన తరువాత వందలాది మీటర్ల లోతులో వదిలేసిన గోతులు కారణంగా మూగజీవాలతోపాటు సమీప గ్రామాల రైతుల ప్రాణాలు కూడా గాలిలో కలిసిపోతున్నడంతో పలువురు అధికారులు తీరును దియబడుతున్నారు. తవ్వి వదిలేసిన గుంతల చుట్టూ కనీసం ప్రమాద నివారణ రక్షణ చర్య లేకపోవడంతో పలు వు రు మృత్యువాత పడుతున్నారు. నియోజకవర్గ పరిధిలో చీపురుపల్లి మండలంలో నడిపల్లి ఇ టకార్లపల్లి,ప్రాంతాలతో పాటు గరివిడి మండలం కోడూరు ,గదబవలస వలస , తదితర ప్రాంతాల్లో అధికారికంగా మైనింగ్ తవ్వ కాలను జరుపుతున్నారు. ప్రభుత్వ అనుమతులను కొద్దిగా తీసుకొని అంతకు నుంచి ఎక్కువ స్థాయిలో యదేచ్ఛగా మైనింగ్ తవ్వకాలు జరుపుతుండడంతో ఎక్కువ శాతం గనిబటాలుద ర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సమీప ప్రాంతాలలో గల రైతులు పశువుల మేత కొరకు గని బంటాలు గల ప్రాంతాల్లో సంచరిస్తూ పలుచోట్ల మూగజీవాలతో పాటు రైతులు కూడా మృత్యువాత పడిన సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. వర్షాలు పడే సమయంలో మైనింగ్ గోతులు అంచులు కొంచెం కొంచెముగా కరిగి జారిపోతున్నడంతో ఆ ప్రాంతంలో సంచరించే మూగజీవాలు సైతం గలిబంటా లలో పడి మృత్యువాత పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత మైనింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేసిన గనిబంతాల చుట్టూ రక్షణ కవచాలను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

## ఘనంగా కృష్ణ భగవాన్ ఊరేగింపు..

చీపురుపల్లి, ఆగస్టు 17 ప్రభాతవార్త



త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక చీపురుపల్లి కమిటీ ఆధ్వర్యంన చీపురుపల్లి పట్టణం ల ఆదివారం నాడు శ్రీ కృష్ణ భగవానుడు ఊరు ఎరిగింపు కార్యక్రమం దిగ్విజయం ఘనంగా నిర్వహించారు కృష్ణాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగ ఇందూ జ్ఞాన వేదిక చీపురుపల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంన శ్రీ కృష్ణుడి ప్రతిమ ను శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజు ఆగస్టు 16 న శనివారం నాడు చీపురుపల్లి టౌన్ వీరబ్రహ్మం గారి గుడి వద్ద వేదిక నిర్మించి , కొలువు తీర్చి, స్వామికి ప్రతి రోజు ఉదయం సాయంత్రం జ్ఞాన రీత్యా నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం భగవద్గీత శ్లోక పారాయణం చేసి 2 వ రోజు అయిన ఆదివారం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం వీరబ్రహ్మం గారి గుడి నుండి,ఆంజనేయ పురం కాలనీ, చీపురుపల్లి విజయనగరం బొద్దం రాజాంమెయిన్ రోడ్డు చీపురుపల్లిరుపల్లి వీధులు తిరిగి ఆంజనేయపురం చివర్ల వరకు ఊరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక లలిత హాస్పిటల్ మోహన్, చీపురుపల్లి ఉత్సవ నిర్వాహకులు సూర్యనారాయణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కడుపు నొప్పి తాళలేక పురుగులు మందు తాగి యువకుడు ఆత్మహత్య

రామభద్రపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త



రామభద్రపురం మండలం రామభద్రపురం గ్రామంలో శ్రీరామ నగర్ కాలనీకి చెందిన యువకుడు కడుపునొప్పి తాళలేక పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వి.ప్రసాద్ రావు చెప్పియున్నారు. పోలీసువారు అందించిన వివరాలు ప్రకారం చనిపోయిన వ్యక్తిపేరు ఘోర్జ రమేష్ (43) మృతుని భార్య పేరు కృష్ణవేణి వీరికి ఇద్దరు ఆడపిల్లలు కలరు. ఈనెల 15న 4 గంటలకు వీరికళ్ళంలో పురుగులు మందు తాగి చనిపోయాడు అని తెలిపారు. మృతుని తల్లి తండ్రులు తెలుసుకొని బాడంగి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించిరి హాస్పిటల్ సిబ్బంది మెరుగైన వైద్యం కొరకు విజయనగరం మహారాజ్ హాస్పిటల్ కు తరలించారు. అయితే 16న రాత్రి వైద్యం పొందుతూ మరణించినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టెమ్ జరిపించి మృతుని తల్లి తండ్రికి అప్పగించగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.ప్రసాద్ రావు తెలిపారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ ఖ్యాతి సాధించాలి

### ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

నెల్లిమర్ల, ఆగస్టు 17, ప్రభాతవార్త



వెయిట్ లిఫ్టింగ్‌లో జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప చేయాలని ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్, టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కొండవెలగాడలో ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాలు స్థాయి అస్మిత ఖేలో ఇండియా మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను బంగార్రాజు లాంఛనంగా ప్రారంభించారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో కొండవెలగాడ గ్రామానికి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి ఉందని, ఆ కీర్తి ప్రతిష్టలను భవిష్యత్తులో కూడా కొనసాగించే విధంగా క్రీడాకారులు పతకాలు సాధించాలని అన్నారు. క్రీడల్లో నైపుణ్యం పొందిన వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న విషయాన్ని ప్రతి క్రీడాకారుడు గమనించాలని అన్నారు. మిగిలిన వారితో పోలిస్తే క్రీడాకారులు మెరుగైన ఆరోగ్యం కలిగి ఉంటారని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దారిద్ర్యం పెంపుదలకు దోహదపడతాయని అన్నారు. క్రీడారంగాన్ని అభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, ప్రభుత్వం ఇటీవలే నూతన క్రీడా పాలసీని ప్రకటించిందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, విజయనగరం సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దేవమణి, గ్రామ సర్పంచ్ గదల బంగారమ్మ, ఎంపీటీసీ ముయిద కళావతి, జనసేన నాయకులు గదల అచ్చం నాయుడు, అట్టాడ చిన్నయ్య,టిడిపి నాయకుడు దంతులూరి అజయ్ బాబు, మొయిద సత్యనారాయణ ( శ్రీను), వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు చల్లా రాము, వల్లూరి శ్రీనివాసరావు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మహిళా క్రీడాకారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## నేటి నుండి హెల్మెట్ తప్పనిసరి : ఎస్సై నారాయణ రావు

కురుపాం, ఆగస్టు 17.ప్రభాతవార్త



ద్విచక్ర వాహనాలు నడిపిన ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని లేనియెడల వారికి జరిమానా విధిస్తామని కురుపాం సబ్ ఇన్స్పెక్టర్ పి నారాయణ రావు అన్నారు. ఆదివారం కురుపాంలో మోటార్ సైకిల్ ను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుండి ప్రతి ఒక్కరు మోహన్ నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని అలా లేని వారికి వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తున్నట్లు ఆయన తెలిపారు .కనుక ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలని ఆయన అన్నారు. అలాగే ట్రాఫిక్ రూల్స్ పాటించి వాహనం నడపాలని వాహనం వద్ద వాటి సంబంధించిన నఖల్లు ఉండాలని ఆయన అన్నారు.

## జియో రామకృష్ణకు ఘన సన్మానం

శృంగవరపుకోట,ఆగస్టు17,ప్రభాతవార్త

ఎస్.కోటకు చెందిన జియో(సిమ్) వ్యవస్థాపకులు బొబ్బిలి రామకృష్ణను హరిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరంలో నిర్వహించిన హరిత స్వచ్ఛంద సంస్థ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతలో యువత, స్వచ్ఛంద సంస్థల పాత్ర తదితర అంశాలపై రామకృష్ణ మాట్లాడారు. జెఆర్ పురం సీఐ ఎం.అవతారం, రిటైర్డ్ అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ ఇవి.రమణ,సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి,యోగా అధ్యాపకులు డా.జీ.ఈశ్వరావు, హరిత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్.హరిబాబు,సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త
25 Glorious years

## స్వర్గీయ సాంబశివరాజు చిరస్మరణీయులు : ఎం.ఎల్.సి డా.సురేష్‌బాబు

నెల్లిమర్ల, ఆగస్టు 17, ప్రభాతవార్త



విలువలతో రాజకీయం చేసి, ఈ ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషి చేసి ప్రజల గుండెల్లో నిలిచిన మాజీ మంత్రి, స్వర్గీయ పెనుమత్స సాంబశివరాజు చిరస్మరణీయుడు అని ఎంఎల్‌సి డా.పివి సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు) అన్నారు. స్వర్గీయ సాంబశివరాజు 92వ జయంతి వేడుకలు మండలంలోని మొయిద విజయరాంపురం గ్రామంలో ఆదివారం ఘనంగా జరిగాయి. డా.సురేష్ బాబుతో పాటు వైసిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు తొలుత సాంబశివరాజు సమాధి వద్ద పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సురేష్ బాబు స్వగృహంలో భారీ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. డా.సురేష్‌బాబు మాట్లాడుతూ ఐదు దశాబ్దాలకు పైగా తన తండ్రి సాంబశివరాజు రాజకీయ రంగంలో రాణించి ప్రజా నాయకుడిగా పేరు పొందారని గుర్తు చేశారు. స్వర్గీయ సాంబశివరాజు సేవలు కలకాలం నిలిచిపోతాయని అన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో పాటు విజయనగరం జిల్లా అభివృద్ధికి స్వర్గీయ సాంబశివరాజు ఎనలేని కృషి చేశారని సురేష్ బాబు వివరించారు. నాఫెడ మాజీ డైరెక్టర్ కె.వి సూర్యనారాయణ రాజు (పులి రాజు), హర్షవర్ధన్ రాజు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గ్రామ సర్పంచ్ అట్టాడ కృష్ణ, ఎంపీటీసీ పెనుమత్స సంతోష్ బాబు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు నల్లి శ్రీనివాసరావు, తుమ్ము నారాయణమూర్తి, ధవళ లక్ష్మణరావు, లంక గోవిందరావు, గేదెల రామ చిరంజీవి, కర్రోతు వెంకటరమణ, వాళ్లే అప్పలనాయుడు, కోట్ల పైడినాయుడు, బెల్లాన రామారావు, సంగం రెడ్డి జగన్నాథం పాల్గొన్నారు.

## జోరు వానలో నిరసనలు-పట్టించుకోని ప్రభుత్వం..

శృంగవరపుకోట,ఆగస్టు17ప్రభాతవార్త



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 56రోజులుగా నిరసనలు తెలుపుతుంటే స్థానిక ప్రజాప్రతినిధులు గానీ జిల్లా యంత్రాంగం గానీ ప్రభుత్వం గానీ పట్టించుకోక పోవడం అన్యాయమని బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం కురిసిన జోరువానలో నిర్వాసితులు తడుస్తూ నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ నిర్వాసితుల తరుపున మాట్లాడుతూ పోడు భూముల పట్టాలు కోసం మేము నిరసనలు తెలపడం లేదని పరిశ్రమ ఏర్పాటు చేస్తామని మాయమాటలు చెప్పి ఉన్న భూములను లాగేసుకుని జిందాల్ యాజమాన్యం ఘరానా మోసం చేసిందని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా అప్పుడు జరిగిన భూసేకరణలో జిందాల్ సంస్థ చాలా అక్రమాలకు పాల్పడిందని ఇప్పుడిప్పుడే అన్ని బయటకు వస్తున్నాయని వాటిపై తక్షణమే విచారణ జరిపించాలని నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఒక్కసారి నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేస్తే జిందాల్ చేసిన మోసాలన్నీ బయట పడతాయని చల్లా జగన్ కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నిర్వాసితులు పాల్గొన్నారు.

## ఆరికతోట పశువైద్యాధికారికి రాష్ట్రస్థాయి అవార్డు

రామభద్రపురం, ఆగస్టు 17, ప్రభాతవార్త



మండల పరిదిలోని ఆరికతోట పశువైద్యాధికారి డి.సురేష్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ మేరకు 79వ స్వాంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ గుంటూరు చైర్మన్ డాక్టర్ శ్రీనివాసరావు చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. పశువుల్లో పిండ బదిలీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించినందుకు ఈ అవార్డు దక్కింది. రాష్ట్ర స్థాయి అవార్డు పొందిన సురేష్ను పలువురు అభినందించారు.

## తాగేందుకు మంచినీరు ఇవ్వండి.. చాపరాయిగూడ గిరిజనుల ఆవేదన

కురుపాం,ఆగస్టు 17 ప్రభాతవార్త



స్వతంత్రం వచ్చి 79 సంవత్సరములైనప్పటికీ తమ గ్రామంలో త్రాగేందుకు మంచి నీరు కరువైందని గిరిజనులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కురుపాం మండలం వలసబల్లేరు పంచాయతీ చాపరాయి గూడ గ్రామంలో బూడిద రంగు నీరు వస్తుందని ఈ నీరు త్రాగటం వల్ల అనేక వింత రోగాలు వచ్చే అవకాశం ఉంద ని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. గతంలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామని ఆమె పరిశీలించిన నేటికీ నీటి సమస్య పరిష్కారం కాలేదని వారన్నారు. ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు బిడ్డిక అనిల్ మాట్లాడుతూ మండలంలో కొండ చివర గిరిజన గ్రామాలలో నీటి సౌకర్యం లేక అనేక గ్రామాల్లో జ్వరాలు ప్రభావం ఎక్కువగా ఉందని కాబట్టి గిరిజను ఇబ్బందులను అధికారులు తెలుసుకొని మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేణు మాట్లాడుతూ చాపరాయి గూడ గ్రామం పరిశీలించడం జరిగిందని బోరు తీయించడానికి సరియైన రహదారి లేకపోవడంతో బోరు తీసే వాహనము గ్రామానికి చేరలేకపోయిందనిన్నారు. రహదారి పనులకు పిఎం జన్మన్ నిధుల నుండి రహదారి వేసేందుకు ప్రతిపాదనలుగా పంపెంచమనిన్నారు. రహదారి నిర్మాణము పూర్తి అయిన వెంటనే ఆ గ్రామంల బోర్ వెల్ తీయించడం జరుగుతుందని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేణు తెలిపారు.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

కొమరాడ ఆగస్టు 17 ప్రభాతవార్త



ద్విచక్ర వాహనాన్ని నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కొమరాడ ఎస్సై నీలకంఠం అన్నారు. ఈ మేరకు ఆదివారం అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణికుల కు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేటి నుంచి హెల్మెట్ ధరించని వారి నుంచి అపరాధ రుసుము వసూలు చేయడం జరుగుతుందని అన్నారు. కావున ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి సహకరించాలన్నారు.

## దళిత మహిళా ఉద్యోగిని వేధించడం సరి కాదు

ఆమదాలవలస, ఆగస్టు 17, ప్రభాతవార్త



పొందూరు మండలంలో కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న దళిత మహిళ సౌమ్య ఉద్యోగినిపై ఎమ్మెల్యే ప్రవర్తించిన తీరు దారుణమని వైయస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమదాలవలస వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో దళిత సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పొందూరు మండలం లోలుగు కేజీబీవీ పాఠశాల పనిచేసిన ప్రిన్సిపాల్ బి సౌమ్య పై ఎమ్మెల్యే ప్రవర్తించిన తీరు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉందని దయ్యబట్టారు. సమయపాలన లేని సమీక్షలతో ఆమెను మానసికంగా కృంగదీశారని ఆరోపించారు. ఆమెను హింసించడమే కాకుండా బదిలీ వేటు ప్రక్రియ అధికారులతో చేయించారని విమర్శించారు. ఆమెపై విధుల్లో బాధ్యతారాహిత్యం ఉంటే అధికారులు చర్యలు తీసుకోవాలే తప్ప ,ఇలాంటి నీతిమాలిన చర్యలు తీసుకోవడం ఎమ్మెల్యేకి తగదని హితవు పలికారు. ఎప్పటికైనా ఆమెకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి దళిత సంఘాల నాయకులు ముంజేటి కృష్ణ, పెయ్యల లక్ష్మణరావు, నీలాపు ముకుందరావు, ఎజ్జల గురుమూర్తి, జాన్, రామచంద్రరావు, ముద్దాడ ఈశ్వరరావులు మాట్లాడుతూ ప్రిన్సిపల్ సౌమ్య పై ఎమ్మెల్యే వైఖరిని ఖండించారు. ఆమెకు దళిత సంఘాలు నిరంతరం వెన్నుదన్నుగా ఉంటాయన్నారు. మొదట నుంచి దళితులను అణిచివేతకు టిడిపి గురిచేస్తుందని వారన్నారు. అక్రమాలు చేసిన అధికారులపై శాఖాపరమైన విచారణ జరిపించాలి గాని వేధింపులకు గురి చేయడంపై దళిత సంఘాల అగ్రనేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్కుమార్, దుంపల శ్యామలరావు, చిన్నారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

## కొత్తమ్మతల్లి రాజగోపురం, అనివెట్టి మండపం ప్రారంభం

కోటబొమ్మాళి-ప్రభాతవార్త



స్థానిక కొత్తమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన రాజగోపురం, అలాగే రూ. 75లక్షలతో నిర్మించిన అనివెట్టి మండపంను రాష్ట్ర వ్యవసాయాశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ, ఆలయ పురోహితులు సుసరాపు గణపతి శర్మలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, కర్రి అప్పారావు, పూజారి శైలజ, ఎస్. శ్రీనివాస్, కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి ముఖ్య అతిధిలుగా హాజరు అయి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

18-08pg10.qxd OK:18-08pg10.qxd 1/1/02 9:19 AM Page 1



# ఆసియా కప్ అత్యధికసార్లు భారత్‌కే



## 16 ఎడిషన్లలో 8 సార్లు విజయం

## శ్రీలంక 6, పాక్2 సార్లు విన్

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 సందడి మొదలైంది. క్రికెట్ అభిమానుల ఆసక్తి అంతా ఇప్పుడు ఏషియా కప్‌పైనే ఉంది. ఈ మెగా టోర్నమెంట్ సెప్టెంబర్ 9 నుంచి అదే నెల 28 వరకు యూఏఈలోని దుబాయ్, అబుదాబి నగరాల్లో జరగనుంది. ఈసారి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ టోర్నీని నిర్వహిస్తోంది. ఇది ఆసియా కప్ 17వ ఎడిషన్ కావడం విశేషం. ఈసారి ఈ టోర్నీని టీ20 ఫార్మాట్‌లో నిర్వహిస్తున్నారు. వాస్తవానికి, ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరగడం ఇది మూడోసారి మాత్రమే. మిగిలిన 14 సార్లు వన్డే ఫార్మాట్‌లో జరిగింది. ఇప్పటి వరకూ జరిగిన ఏషియాకప్‌లో టీమిండియాదే అత్యధిపత్యం. ఆసియాలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నమెంట్ అయిన ఆసియా కప్‌ను 1984లో ఆసియా క్రికెట్ కౌన్సిల్ ప్రారంభించింది. 2016 నుంచి ఈ టోర్నమెంట్ ఐసీసీ ప్రధాన టోర్నమెంట్ల ఫార్మాట్‌కు అనుగుణంగా వన్డే లేదా టీ20 ఫార్మాట్‌లో జరుగుతోంది. ఈ టోర్నమెంట్‌ను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. ఆసియా కప్ చరిత్రలో భారత్, శ్రీలంక, పాకిస్తాన్ జట్లు ఆధిపత్యం చెలాయించాయి. ముఖ్యంగా భారత్, పాకిస్తాన్, శ్రీలంక మధ్య జరిగే మ్యాచ్‌లు ఎప్పుడూ థ్రిల్లింగ్‌గా ఉంటాయి. ఈ టోర్నీలో అత్యధికంగా విజయం సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. ఇప్పటివరకు టీమిండియా ఏకంగా 8 సార్లు (1984, 1988, 1991, 1995, 2010, 2016, 2018, 2023) విజేతగా నిలిచింది. ఆ తర్వాత శ్రీలంక 6 సార్లు (1986, 1997, 2004, 2008, 2014, 2022) ట్రోఫీని గెలుచుకుంది. పాకిస్తాన్ కూడా 2 సార్లు (2000, 2012) విజేతగా నిలిచింది. బంగ్లాదేశ్ మూడు సార్లు ఫైనల్‌కు చేరినా, ఇప్పటివరకు ఒక్కసారి కూడా టైటిల్ సాధించలేకపోయింది. ఈసారి ఆసియా కప్‌లో మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయి. వీటిని ఒక్కో గ్రూప్‌లో నాలుగు జట్ల చొప్పున రెండు గ్రూప్‌లుగా విభజించారు. భారత్ తన మొదటి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడనుంది. ఈ టోర్నీలో అత్యంత ఆసక్తికరమైన విషయం భారత్‌పాకిస్తాన్ మ్యాచ్‌లు. ప్రస్తుతం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, రెండు జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. అంటే కనీసం లీగ్ దశలో ఒక మ్యాచ్ ఆడతాయి. ఒకవేళ ఇరు జట్లు సూపర్ ఫోర్ రౌండ్‌లోకి వెళ్తే, అక్కడ మరోసారి తలపడతాయి. ఇక ఫైనల్‌కు కూడా చేరితే, టైటిల్ కోసం మరోసారి పోరాడతాయి. ఈసారి భారత్, పాకిస్తాన్ మధ్య మూడు హైఓల్టేజ్ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది.

# డ్యూరాండ్ కప్‌లో ఇండియన్ నేవీ ఎఫ్‌టి ఓటమి

## సెమీఫైనల్స్‌కు షిల్లాంగ్



**న్యూఢిల్లీ:** డ్యూరాండ్ కప్ తొలి క్వార్టర్ ఫైనల్‌లో షిల్లాంగ్ లాజోంగ్ ఎఫ్‌సి 2-1 తేడాతో ఇండియన్ నేవీ ఎఫ్‌టిని ఓడించి వరుసగా రెండో సెమీఫైనల్‌కు చేరుకుంది. విజయ్ మరాండి తొలి అర్ధభాగంలో భారత నేవీకి ఆధిక్యాన్ని అందించిన తర్వాత, దమైట్‌ఫాంగ్ లింగ్డో, ఎవర్‌బ్రైట్‌సన్ సనా మైలియంప్డా రెండవ అర్ధభాగంలో చేసిన గోల్స్ ఆతిథ్య జట్టుకు విజయాన్ని అందించాయి. షిల్లాంగ్ లాజోంగ్ 4-3-3 ఫార్మేషన్‌లో ప్రారంభమైంది. ప్రధాన కోచ్ బీరేంద్ర థాపా ఫ్రాంగ్కి బువామ్, ఎవర్‌బ్రైట్‌సన్ సనా, షీన్ స్టీవెన్‌సన్‌లను మిడ్‌ఫీల్డ్‌లో డమైట్‌ఫాంగ్ లింగ్డో, ట్రెయిమికి లాముర్‌ోంగ్, గ్లాడీ ఖర్బులితోను, భారత నేవీ హెడ్ కోచ్ రామన్ రాయ్ తన జట్టును సాంప్రదాయ 4 -4-2 ఫార్మేషన్‌లో రంగంలోకి దించారు. కెప్టెన్ భాస్కర్ రాయ్ గోల్‌ను కాపాడుతుండగా, శ్రేయాస్ వీజీ, విజయ్ మరాండి బరిలోకి దిగారు. మొదటి అర్ధభాగంలో 35వ నిమిషం వరకు చాలా తక్కువ అవకాశాలు మాత్రమే వచ్చాయి. రెండు నిమిషాల ముగింపులో భారత నేవీ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండు ఎండ్లలో గోల్ కీపర్లు అద్భుతమైన సేవ్‌లు చేసేలోపు గోల్ వచ్చింది. రెండవ అర్ధభాగంలో షిల్లాంగ్ లాజోంగ్ సమం చేసే క్రమంలో 69వ నిమిషంలో లక్కీ బ్రేక్‌తో చివరికి దమైట్‌ఫాంగ్ లింగ్డో ఇచ్చిన క్రాస్ బంతి గోల్ చేసింది. 79వ నిమిషంలో యువ ఆటగాడు ఎవర్‌బ్రైట్‌సన్ సనా గెలిచి పెనాల్టీని గోల్‌గా మార్చడంతో షిల్లాంగ్ లాజోంగ్ ఆధిక్యంలోకి వెళ్లి పెనాల్టీని గోల్‌గా మార్చాడు. దీంతో షిల్లాంగ్ లాజోంగ్ సెమీ ఫైనల్‌కు చేరుకుంది.



# స్క్వాష్ బేగా ఓపెన్‌లో.. అనహాత్ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** ఎస్ఎస్‌డబ్ల్యూ స్క్వాష్ బేగా ఓపెన్‌లో తొలి పిఎస్ఎ కాపర్ ఫైనల్‌లో అనాహత్ సింగ్ నిష్క్రమించింది. నాల్గవ గేమ్‌లో గాయంతో వాకోవర్ ఇచ్చింది. ఆదివారం ఆస్ట్రేలియాలోని బేగాలో జరిగిన పిఎస్ఎ వరల్డ్ టూర్ ఈవెంట్-2025 ఎస్ఎస్‌డబ్ల్యూ స్క్వాష్ బేగా ఓపెన్‌లో భారత టీనేజ్ సంచలనం అనహత్ తన తొలి ఫైనల్‌లో రన్నరప్‌గా నిలిచింది. సెమీఫైనల్ సమయంలో చీలమండ గాయం కారణంగా ఆ యువతి తన విజయ పరంపరను కొనసాగించలేకపోయింది, దీంతో ఆమె ఈజిప్టుకు చెందిన హబీబా హానితో జరిగిన నాల్గవ గేమ్‌లో 11-9, 5-11, 8-11, 4-10 తేడాతో ఫైనల్ మ్యాచ్ నుండి వైదొలగాల్సి వచ్చింది. ప్రపంచ 53వ ర్యాంకర్ అనాహత్ ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి వరల్డ్ టూర్‌లో తన తొలి ఫైనల్‌కు చేరుకుంది. ఇది ఆమె మొదటిసారిగా ప్రపంచంలోని టాప్ 50 ర్యాంక్ క్రీడాకారిణుల జాబితాలోకి ప్రవేశించడానికి కూడా సహాయపడుతుంది. ఫైనల్లో, అనాహత్ మెరుగైన ఆరంభాన్ని ఇచ్చి ప్రారంభ గేమ్‌ను 11-9 తేడాతో గెలుచుకుంది. కానీ తర్వాత ఆమె గాయం తీవ్రం కావడంతో ఆమె యువ ఈజిప్షియన్ క్రీడాకారిణి వేగాన్ని అందుకోలేకపోయింది. దీంతో రెండవ గేమ్‌ను కోల్పోయింది. 17 ఏళ్ల ఆమె మూడవ గేమ్‌లో పోరాటం కొనసాగించినా కానీ 8-11తో దగ్గరగా ఓడిపోయింది.

## ఆసియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో

# హృదాన్‌కు స్వర్ణం

## 7 పతకాలతో ముగిసిన భారత్ పోరు



**న్యూఢిల్లీ:** ఆసియా కరాటే యూత్ ఛాంపియన్‌షిప్-2025ను భారత్ 7 పతకాలతో ముగించింది. హ్రిదాన్ జట్టు గతంలో మూడు పతకాలు సాధించిన ప్రదర్శనను మెరుగుపరుచుకోవడంతో ఈ సారి స్వర్ణంతో మెరిసింది. చివరి రోజు ఆదివారం హృదాన్ స్వర్ణంతో టోర్నమెంట్‌ను ముగించాడు. ఈ నెల 12 నుండి చైనాలోని లిన్పింగ్‌లో జరిగిన 2వ ఆసియా యూత్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ కరాటే జట్టు స్వర్ణంతో సహా మొత్తం ఏడు పతకాలను గెలుచుకుంది. కుమితేలో 4 మరియు కటాలో 3 పతకాలు గెలుచుకున్న యువ భారత బృందం. అండర్ 14 విభాగంలో హృదాన్ (50 కిలోల కుమితే) స్వర్ణం సాధించగా, కుష్ (40 కిలోల కుమితే) రజతంతో సరిపెట్టుకున్నాడు. క్యాడెట్‌లో లోహిత్ (63 కేజీల కుమితే). రైనా ( అండర్ 10 కటా) కాంస్య పతక విజేతల్లో ఉన్నారు. అండర్ 12 (45 కిలోల కుమితే) విభాగంలో విభు భారత్ పతకాల జాబితాలో మరో కాంస్యం సాధించాడు. హృదాన్, అర్మాన్, కుష్‌లతో కూడిన అండర్ 14 కటా జట్టు, శ్రేయాన్ష్, తుషార్, వశిష్ఠ్‌లతో కూడిన క్యాడెట్, జూనియర్ కటా టీమ్ ఒక్కో కాంస్యం గెలుచుకుంది. కాగా గత ఎడిషన్‌లో భారత బృందం కేవలం మూడు పతకాలు మాత్రమే గెలుచుకుంది.

# మహిళల వన్డేలో భారత్ ఓటమి

## 9 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే మూడో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమి చెందింది. 9 వికెట్లు తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. అయితే ఇప్పటికే జరిగిన రెండు వన్డే మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొంది 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇక బ్రిస్బేన్‌లో ఆదివారం జరిగిన మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తడబడింది. ఆస్ట్రేలియా బౌలర్లు తహ్లియా మెక్‌గ్రాత్ (8-0-40-3), అనిక లియారాయ్డ్ (3-0-16-2), ఎల్లా హేవర్డ్ (10-0-40-2), సియన్నా జింజర్ (8.4-0-50-2), లూసీ హ్యామిల్టన్ (10-2-34-1) సత్తా చాటడంతో 47.4 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌట్ అయింది. షెఫాలీ వర్మ (52), యస్తికా భాటియా (42) పోరాటపటిమ కనబర్చి భారత్‌కు ఈ మాత్రం స్కోరైనా అందించారు. వీరు మినహా టీమిండియాలో ఎవరూ రాణించ లేదు. నందిని కశ్యప్ (28), రఘువి బిస్త్ (18) తనుశ్రీ సర్కార్ (17), కెప్టెన్ రాధా యాదవ్ (18), తనుజా కన్వర్ (15) రెండంకెల స్కోర్లు చేయగా, తేజల్ హాసబ్నిస (1), మిన్నూ మణి (5), సైమా ఠాకోర్ (0), షబ్నమ్ షకీల్ (7 నాటౌట్) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా సునాయాసంగా ఛేదించింది. ఓపెనరల్ అలిస్సా హీలీ (84 బంతుల్లో 137 నాటౌట్, 23 ఫోర్లు, 3 సిక్సర్లు) సుడిగాలి శతకంతో ఆస్ట్రేలియాను విజయతీరాలకు చేర్చింది. ఆమెకు మరో ఓపెనర్ తహ్లియా విల్సన్ (59), రేచల్ ట్రెనామన్ (21 నాటౌట్) సహకరించారు. కాగా ఇరు జట్ల మధ్య ఏకైక టెస్ట్ మ్యాచ్ ఈ నెల 21 నుండి ప్రారంభం కానుంది. ఈ మల్టీ ఫార్మాట్ సిరీస్ కోసం టీమిండియా ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది.



# వాణిజ్యం



# ఇకపై గూగుల్‌లో వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహిస్తాం

## గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** వర్చువల్ విధానంలో ఉద్యోగనియామకాలు జరుపుతుంటే నమ్మకం కలిగిన వ్యక్తులు రావడంలేదని గూగుల్‌సిఇఒ సుందర్‌ఫిచాయ్ అన్నారు. అందుకే గూగుల్‌లో మళ్లీ వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధంచేస్తున్నట్లు వెల్లడించారు. మంచి నైపుణ్యం కలిగిన వ్యక్తులను నిర్ధారించుకోడానికి అభ్యరునతలను కనీసం ఒకవిడత వ్యక్తిగ్ ఇంటర్వ్యూలతో పరీక్షించాలని గూగుల్ యోచిస్తోందని పిచాయ్ తెలిపారు. కృత్రిమ మేథ అంటే ఎఐ విస్త1తంగా వ్యాప్తిచెందిందని, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు రిమోట్ జాబ్ ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించవద్దని గూగుల్ ఉదోనయగులు కంపెనీ మేనేజ్‌మెంట్‌ను డిమాండ్‌చేస్తున్నారు. ఉదోనయగంలోకి వచ్చాక అభ్యర్థులు రియల్‌టైమ్ కోడింగ్ సవాళ్లను పరిష్కారించాల్సి ఉంటుందని ఆన్‌లైన్ ఇంటర్వ్యూల సమయంలో కెమేరా బయట ఎఐ సాధనాలను ఉపయోగించడంవల్ల అభ్యర్థుల వాస్తవిక సత్తా తెలియడంలేదన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థుల్లో 50శాతం కంటే ఎక్కువమంది ఎఐ సాధనాలసాయంతోమోసంచేస్తున్నారని నియామక నిర్వాహకులు పేర్కొంటున్నట్లు తెలిపారు. మనమంతా హైబ్రిడ్‌గా పనిచేస్తున్నందున ఇంటర్వ్యూలలో కొంతభాగాన్ని వ్యక్తిగతంగా నిర్వహించడంపై ఆలోచించడం మంచిదని చెపుతున్నారు. గూగుల్ సంస్కృతిని అభ్యర్థులు అర్థంచేసుకోడానికి ఇది సాయపడుతుందని పిచాయ్ అన్నారు. ఈ సమస్య కేవలం గూగుల్‌కే పరిమితం కాలేదని ఐటిపరిశ్రమ వ్యాప్తం సంక్షోభంగా మారిందన్నారు. ఈ సమస్య సత్వరపరిష్కారానికి కృషిచేస్తున్నామని గూగుల్ వైస్‌ప్రెసిడెంట్ బ్రియాన్ ఓంగ్ అన్నారు.



# జిఎస్టీ సంస్కరణలకు రాష్ట్రాలు సహకరించాలి

## ప్రధాని నరేంద్ర మోడీ సూచనలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** జిఎస్టీ భావితరం సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను ఇప్పటికే రాష్ట్రాలకు పంపించామని, వాటి అమలుకు సహకరించాలని ప్రధానిమోడీ విజ్ఞప్తిచేసారు. ఈముసాయిదాలో మార్పులు పేద మధ్యతరగతి ప్రజలతోపాటు వ్యాపారులకు ఎంతోప్రయోజనకరంగా ఉంటాయన్నారు. ఢిల్లీలో రెండు హైవే ప్రాజెక్టుల ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడిన ప్రధానిమోడీ జీఎస్టీ చట్టాన్ని సరళీకృతంచేసి పనున రేట్లను సవరించాలని కేంద్రం భావిస్తోందన్నారు.

ఎన్డీయే దృష్టిలో సంస్కరణలు అనేవి సుపరిపాలన పురోగతిని సూచిస్తాయని సమీప భవిష్యత్తులో వ్యాపార కార్యకలాపాలు మరింత సులువుగా మార్చే లక్ష్యంతోనే సంస్కరణలు అమలుచేసేందుకు నెక్స్ట్‌జెన్ జీఎస్టీతో సిద్ధం అయ్యామని మోడీ అన్నారు. దీపావళినాటికి ఈసంస్కరణలు రెట్టింపు బోనస్ ఇస్తాయన్నారు. జీఎస్టీ సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను రాష్ట్రాలకు కేంద్రం పంపించింది. వీటికి అన్ని రాష్ట్రాలు సహకరిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. సాధ్యమైనంత త్వరగా ఈప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తిచేసారు.

ఈసంస్కరణలప్రతిపాదనలపై చర్చించేందుకు వచ్చేనెలలో జీఎస్టీ కౌన్సిల్‌భేటీ అవుతోందన్నారు. ప్రతిపాదిత రెండు శ్లాబుల విధానాన్ని జీఎస్టీ మండలి ఆమోదిస్తే ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల్లో 12,28 శాతం శ్లాబులు తొలగిపోనున్నాయని 5, 18శాతం శ్లాబులు మాత్రమే ఉంటాయన్నారు. ఇది గేమ్‌ఛేంజర్ సంస్కరణగా మిగిలిపోతుందని నిపుణులు చెపుతున్నారు.


ఆరునెలలపాటు సాగిన చర్చలు డజన్ల సమావేశాల తర్వాత ప్రతిపాది జీఎస్టీ విధానం తెరమీదకు వచ్చిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.



# మార్కెట్‌లోకి స్మార్ట్ యమహా హైబ్రిడ్ స్కూటర్

**చెన్నై, ఆగస్టు 17:** యమహా దేశీయ మార్కెట్‌లోకి హైబ్రిడ్ స్కూటర్‌ను పరిచయం చేసింది. 125సిసి ఇంజిన్‌తో తయారైన ఈ స్కూటర్ ఐదు రకాల్లో లభిస్తోంది. ఫాసినో 125 ఎఫ్ఐ హైబ్రిడ్, రేజెడ్ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్‌లు అడ్వాన్స్డ్ స్మార్ట్‌ఫీచర్స్, స్టైలిష్ లుక్‌తో తయారుచేసింది. ఈ స్కూటర్‌ప్రారంభ ధర రూ.79, 340నుంచి రూ.1,02,790ధరల్లో లభిస్తున్నాయి. స్మార్ట్‌మోటర్ టెక్నాలజీ, సైలంట్ స్టార్ట్ అండ్ స్టాప్ సిస్టమ్, నావిగేషన్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తయారుచేసింది.

# ఐటి పరిధిలో లేకున్నా రిటర్నులు దాఖలు చేయాల్సిందే!




**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నుల ఫైలింగ్ గడువు దగ్గర పడుతోంది. ఏటా జూలై ఆఖరు వరకు ఉండే గడువును ఈ సంవత్సరం ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు పొడిగించింది. చాలామంది తాము ఐటిపరిధిలోలేమని రిటర్న్ ఫైల్ చేయాల్సిన అవసరం ఏముందని అనుకుంటారు. అయితే ఆదాయం, పన్ను మినహాయింపు పరిధికి లోబడి ఉన్నా కొన్ని సందర్భాల్లో రిటర్న్ ఫైల్ చేయక తప్పదు. ఆదాయం తక్కువగా ఉన్నా చాలా మంది విదేశీ పర్యటనల్లో జోరుగా ఖర్చు చేస్తుంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ ఖర్చులు రూ.2 లక్షలు లేదా అంతకు మించి ఉంటే వారి ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా వారు తప్పనిసరిగా ఐటీ రిటర్న్ దాఖలు చేయాలి. ప్రపంచీకరణ పుణ్యమానీ భారతీయులూ పెద్దఎత్తున విదేశాల్లో ఆస్తులు కూడబెడుతున్నారు లేదా విదేశీ కంపెనీల షేర్లు, రుణ పత్రాల్లో మదుపు చేసి వాటిపై వచ్చే డివిడెండ్, వడ్డీ ఆదాయం పొందుతున్నారు. ఇలాంటి వ్యక్తుల ఆదాయం మన దేశంలో పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా.. తప్పనిసరిగా తమ విదేశీ ఆస్తులు, పెట్టుబడులు, ఆదాయ వివరాలతో ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో మీ ఆదాయం నుంచి టీడీఎస్ లేదా టీసీఎస్ రూ.25,000 లేదా అంతకు మించి ఉన్నా ఐటీ రిటర్న్ చేయడం తప్పనిసరి. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక వ్యక్తి వ్యాపార అమ్మకాలు, టర్నోవర్, ఆదాయం రూ.60 లక్షలు మించితే ఆ వ్యక్తి తప్పనిసరిగా రిటర్న్ ఫైల్ చేయాలి. అదే వృత్తి నిపుణులైతే వార్షిక ఆదాయం రూ.10 లక్షలు మించితే తప్పనిసరిగా రిటర్న్ దాఖలు చేయాలి. ఆర్థిక సంవత్సరంలో మీ వార్షిక కరెంటు బిల్లు రూ.2 లక్షలు లేదా అంతకు మించి ఉంటే తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి. మీ వార్షిక ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా, ట్యాక్స్ రిఫండ్ ఏమైనా ఉంటే, ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం తప్పనిసరి. ఈ రిటర్న్‌లోని సమాచారాన్ని సరిచూసుకునే ఆదాయ పన్ను శాఖ రిఫండ్ జారీ చేస్తుంది. ఏ వ్యక్తికైనా ఒక ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు కరెంట్ ఖాతాలో అయితే రూ.కోటి లేదా అంతకు మించి, సేవింగ్స్ బ్యాంకు ఖాతాలో అయితే రూ.50 లక్షలు లేదా అంతకు మించి డిపాజిట్లు ఉంటే వారు తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి. వార్షిక ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా పెట్టుబడి లాభాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) మినహాయింపు కోరుకునే వ్యక్తులూ తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి.




# ట్యారిఫ్ భయాలను అధిగమించే కొత్త జిఎస్టీ!

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ప్రతిపాదిత జిఎస్టీ సంస్కరణలను నెక్స్ట్ జెన్‌జీఎస్టీగా అధికారులు చెపుతున్నారు. సింగిల్ ట్యాక్స్ శ్లాబ్‌గా మారే అవకాశం ఉందని చెపుతున్నారు. కొత్త జీఎస్టీ విధానంలో ఐదుశాతం, 18శాతం శ్లాబులు మాత్రమే ఉండటంతో ఆర్థికవ్యవస్థ ఉత్తేజితం చేస్తుందని సదరు అధికారి తెలిపారు. టారిఫ్ భయాలను అధిగమించేలాచేస్తుందన్నారు జీఎస్టీ మండలి ఆమోదిస్తే ఇకపై 5,18 శ్లాబులు మాత్రమే ఉంటాయని అంటున్నారు. ఇదొక గేమ్‌ఛేంజర్ సంస్కరణ అని చెపుతున్నారు నిత్యావసరాలన్నింటిపైనా ఇక ఐదుశాతం జీఎస్టీ ఉంటుంది. జీఎస్టీ మండలి సమావేశంలో ఆమోదం పొందితేపన్నురేట్ల ఆధిక్యం ముగుస్తుందని, స్థిరత్వాన్ని తెస్తుందని అంచనా. ఇదే కొనసాగితే బహుశా 2047 నాటికి ఒకే శ్లాబ్ జీఎస్టీ స్థాయికి చేరతామనిజీఎస్టీ అధికారులే చెపుతున్నారు. ఇదే విధానం అమలులోకి వస్తే దేశం అభివృద్ధిచెందిన దేశాల జాబితాలోకి మారిపోతుందన్నారు. అప్పుడు ఇక దేశవ్యాప్తంగా ఒకే శ్లాబులో జీఎస్టీ కొనసాగుతుందని అధికారులు చెపుతున్నారు. ప్రతిపాదిత జిఎస్టీ విధానంలో సామాన్యుడి అవసరాలన్నీ కూడా ఐదుశాతం శ్లాబ్‌లోనే ఉంటాయి. ధరలు తగ్గడంతో వినియోగం కూడా పెరిగే అవకాశం ఉంది. తక్కువ పన్నులు విధించడం అంటే ప్రజల జేబుల్లో మరింతగా ఆదాచేయడమేని ప్రభుత్వం చెపుతోంది. ఆరునెలలపాటు జరిగిన సుదీర్ఘ తర్జనబర్జనల తర్వాత ఈ కొత్త నెక్స్ట్‌జెన్ జీఎస్టీ అమలుకువచ్చిందన్నారు.

# ఈవారం ఏడు పబ్లిక్ ఇష్యూలు!




**ముంబయి, ఆగస్టు 17:** మార్కెట్లలోకి ఈవారం ఏడు పబ్లిక్ ఇష్యూలు వస్తున్నాయి. మెయిన్‌బోర్డులో విక్రమ్‌సోలార్, శ్రీజీ షిప్పింగ్, జెమ్ ఏరోమాటిక్స్, పటేల్ రిటైల్ మంగళ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్‌లు ఇష్యూకు వచ్చాయి. వీటిలో మంగళ్ ఎలక్ట్రికల్ 28న స్టాక్ ఎక్ఛేంజిల్లో నమోదు అవుతుండగా మిగిలి నాలుగు కూడా 26న నమోదవుతున్నాయి. ఎస్ఎంఇ విభాగంలో రెండు కొత్త పబ్లిక్ ఇష్యూలు ఉన్నాయి. స్టూడియో ఎల్ఎస్‌డి, ఎల్జీటీ బిజినెస్ కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రధాన ఇష్యూల్లో ఈవారం బ్లూస్టోన్ జ్యూయెలరీ 19వ తేదీ రెగాల్ రీసోర్సెస్ 20న నమోదవుతున్నాయి. ఎస్ఎంఇ విభాగంలో 18న ఎఎన్‌బీ మెటల్‌క్యాస్ట్, స్టార్ ఇమేజింగ్; మెడిస్టెప్ హెల్త్‌కేర్, 19న ఇకోడెక్స్ పబ్లిషింగ్, 20న మహీంద్ర రియాల్టర్స్ ఎన్ఎస్ఇ ఎస్ఎంఇ ప్లాట్‌ఫామ్‌పై నమోదవుతూన్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.